ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-1-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 342 పేజీలు: 10+4 వెల: 6.50



కివీస్‌పై భారత్ విజయం 7

## 'మైనస్'లోకి వణుకు!

### దక్షిణ ఢిల్లీలో2.9 డిగ్రీలకు తగ్గుదల

### తెలంగాణలో 14 జిల్లాలలో సింగిల్ డిజిట్

### ఆసిఫాబాద్‌లో 7$^{0}$, ఆదిలాబాద్‌లో 7.9$^{0}$, సంగారెడ్డిలో 8.9$^{0}$



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి11:** దేశంలో చలి తీవ్రత అస్తవ్యస్తం చేస్తుంది. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాలను చలి చంపేస్తోంది. ముఖ్యంగా హిమాలయాల సమీపంలో ఉన్న రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. జమ్ము కశ్మీర్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నది. వీధుల్లో, ఇండ్లపైన ఎక్కడికక్కడ మంచు పేరుకుపోయింది. కశ్మీర్ లోయలోని సరస్సులు, చెరువులు, కుంటలలో ఉన్న నీరు గడ్డ కట్టుకుపోయింది. కశ్మీర్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన దాల్ సరస్సులో కూడా చలి తీవ్రతకు నీరు పాక్షికంగా గడ్డకట్టింది. సరస్సు పైభాగంలో చాలావరకు నీరు గడ్డకట్టి మంచు పొర ఏర్పడింది. ఇలాంటి సమయంలో దాల్ సరస్సును వీక్షించడం భక్తులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. తీవ్ర చలితో దేశ రాజధాని ఢిల్లీ గజగజ వణుకుతున్నది. శనివారం4.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతతో జనవరిలో అతి శీతల దినంగా నమోదైంది. ఢిల్లీలో ఉష్ణోగ్రతలు ఆదివారం కూడా మరింత >>2

## ఆ జెండా ఆగదు..

### సోమనాథ్ ఆలయంపై ఎగురుతున్నది భారత స్ఫూర్తి పతాకం

### చరిత్రను చెరిపేయడానికి యత్నించిన గతప్రభుత్వాలు

### నాడు పునరుద్ధరణను వ్యతిరేకించిన శక్తులే నేటికీ ఉన్నాయి

### వాటిని ఓడించి ముందుకు కదులుదాం

### సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో ప్రధాని మోడీ



ఆదివారం సోమనాథ్ దేవాలయ శౌర్యయాత్రలో పాల్గొన్న ప్రధాని మోడీ

**సోమ్‌నాథ్(గుజరాత్), జనవరి 11:** ప్రసిద్ధ సోమ్‌నాథ్ ఆలయ చరిత్రను తుడిచిపెట్టేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించాయి, బానిస మనస్తత్వంతో సోమ్‌నాథ్ ఆలయ ప్రాముఖ్యతను విస్మరించారని కాంగ్రెస్ పాలకులను ఉద్దేశించి ప్రధాని మోడీ విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్యానంతరం సర్దార్ పటేల్ చేసిన ఆలయ పునర్నిర్మాణ ప్రయత్నాలను అడ్డుకున్నారని ఆరోపించారు. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించాలని >>2



ఆదివారం సమ్మక్క గద్దెలకు మొక్కుతున్న డి.సిఎం భట్టి విక్రమార్క

## మేడారం పనులు 15 కల్లా పూర్తి

### ప్రపంచానికి జాతరను పరిచయం చేస్తాం

### రూ. 260 కోట్లు వెచ్చిస్తున్నాం: డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి11:** సమ్మక్క సారలమ్మ జాతర కేవలం గిరిజనుల పండుగ మాత్రమే కాదు ఈ వేడుక తెలంగాణ గుండె చప్పుడు ఆత్మ గౌరవ ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మేడారంలో జాతర పనులను మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి జాతర ఏర్పాట్ల పై సమీక్షించి తదుపరి మీడియాతో మాట్లాడారు. ఆ తరువాత అమ్మవారులను దర్శించుకున్నారు. సమ్మక్కసారలమ్మ జాతర విశిష్టతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా శాశ్వత నిర్మాణాలతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు జరుగుతున్నాయని తెలిపారు.ఈ జాతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం రూ.260 కోట్లు ఖర్చు చేస్తుందని ఇందులో జాతర నిర్వహణ కోసం రూ.150 కోట్లు శాశ్వతంగా గుడి నిర్మాణ పనులకు గాను రూ. 110 కోట్లు విచ్చిస్తున్నట్టు వివరించారు. నిధుల ఖర్చు చేయాల్సిన పనులు అన్ని విషయాలను మేడారంలో సమీక్షించి ఇక్కడికి ఇక్కడే నిర్ణయాలు చేసినట్టు డిప్యూటీ సీఎం మీడియాకు వివరించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి కాబోతున్నాయని తెలిపారు. ఇప్పటికీ జాతర పనులు సగటున 85శాతం పూర్తి చేశారు, మిగిలిన పనులు 15వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు >>2

# వడివడిగా ఎస్ఎల్‌బిసి

### సొరంగం తవ్వకాలకు ఆధునిక పరిజ్ఞానం

### క్షేత్రస్థాయి సిబ్బందికి 25% అదనపు జీతాలు

### పనుల పురోగతిపై సమీక్ష జరిపిన మంత్రి ఉత్తమ్



ఆదివారం హైదరాబాద్‌లో ఎస్ఎల్‌బిసి పనులపై అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి11:** ఎస్ఎల్‌బిసి నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని, సొరంగం తవ్వకాలకు ఆధునిక పరిజ్ఞానం వినియోగిస్తున్నామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొనానరు. భూగర్భ పరిస్థితుల అంచనాకు సపోర్ట్ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివారం ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, ఇంజనీర్లతో మంత్రి సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. యుద్ధ ప్రాతిపదికన పునఃప్రారంభ పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సొరంగం తవ్వడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నట్లు తెలిపారు. తొలగించిన టీబీఎం స్థానంలో అత్యాధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరపనున్నారని, మిగిలిన సొరంగ మార్గం 9.8 కిలో మీటర్ల పరిస్థితులపై సమాచారం అందించే ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పూర్తయినట్టు అధికారులు ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలిపారు. భూగర్భ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసే విధంగా సపోర్ట్ సిస్టం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి వివరించారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి 25శాతం అదనపు జీతాలు ఉంటాయని అన్నారు. భారత రాష్ట్ర సమితి పది సంవత్సరాల పాలన వల్లే ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఆలస్యం జరిగిందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణ పనులపై ప్రతి సోమవారం సమీక్ష చేస్తామని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండను సస్యశ్యామలం చేయడమే కాకుండా, ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా లేకుండా చేస్తామని మంత్రి ప్రకటించారు. సొరంగం తవ్వకాల్లో నూతన టెక్నాలజీ..గతంలో వినియోగించిన టన్నెల్ బోరింగ్ మెషిన్ (టిబిఎం) స్థానంలో ఇప్పుడు అత్యాధునిక పరిజ్ఞానాన్ని వాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగిలిఉన్న 9.8 కిలోమీటర్ల సొరంగం మార్గంలో భూగర్భ పరిస్థితులను అంచనా వేసేందుకు ఎలక్ట్రో మాగ్నెటిక్ సర్వేను ఇప్పటికే పూర్తి చేశారు. తవ్వకం సమయంలో మట్టి పొరలు విరిగిపడకుండా ఉండేందుకు పటిష్టమైన సపోర్ట్ సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తున్నారు. పనులు త్వరగా >>2



## పోలవరం-నల్లమలసాగర్‌పై నేడు 'సుప్రీం'లో విచారణ

### తెలంగాణ పిటిషన్‌పై న్యాయ పోరాటానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి11:** పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయపోరాటానికి పూర్తిస్థాయిలో సన్నద్ధమైనట్లు సమాచారం. ఈ కేసులో రాష్ట్రం తరఫున బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధం కావాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు న్యాయ బృందాన్ని, ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ఈ అంశంపై సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించనున్నారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన అన్ని రికార్డులను, కీలకమైన సమాచారాన్ని వెంటనే న్యాయవాదుల బృందానికి అందించాలని అధికారులను ఆదేశించారు. జలవనరుల శాఖ >>2

## భూభారతి అక్రమాలకు కళ్లెం

### ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగాన్ని సహించం

### ఆడిటింగ్ జరుపుతాం: మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి11:** ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం నాడు మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో రెవెన్యూ అధికారులతో సమావేశమైన మంత్రి పొంగులేటి రాష్ట్రంలోని జనగాం తదితర ప్రాంతాల్లో బయటపడిన స్టాంప్ డ్యూటీ సొమ్ము చెల్లింపుల్లో అక్రమాలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా మొత్తం 52 లక్షల లావాదేవీలలో 4,800 లోపాలు గుర్తించామని తెలిపారు. వీటిలో దాదాపు 3000 లోపాలు రంగారెడ్డి ,యాదాద్రి జిల్లాల్లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన మొత్తాన్నితప్పకుండా రికవరీ చేస్తామని తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన ఆడిటింగ్‌లో భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు >>2

## అన్నీ 'ఫ్యూచర్'లోనే!

### వివిధ అనుమతులు పూర్తిగా ఆన్‌లైన్

### ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పేరిట కొత్త వెబ్‌సైట్

### 32 గ్రామాల పరిధిలో భారీ విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీ

TELANGANA RISING

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి11:** ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకు వేస్తోంది. ఈ క్రమంలో ఫ్యూచర్ సిటీ కోసం సరి కొత్త వెబ్‌సైట్‌ను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వీలైనంత వేగంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వెబ్‌సైట్ల తరహాలోనే ఈ ఫ్యూచర్ సిటీ పోర్టల్ ఉండనుంది. ఫ్యూచర్ సిటీకి సంబంధించిన సమస్త సమాచారం ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు,పరిశ్రమల ప్రతినిధులు దీని ద్వారా తెలుసుకునేందుకు సులభమైన పద్ధతిలో వీలుంటుంది. ప్రస్తుతానికి ఫ్యూచర్ సిటీ తెలంగాణ పేరుతో ఒక వెబ్‌సైట్ మాత్రం అందుబాటులో ఉంచారు. ఇందులో రకరకాల ప్రాజెక్టుల సమగ్ర వివరాలున్నాయి. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచ గ్రామాల పరిధిలో ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతోంది.ఇటీవల ఇదే ప్రాంతంలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047 విజయవంతం కావడంతో నిరంతర అభివృద్ధి కార్యక్రమాలు వేగం కానున్నాయి.ఐటీ, ఫార్మా సంస్థలతో పాటు గేమింగ్ జోన్లు, వినోద కేంద్రాలు కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు.తొలిదశలో 32 గ్రామాల పరిధిలో 432 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఫ్యూచర్ సిటీ నిర్మించాలని ప్రతిపాదించగా, భవిష్యత్ విస్తరణకు అనువుగా 56 గ్రామాలు, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో నిర్మాణం కానుంది. ఇందులో ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాలు, పరిశ్రమలు, ప్రైవేటు విద్యా సంస్థలు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేందుకు ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్లను స్వీకరించనున్నారు. ఫ్యూచర్‌సిటీ పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు భూములు, పట్టాలు, ప్రభుత్వ భూముల సరిహద్దులను నిర్ణయించేందుకు ప్రత్యేకంగా ఇరవై మంది సర్వేయర్లను ప్రభుత్వం నియమించింది. మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ శాశ్వత భవన కార్యాలయాన్ని ఫిబ్రవరి నెలాఖరులోపు ప్రారంభించేందుకు అధికార వర్గాలు సన్నాహాలు చేస్తున్నారు. ఫ్యూచర్‌సిటీకి సంబంధించి కీలక అంశాలను ప్రశ్నలు, సమాధానాల రూపంలో ఫ్యూచర్‌సిటీ తెలంగాణ పోర్టల్‌లో ఉంచారు. ఇందులో ఇళ్ల నిర్మాణాలు, ప్లాట్ల క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయి. ప్రాజెక్టుపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు వెబ్‌సైట్‌లో ఎఫ్ఏక్యూస్ డిపార్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిస్ట్రిక్ట్ >>2

## కాంగ్రెస్‌కు బిజెపి ప్రత్యామ్నాయం కాదు

### రాష్ట్రంలో అసలైన రాజకీయపోరు కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యనే..

### మున్సిపల్ ఎన్నికల్లో మాకే పట్టం: కెటిఆర్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి11:** తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అసలైన రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆదివారం ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ముఖ్య నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించినగెలుపుకేవలం గాలివాటం మాత్రమేనని కొట్టిపారేశారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్లే అది సాధ్యమైందని, క్షేత్రస్థాయిలో బీజేపీకి ఎలాంటి బలం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ సీనియర్ నేతలు ఘోరంగా ఓడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు.గడిచిన 24 నెలల కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యాలతో నిండిపోయిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వైఫల్యాలను, హామీల వంచనను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.కృష్ణా నది జలాల వాటా, ఇతర అంతర్రాష్ట్ర సమస్యల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో బీజేపీ కూడా మౌనంగా ఉంటూ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్ 24 నెలల అసమర్థ పాలనను, బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని >>2

## సిబిఐ మాజీ జెడి భార్యకే సైబర్‌నేరగాళ్ల టోకరా!

### రూ. 2.5 కోట్లు కాజేసిన వైనం

**హైదరాబాద్, జనవరి 11:** మాజీ ఐపీఎస్ అధికారి భార్య ఒకరు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయారన్న వార్త వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ మాజీ ఐపీఎస్ అధికారి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అని, బాధితురాలు ఆయన భార్య ఊర్మిళ అని తెలియడంతో ఈ ఘటన అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో ఆమె నుంచి సైబర్ కేటుగాళ్లు ఏకంగా రూ.2.58 కోట్లు కాజేశారు. ఊర్మిళ వాట్సప్‌కు సైబర్ నేరగాళ్ల నుంచి ఓ మెసేజ్ వచ్చింది. తాము సూచించిన విధంగా స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే అతి తక్కువ సమయంలోనే అత్యధిక లాభాలు వస్తాయని నమ్మబలికారు. అనంతరం ఆమెను స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ గైడ్ ఎక్స్చేంజ్ 20 అనే వాట్సాప్ గ్రూపులో చేర్చారు. ఈ గ్రూప్‌లో దినేష్ సింగ్ అనే వ్యక్తి, తాను చెప్పినట్లు చేస్తే >>2



## జగత్‌కిలాడీలు

### రూ.547 కోట్లు దోచేశారు..

### సత్తుపల్లి కేంద్రంగా అంతర్జాతీయ దొంగలముఠా

### సాంకేతిక పరిజ్ఞానంతో సర్వం మాయ

### ఇప్పటికే 18 మంది అరెస్టు

**సత్తుపల్లి / పెనుబల్లి, ప్రభాతవార్త:** అమాయక ప్రజల కష్టాన్ని దోచుకుని చివరికి కటకటాలపాలైన అంతరాజతీయ దొంగల ముఠా కథ కంచికి చేరింది. ఒకటా రెండా ఏకంగా రూ.547 కోట్ల ప్రజాధనాన్ని వారికి తెలియకుండా వారి బ్యాంకు అకౌంట్లనుంచి కాజేయడమంటే మాటలా. సత్తుపల్లి కేంద్రంగా యదేచ్ఛగా సాగిన ఇంటర్నేషనల్ క్రైం కహానీ వింటే ఒళ్ళుగగుర్పొడుస్తుంది. ఖమ్మం జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్‌దత్.,ఈ దుర్మార్గానికి సంబంధించిన విషయాలను ఆదివారం పెనుబల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కమీషనర్ చెప్పిన అంశాలిలా ఉన్నాయి. సత్తుపల్లి ప్రాంతానికి చెందిన పోట్రు.మనోజ్‌కళ్యాణ్, ఉడతనేని.వికాస్ చౌదరిల నేతృత్వంలో యదేచ్ఛగా సాగిన >>2

# వడివడిగా ఎస్ఎల్బిసి

>> పూర్తి కావడానికి వీలుగా సొరంగం రెండు చివరల నుండి ఏకకాలంలో తవ్వకాలు జరపడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నల్గొండ జిల్లాలోని ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గంగా గుర్తింపు పొందిన ఈ ప్రాజెక్టు, కఠినమైన రాతి పొరలు, సాంకేతిక లోపాల వల్ల రెండు దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. గతంలో వాడిన టీబీఎం యంత్రాలు భూగర్భంలోని వేడికి, కఠిన శిలల ఒత్తిడికి తరచూ పాడైపోవడంతో పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వాల హయాంలో నిధుల కొరత, కాంట్రాక్టర్ల సమస్యల వల్ల నల్గొండ జిల్లా రైతులకు అందాల్సిన సాగునీరు, ప్రజల తాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 2026 నాటికి పూర్తి చేయాలనే పట్టుదలతో ఉంది. అయితే క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి 25 శాతం అదనపు జీతాలు ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు.

# జగత్ కిలాడీలు

>> సైబర్ క్రైం విలువ అక్షరాలా రూ.547కోట్లని ఆయన ప్రకటించారు. గత నెల 24 తేదీన తుంబూరు నివాసి మోదుగ సాయికిరణ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ మొదలెట్టగా ఇంతటి భారీ మోసం బయటపడిందని, నిరుద్యోగులకు ఉపాధి కల్పన పేరుతో వలపన్ని ఈ వికాస్‌చౌదరి, మనోజ్‌కళ్యాణ్, పోట్రు ప్రవీణ్, మేడా భానుప్రకాష్, మేడా సతీష్, మోరంపూడి చెన్నకేశవ అనే వ్యక్తులు సైబర్‌నేరానికి పాల్పడ్డారని వివరించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు వికాస్‌చౌదరి, మనోజ్‌కళ్యాణ్ ల కుటుంబ సభ్యులు ఇతర సన్నిహితుల బ్యాంకు అక్కౌంట్లను తనిఖీ చేయగా కళ్ళుబైర్లుకమ్మే నిజాలు వెలుగు చూశాయని కమీషనర్ పేర్కొన్నారు. మనోజ్ ఖాతాలో రూ.114.18కోట్లు, అతని భార్య మేడా భానుప్రియ రెండు అక్కౌంట్లలో రూ.45.62కోట్లు, మనోజ్‌కళ్యాణ్ సమీప బంధువు మేడా సతీష్ ఖాతాలో రూ.135.48కోట్లు, బొమ్మిడాల నాగలక్ష్మి ఖాతాలో రూ.81.72 కోట్లు, కరీంనగర్ నివాసి తాటికొండ రాజు కి చెందిన నరసింహ కిరాణా అండ్ డెయిరీ ఖాతాలో రూ.92.54కోట్లు, ఉడతనేని వికాస్‌చౌదరి ఖాతాలో రూ.80.41 కోట్ల లావాదేవీ జరిగినట్లు కనుగొన్నామని వెల్లడించారు. సత్తుపల్లి చుట్టుపక్కల అనేకమంది నిరుద్యోగులను ఎంచుకుని వారికి ఉద్యోగాల ఆశచూపి., జాతీయ బ్యాంకుల్లో వారితో ఖాతా తెరిపించి ఆయా అక్కౌంట్లలో క్రెడెన్షియల్స్ తీసుకుని ఈ నిందితులు కోట్ల రూపాయల సైబర్ క్రైం నేరాల సొత్తుని జమచేయడానికి వినియోగించారని దత్ వివరించారు. వీరు అంతర్జాతీయ సైబర్ క్రైం నేరస్థులతో జతకట్టి విదేశాల్లో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ., వాటిద్వారా స్వదేశంలోని కొందరు పౌరులకు పెట్టుబడి, మ్యాట్రిమోని, రివార్డ్‌పాయింట్స్, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెటింగ్ ఇన్‌వెస్టిమెంట్, అలానే క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్, వంటి పద్ధతుల్లో పెద్దఎత్తున అక్రమ నగదు లావాదేవీలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఈదగాకోర్ల మోసాలకు ఆకర్షింపబడే వారిని వారి టెలిగ్రామ్ గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి, తర్వాత వారికి మోసపూరిత లింకులు పంపి వారి అక్కౌంట్లనుంచి డబ్బులు దోచేశారని తెలిపారు. ఇలా పోగుపడిన కోట్ల డబ్బుని వారి ఏజెంట్లద్వారా ముందుగానే తెరిపించిన బ్యాంకు అక్కౌంట్లలోకి బదలాయించి తదుపరి కరెంట్ ఖాతాకు మార్చి చివరిగా పర్సనల్ అక్కౌంట్లకు అమెరికన్ డాలర్లు, క్రిప్టో కరెన్సీల రూపంతో మళ్ళించుకున్నారని కమీషనర్ దత్ పేర్కొన్నారు. ఈ కేసులో ముందుగా ప్రధాన నిందితుడు పోట్రు ప్రవీణ్ ని అరెస్ట్‌చేసి కోర్టుముందు హాజరుపరిచామని, అక్కడినుంచి తీగని లాగుతుంటే పెద్దడొంకంతా కదులుతున్నదని ఆయన చెప్పారు. నేరాలకు సహకరించిన సదాశివునిపాలెం, సీతారాంపురం, రామానగరం, తుమ్మూరు గ్రామాలకు చెందిన జుంజునూరి శివకృష్ణ, వడ్లమూడి నరేంద్ర, మల్లాది శివ, సాధు పవనసందీప్, సాధు సంధ్య, సాధు లేఖ, లతోపాటు లింగపాలెం నివాసి జొన్నాదుల తిరుమల, కందుకూరి మణికంఠ, తన్నీరు మహేష్, గోళ్ళమూడి నాగముఖేష్, కంచపోగు శ్రీనివాస్, రాయల అజయ్‌కుమార్, రాయల గోపి, పల్లా గణేష్, రాయల గోపీచంద్, కందుకూరి జగదీష్, కరీంనగర్‌కి చెందిన తాటికొండ రాజు, లను అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమీషనర్ వెల్లడిస్తూ., దర్యాప్తులో చాకచక్యంగా పనిచేసిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. ప్రతీ పౌరుడూ ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని, దేన్నీ తెలిగ్గా తీసుకుని మోసపోవద్దని ఆయన హితవుపలికారు.

## నేడు 'సుప్రీం'లో విచారణ

>> ప్రత్యేక కార్యదర్శి సాయి ప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఇంజినీర్‌ఇన్‌చీఫ్ నరసింహామూర్తి, అంతర్రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, న్యాయవాదులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఏటా గోదావరి నది నుంచి సుమారు 3000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, అందులో నుంచి కేవలం 200 టీఎంసీల నీటిని మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వివరించారు. దిగువ రాష్ట్రంగా మిగులు జలాలను వాడుకునే హక్కు గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (బిజూడీగి) అవార్డు ప్రకారమే ఆంధ్రప్రదేశ్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. 'మేం స్నేహ హస్తం అందిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసేలా కోర్టుకు వెళ్లడం విచారకరం' అని మంత్రి నిమ్మల వ్యాఖ్యానించారు. సముద్రంలో కలిసిపోతున్న నీటిని కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి వాడుకోవడంలో తప్పేంటని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇతర రాష్ట్రాల హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని, కేవలం మిగులు వరద జలాలను మాత్రమే వినియోగించుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. ఇప్పటికే ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, వారి సూచనల మేరకు మార్పులు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం డీపీఆర్ కోసం పిలిచిన టెండర్లు కేవలం ప్రాథమిక సన్నాహక చర్యలు మాత్రమేనని, అన్ని చట్టపరమైన అనుమతులు పొందిన తర్వాతే ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తామని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ గతవారం తేల్చిచెప్పారు.

### ఢిల్లీకేపిటల్స్‌పై గుజరాత్ టైటాన్స్ విజయం

**నవీముంబయి, జనవరి 11:** మహిళల ప్రీమియర్‌లీగ్‌లో ఢిల్లీ కేపిటల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ విక్టరీ నమోదుచేసింది. నాలుగు పరుగుల తేడాతో గెలిచి రెండో విజయం ఖాతాలో వేసుకుంది. 210 పరుగుల లక్ష్యంతో దిగిన ఢిల్లీ కేపిటల్స్ ఐదు వికెట్లు కోల్పోఇ 205 పరుగులకుపరిమితం అయింది. ఓపెనర్ లిజెల్లే లీ 54 బంతుల్లో 86 పరుగులు చేసింది. లారా వాల్వర్డ్ 77 పరుగులుచేసి అర్ధశతకాలతో అద్భుత ప్రదర్శనచేసారు. మిగిలిన బ్యాటర్లు తేలిపోవడంతో ఢిల్లీకి ఓటమి తప్పలేదు. గుజరాత్ బౌలర్లలో సోఫీ డివైన్ రాజేశ్వరి చెరో రెండు వికెట్లు తీస్తే కష్వీగౌతమ్ ఒక వికెట్ తీసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌చేసిన గుజరాత్ సరిగ్గా 20 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది. సోఫీ డివైన్ 95, ఆష్లే గార్డనర్ 49 మినహా ఎవ్వరూరాణించలేదు. బెత్‌మూనీ 19, అనుష్కశర్మ 13, కష్వీగౌతమ్ 14 రెండంకెల స్కోరుచేసారు. నందినీశర్మ 33పరుగులిచ్చి ఐదు వికెట్లుతీసింది. మిగిలినబౌలర్లలో హెన్రీ రెండు, శ్రీచరణి రెండు, షెఫాలీ వర్మ ఒక వికెట్‌తీసారు.



ఆదివారం సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రధాని మోడీ



ఆదివారం సోమనాథ్ శౌర్యయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 108 గుర్రాల కాన్వాయ్

# ఆ జెండా ఆగదు..

>> నిర్ణయించుకుంటే నాటి పాలకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ప్రధాని ధ్వజమెత్తారు. అటువంటి శక్తులు భారతదేశానికి వ్యతిరేకంగా ఇప్పటికీ దుర్మార్గపు పద్ధతులను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. బుజ్జగింపు రాజకీయాల కోసం మతపరమైన దాడులను కప్పిపుచ్చడానికి ప్రయత్నాలు జరిగాయని, ద్వేషం, క్రూరత్వపు చరిత్రను ప్రజల నుండి దాచిపెట్టారని పేర్కొన్నారు. మూడు రోజుల గుజరాత్ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ ఆదివారం సోమనాథ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. సోమనాథ్‌పై విదేశీ దురాక్రమణదారులు అనేక దండయాత్రలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సోమ్‌నాథ్ ఆలయం.. ధైర్యం, త్యాగాలు, దృఢసంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. గజనీ మహ్మద్ సైన్యం సోమ్‌నాథ్‌పై దాడిచేసి విధ్వంసం సృష్టించి వెయ్యేళ్లు పూర్తయినా కూడా ఆ ఆలయంపై జెండా ఎగురుతూనే ఉందని, అది భారతదేశ స్ఫూర్తిని ప్రపంచానికి చాటుతోందని ప్రధాని వ్యాఖ్యానించారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ భారతదేశ విశ్వాసానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇవాళ తాను స్వాభిమాన్ పర్వ్‌లో పాల్గొనడం ఒక గొప్ప జ్ఞాపకమని చెప్పారు. ఈ జ్ఞాపకాన్ని తాను ఈ జీవితంలో మరిచిపోలేనని అన్నారు.

"ఈ రోజు, యావత్ దేశం, నలుమూలల నుండి విచ్చేసిన లక్షలాది మంది ప్రజలు మనతో చేరారు. వారందరికీ జై సోమనాథ్ ఆశీస్సులు ఉంటాయి. ఈ సమయం అద్భుతం, ఈ వాతావరణం అద్భుతం, ఈ వేడుక అద్భుతం. ఒక వైపు, మహాదేవుడు, మరోవైపు, సముద్రపు అలలు, సూర్యకిరణాలు, మంత్రాల ప్రతిధ్వని, ఈ విశ్వాసం ఉప్పెన, ఈ దైవిక వాతావరణంలో సోమనాథ్ భక్తుల ఉనికి.. ఈ సందర్భాన్ని గొప్పగా.. దివ్యంగా మారుస్తున్నాయి" అని ప్రధాని మోడీ అన్నారు. సోమనాథ్ చరిత్ర విధ్వంసం, ఓటమికి సంబంధించినది కాదని, అది విజయం, పునర్నిర్మాణానికి సంబంధించినదని అన్నారు. వెయ్యి సంవత్సరాల క్రితం వరకు, ఆ నిరంకుశులు ఆలయాన్ని నాశనం చేశామని భావించారని, కానీ వెయ్యి సంవత్సరాల తర్వాత, సోమనాథ్ ఆలయంపై ఎగురుతున్న జెండా భారతదేశ శక్తిని చూపిస్తుందని ఆయన అన్నారు. మన పూర్వీకులు మహాదేవుడి పట్ల విశ్వాసం కోసం ప్రతిదీ త్యాగం చేశారని ప్రధాని మోడీ గుర్తు చేశారు.

ఈ కార్యక్రమం గర్వం, గౌరవ జ్ఞానంతో నిండి ఉందని ఆయన అన్నారు. ఈ గొప్పతనం, ఆధ్యాత్మికత, అనుభవం, ఆనందం, సాన్నిహిత్యం, సర్వోన్నత దేవుడు మహాదేవ్ ఆశీర్వాదాల వారసత్వాన్ని కలిగి ఉందని ఆయన అన్నారు. సోమనాథ్‌ను నాశనం చేయడానికి వచ్చిన మతపరమైన ఉగ్రవాదులు చరిత్ర పుటలకు పరిమితమయ్యారని ఆయన అన్నారు.

ఘజినీ నుండి ఔరంగజేబు వరకు దండయాత్రదారులు సోమనాథ్‌పై దాడి చేసినప్పుడు, వారి కత్తులు శాశ్వతమైన సోమనాథ్‌ను జయిస్తున్నట్లు భావించారని ప్రధాని మోడీ అన్నారు. మత ఛాందసవాదులు నాశనం చేయాలనుకున్న సోమనాథ్ పేరుకు సోమ్ అంటే అమృతం జతచేయబడిందని అర్థం చేసుకోలేకపోయారు. హాలాహలం తాగిన తర్వాత కూడా అమరత్వం పొంది ఉండాలనే ఆలోచన ఇందులో ఉంది. దానిలో సదాశివ మహాదేవ్ రూపంలో స్పృహ శక్తి నివసిస్తుంది. ఉగ్రమైన తాండవానికి మూలం: శివ: శక్తి. సోమనాథ్‌లో నివసించే మహాదేవుడిని మృత్యుంజయుడు అని కూడా పిలుస్తారు, అంటే కాల స్వరూపమైన మృత్యువును జయించినవాడు అని ప్రధాని మోడీ అన్నారు. సోమనాథ్ చరిత్ర విధ్వంసం - ఓటమికి సంబంధించినది కాదని, ఇది విజయం - పునర్నిర్మాణ చరిత్ర అని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

స్వాతంత్రం వచ్చిన తర్వాత సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించిన శక్తులు ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని ఐక్యంగా, బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బుజ్జగింపు విధానాలు అనుసరించి కొందరు సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తీవ్రవాద ఆలోచనా విధానం ఉన్న వ్యక్తుల ముందు మోకరిల్లారని, ఇవే శక్తులు ఇప్పటికీ మన మధ్య ఉన్నాయని అన్నారు. ఆ శక్తులను ఓడించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండి ఐక్యమత్యంగా, బలంగా వారి ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు.

# శౌర్యయాత్రలో ప్రధాని

## కాన్వాయ్ వెంట 108 అశ్వాలు

## డమరుకం మోగించిన మోడీ

### అబ్బురపరిచిన కళాకారుల ప్రదర్శనలు

### యాత్రలో మార్మోగిన హరహర మహాదేవ్

**సోమనాథ్(గుజరాత్), జనవరి 11:** సోమనాథ్‌లో ఆదివారం స్వాభిమాన్ పర్వ్‌లో భాగంగా నిర్వహించిన శౌర్య యాత్రకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వం వహించారు. పూలతో ఆలంకరించిన వాహనంలో యాత్రలో పాల్గొన్న మోడీ, మధ్యలో డమరుకం మోగించారు. ఇందులో ప్రధాని మోడీతో పాటు గుజరాత్ సిఎం భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సింఘ్వీ పాల్గొన్నారు. ఈ యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విదేశీ దురాక్రమణదారుల నుంచి సోమనాథ్ ఆలయాన్ని కాపాడుతూ ప్రాణత్యాగం చేసిన వీరులకు గుర్తుగా ఏటా ఈ శౌర్యయాత్ర నిర్వహిస్తుంటారు. ఈ సంవత్సరం కూడా శౌర్యయాత్రను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సారి ప్రధాని నరేంద్ర మోడీ ఈ యాత్రలో పాల్గొన్నారు. శౌర్య యాత్రలో భాగంగా మోడీ ఆ యోధులకు నివాళి అర్పించారు. ఈ యాత్రకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు, మోడీ.. మోడీ అని నినాదాలు చేస్తూ ఆయనకు స్వాగతం పలికారు. వలసవాదుల దాడుల నుంచి సోమ్‌నాథ్ ఆలయ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వారికి గౌరవ సూచకంగా ఈ యాత్రను చేపట్టారు. శౌర్యం, త్యాగానికి ప్రతీకగా 108 అశ్వాలతో ఊరేగింపు నిర్వహించారు. ఇక ఇక్కడ ఏర్పాటు చేసిన 108 గుర్రాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. శౌర్య యాత్రలో భాగంగా ఆలయం వైపు వెళ్తున్న మోడీకి అశ్వాలే ఎస్కార్ట్‌గా మారినట్లు ఆ దృశ్యం కనిపించింది. దాదాపు కిలోమీటరు మేర సాగిన ఈ యాత్రలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనగా, హరహర మహాదేవ్ నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. యాత్ర పొడవున జనం నీరాజనం పట్టారు. వివిధ కళలకు సంబంధించిన కళాకారులు తమ కళలను ప్రదర్శించి అబ్బురపరిచారు. యువ పూజారుల బృందం శివుని వాయిద్యం డమరు వాయిస్తూ మోడీ వాహనం వెంట నడిచారు. ఒకానొక సమయంలో మోడీ స్వయంగా ఒక పూజారి నుండి రెండు డమరులను తీసుకుని తన వాహనంపై నిలబడే వాటిని వాయించారు. అనంతరం సోమనాథ్ మహాదేవుడి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని ప్రధాని మోడీ దర్శించుకున్నారు. వేదపండితుల సమక్షంలో మహదేవునికి ప్రత్యేక పూజలు చేశారు.

# భూభారతి అక్రమాలకు కళ్లెం

>> చెల్లించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చలాన్ సొమ్మును పక్కదారి పట్టిన విషయాన్ని గుర్తించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడిన ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌లో ఆడిటింగ్ విధానం లేకపోవడమే ఇలాంటి అక్రమాలకు ప్రధాన కారణమని ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి, లోతైన విచారణ జరిపించి బాధ్యులెవరో తేల్చి చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. ఈ అక్రమాల్లో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందా లేదా అన్న అంశంపై కూడా లోతైన విచారణ జరపాలని, ఎవరైనా తప్పు చేసినట్టు తేలితే ఎంత పెద్దవారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి తేల్చిచెప్పారు. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చిన నాటి నుంచి గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన అన్ని లావాదేవీలపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఆడిటింగ్ నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ప్రభుత్వానికి రావలసిన ఒక్క పైసా సొమ్ము దుర్వినియోగం చేసినా సహించేది లేదని స్పష్టమైన హెచ్చరిక చేశారు. ప్రజల సొమ్ముతో ఆడుకున్న వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తామని, ఇలాంటి అక్రమాలకు ఇకపై తావు ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

12-01-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం, ఉత్తరాషాఢ కార్తె
నవమి మ.12.43
స్వాతి రా.9.06
వర్జ్యం : రా.3.24-5.12
దు.ము.12.39-1.24
2) మ.2.54-3.39
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక విషయాలలో తవపర భేదం ఉండదన్న విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. శ్రమ అధికం.

**వృషభం:** ఋణాలకు సంబంధించిన అంశాలు కీలకమవుతాయి. సహోదరీ వర్గానికి సహాయసహకారాలను అందిస్తారు.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాల్లో ఆచితూచి అడుగువేయండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**కర్కాటకం:** సన్నిహితులనుండి సహాయ సహకారాలను అందుకుంటారు. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**సింహం:** పెట్టుబడుల విషయాలలో నిదానం అవసరం. పారిశ్రామిక, రాజకీయ రంగాలవారికి కొంత అనుకూలంగా ఉంటుంది.

**కన్య :** మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుని పనులు చక్కదిద్దుకుంటారు. శుభవార్తలు అందుకుంటారు.

**తుల :** కొత్త విషయాలు తెలుసుకుంటారు. మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. వాహనసౌఖ్యం. క్రయ విక్రయాలలో లాభాలు.

**వృశ్చికం:** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఖర్చులు అధికంగా ఉంటాయి.

**మకరం:** ఎగుమతి, దిగుమతి వ్యాపారాలలో లాభాలు లభిస్తాయి. పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లుగా మీరు భావిస్తారు.

**కుంభం:** వ్యక్తిగత పురోభివృద్ధికి ఉపకరించే ఏ చిన్నపాటి అంశాన్ని కూడా నిర్లక్ష్యం చేయరు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**మీనం :** చర్చలు, మంతనాలు, కుటుంబ వ్యవహారాలలో క్షణం తీరక లేకుండా కాలం సమానంగా పరుగులు పెడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'మైనస్'లోకి వణుకు!

>> దారుణంగా పడిపోయాయి. 4.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చాలా ప్రాంతాల్లో 4 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అటు సౌత్ ఢిల్లీలోని ఆయానగర్‌లో 2.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతతో ప్రజలు వణికిపోయారు. గరిష్ట ఉష్ణోగ్రత 16 డిగ్రీల వద్దే ఉంటుందని పేర్కొంటూ ఐఎండి ఎల్లో అలర్ట్‌జారి చేసింది. అంతే స్థాయిలో దేశంలో చాలా చోట్ల చలి తీవ్రత ఉంది. ఈ శీతాకాలంలో ఇదే అతి కనిష్ఠ ఉష్ణోగ్రత కూడా. మరోవైపు చలి తీవ్రతకు జమ్ము కశ్మీర్ కూడా వణికిపోతున్నది. కొన్ని ప్రాంతాల్లో అయితే మైనస్ డిగ్రీలు కూడా నమోదవుతున్నాయి. సరస్సులు, కొలనుల్లో నీరు గడ్డకట్టుకుపోయింది. ఇదిలా ఉండగా తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. తెలంగాణలో రాత్రి నుంచి ఉదయం వరకు చలి విణికిస్తోంది. పొగమంచు, చలి గాలుల తీవ్రతతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే మూడు రోజులు చలి మరింత పెరుగుతుందని, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు ఈ నెల చివరి వారంలో ఉత్తర, మధ్య తెలంగాణ, తూర్పు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈసారి వాయుగుండం ప్రభావం ఏపీపై పెద్దగా లేకపోవడం రైతులకు భారీ ఊరటగా మారింది. శ్రీలంక సమీపంలో తీరం దాటి బలహీనపడిన వాయుగుండం తమిళనాడు వైపు కదులుతుండగా.. ఆంధ్రాలో రాయలసీమ-దక్షిణ కోస్తా ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలకే పరిమితమవనుంది. పంట కోత దశలో ఉన్న రైతులకు ఇది బిగ్ రిలీఫ్ అని చెప్పాలి. తిరుపతి, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది. మరోవైపు ఉత్తర గాలుల ప్రభావంతో చలి తీవ్రత కొనసాగనుండగా.. తెలంగాణలో కూడా వచ్చే మూడు రోజులు ఉష్ణోగ్రతలు 11 నుంచి 11 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరికొన్ని చోట్ల సింగిల్ డిజిట్లలో కనిష్ట ఉష్ణోగ్రతలే నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఈ గాలుల తీవ్రత మరింతగా వుండడం వల్ల తొమ్మిది జిల్లాలలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్ప ఉష్ణోగ్రత ఆసిఫాబాద్‌లోని సిర్పూర్‌లో 7 డిగ్రీలు, దీని తరువాత ఆదిలాబాద్‌లోని బేలలో 7.9 డిగ్రీలు, సంగారెడ్డిలోని కోహీర్‌లో 8.9 డిగ్రీలుగా వున్నాయి. దీని తరువాత రంగారెడ్డిలోని మొయినాబాద్‌లో 9 డిగ్రీలు కామారెడ్డిలోని జుక్కల్‌లో 9.1 డిగ్రీలు, నిజామాబాద్‌లోని సాలూరాలో 9.5 డిగ్రీలు, వికారాబాద్‌లోని మర్పల్లిలో 9.6 డిగ్రీలు, నిర్మల్‌లోని పెంబిలో 9.6 డిగ్రీలు. మెడ్చల్‌లోని ఉప్పల్‌లో 9.8 డిగ్రీలు, సిరిసిల్లాలోని గంభీ రావుపేటలో 10 డిగ్రీలు, మెదక్‌లోని ఎద్దుర్తిలో 10.5 డిగ్రీలు, జగిత్యాలలోని భీమారంలో 10.5 డిగ్రీలు, సిద్దిపేట్‌లో ని దుబ్బాకలో 10.5 డిగ్రీ లు, మంచిర్యాలలోని జన్నారంలో 10.8 డిగ్రీలు, కరీంనగర్‌లోని కొత్తపల్లిలో 11 డిగ్రీలు, హైదరాబాద్‌లోని తిరుమల్‌గిరిలో 11.1 డిగ్రీలు, నారాయణ్‌పేట్‌లోని స్థానిక పట్టణంలో 11.2 డి గ్రీలు, భువనగిరిలోని రాజపేట్‌లో 11.3 డిగ్రీలు, భూపాలపల్లిలోని ముత్తారంలో 11.5 డిగ్రీలు, పెద్దప ల్లిలోని అంతర్గాంలో 11.8 డిగ్రీలు, జనగాంలోని బచ్చన్నపేట్‌లో 12 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లోని గండీడ్‌లో 12.3 డిగ్రీలు, ములుగులోని కన్నా యిగూడెంలో 12.9 డిగ్రీలు, హనుమకొండలోని ధర్మాసాగర్ లో 13 డిగ్రీలు, నాగర్‌కర్నూలులోని కల్వకుర్తిలో 13 డిగ్రీలు, నల్లగొండలోని చింతప ల్లెలో 13.2 డిగ్రీలు, వరంగల్‌లోని నల్లబెల్లిలో 13.8 డిగ్రీలు, భద్రాచలంలోని పెంట్లంలో 14.2 డిగ్రీలు, మహబూబాబాద్‌లోని బయ్యారంలో 14.2 డిగ్రీలు, సూర్యాపేట్‌లోని చిల్కూరులో 14.2 డిగ్రీలు, ఖమ్మంలోని గౌరారంలో 14.2 డిగ్రీలు, వనపర్తిలోని ఘన్‌పూర్‌లో 15.5 డిగ్రీలు, గ ద్వాలలోని ధారూర్‌లో 16.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**నేడు ఏపీలో పలు జిల్లాల్లోవ వర్షాలు ..** ఏపీలో సోమవారం పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

# అన్నీ 'ఫ్యూచర్'లోనే!

>> కూలింగ్ విధానం (డీసీఎస్) అమలులోకి తేనున్నారు. ఏసీ లేకుండానే చల్లబర్చే డీసీఎస్‌ను కొత్తగా నిర్మించే నగరాలు, టౌన్ షిప్పులు, మాల్స్‌లో ఇప్పుడు ఎక్కువగా వాడుతున్నారు. తెలంగాణలో మొదటగా ఫ్యూచర్ సిటీలో అమలుకు సర్కారు వివిధ ప్రణాళికలు సైతం సిద్ధం చేసింది. ఇటీవల తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్‌లో దీని గురించి ప్రకటన సైతం చేశారు. ఈ ఫ్యూచర్ సిటీలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్(సీబీడీ) అత్యంత కీలకం కానుంది. సీబీడీని క్రమంగా పలు జోన్లుగా అభివృద్ధి చేస్తారు. ఇందులో 300 ఎకరాల్లో ఏఐ సిటీ, 200 ఎకరాల్లో హెల్త్ సిటీ, 500 ఎకరాలను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తారు. 3వేల ఎకరాల్లో లైఫ్‌సైన్సెస్‌హబ్‌ను డెవలప్ చేయనున్నారు. ఇక్కడ డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానాన్నే అమలు చేయనున్నారు. గుజరాత్ లోని గిఫ్ట్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానాన్నే వాడుతున్నారు. అలానే రాష్ట్రంలోని పోచారంలో ఇన్ఫోసిస్, ఐటీ కారిడార్‌లోని ఒక గేటెట్ కమ్యూనిటీలో ఈ తరహాలోనే కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు అధునాతమైన డీసీఎస్‌ను ఫ్యూచర్ సిటీకి ప్రభుత్వం పరిచయం చేయనుంది. ప్రస్తుతానికి 30వేల ఎకరాలు పరిధిలో ఈ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారు. ఇందులో 15వేల ఎకరాలు రెవెన్యూ ల్యాండ్, 15వేల ఎకరాలు ఫారెస్ట్ ల్యాండ్ ఉంది. ఇందులో కొంత అర్బన్ ఫారెస్ట్‌కు వినియోగిస్తారని సమాచారం.

# సైబర్‌నేరగాళ్ల టోకరా!

>> 500 శాతం లాభాలు ఖాయమని, కొన్ని స్క్రీన్‌షాట్లు పంపి నమ్మించాడు. అతనికి సహకరిస్తూ, అదే ముఠాకు చెందిన ప్రియసఖి అనే మహిళ తనకు కూడా లాభాలు వచ్చాయంటూ గ్రూప్‌లో పోస్టులు పెట్టింది. వీరి మాయ మాటలు నమ్మిన ఊర్మిళ, యాపిల్ యాప్ స్టోర్ నుంచి "ఎంకేసీఎం" అనే నకిలీ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. అనంతరం డిసెంబర్ 24 నుంచి జనవరి 5 మధ్య కాలంలో పలు దఫాలుగా రూ.2.58 కోట్లను నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశారు. ఇందుకోసం తన వద్ద ఉన్న బంగారంతో పాటు, భర్త లక్ష్మీనారాయణకు చెందిన బంగారాన్ని కూడా ఆమె తాకట్టు పెట్టడం గమనార్హం. యాప్‌లో లాభాలు కనిపిస్తున్నా, డబ్బును వెనక్కి తీసుకునే (విత్‌డ్రా) ఆప్షన్ లేకపోవడంతో తాను మోసపోయానని ఆమె గ్రహించారు. వెంటనే బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు, ఊర్మిళ పంపిన డబ్బును సైబర్ నేరగాళ్లు మ్యూల్ ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఆఖాతాలను గుర్తించి, నిందితులను పట్టుకునే పనిలో ఉన్నామని పోలీసులు తెలిపారు.

## మేడారం పనులు 15 కల్లా పూర్తి

>> ఆదేశించారు. జాతర సందర్భంగా అవసరమైన నిధులు విడుదల చేశాం, పూర్తి చేసిన పనులకు 24గంటల్లో బిల్లులు మంజూరు చేస్తున్నామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. గతంలో జాతర నిర్వహణకు రూ.75 కోట్లు, రూ.100 కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం రూ. 260 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ప్రధానంగా ఆరోగ్య, విద్యుత్ శాఖ అధికారులు జాతర పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని వీరితో పాటు యావత్ శాఖల సిబ్బంది అధికారులు జాతర నిర్వహణను సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రత్యామ్నాయం కాదు

>> బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవలి ఉప ఎన్నికలు, పంచాయతీ పోల్స్‌లో ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మొన్న జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల నుంచి మొదలుకొని పంచాయతీ సర్పంచుల వరకు ప్రతి ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి వైపు ప్రజలు నిలబడ్డారన్నారు. అసెంబ్లీలో పోటీ చేసిన ప్రతి ఒక్క బిజెపి సీనియర్ నేతలు ఘోరమైన ఓటమి పాలయ్యారని, పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం గాలివాటంగా గెలిచారన్నారు. బిజెపి రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కి ప్రత్యామ్నాయం కాబోదని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాల పైన, అవినీతి పైన, అక్రమాల పైన 24 నెలలుగా తెలంగాణ ప్రజల పక్షాన కొట్లాడుతున్న పార్టీ భారత రాష్ట్ర సమితి అని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో చేసిన అధికారదుర్వినియోగం, చెప్పిన తప్పుడు లెక్కలు అన్నీ రానున్న ఎన్నికల్లో తేలిపోతాయని కేటీఆర్ అన్నారు.

## ఖమ్మంలో నేడు సిపిఐ నిర్వహణలో

# కవి సమ్మేళనం

### పార్టీ వందేళ్ల ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహణ

### రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** భారత్ కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. నేడు (సోమవారం) ఖమ్మం పట్టణంలో కవి సమ్మేళనాన్ని నిర్వహించాలని సిపిఐ నిర్ణయించింది. వందేళ్ల ముగింపు సందర్భంగా నేడు ఖమ్మంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శత వసంతాలు పూర్తి చేసుకున్నందున జనవరి 18న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే నేడు(సోమవారం) ఉదయం 10 గంటలకు ఖమ్మం, డీపిఆర్‌పి భవన్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కవి సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరవు తున్న ట్లు తెలిపారు. కవి సమ్మేళనంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అభ్యుదయ కవులు పాల్గొని తమ కవితాగానం ఇస్తారని సాంబశివరావు ప్రకటనలో స్పష్టం చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, వేదికపై డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు

## రామగుండం అభివృద్ధికి భారీ ఊతం

### లబ్ధిదారులకు 633 డబుల్‌బెడ్ ఇళ్ల పంపిణీ

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**గోదావరిఖని, ప్రభాతవార్త:** పేదల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రామగుండం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, డబుల్‌బెడ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

రామగుండం నగరంలోని వివిధ డివిజన్లలో రూ.80.52 కోట్లతో అభివృద్ధి పనులు, టీయూఎఫ్ఐడీ ద్వారా రూ.88.90 కోట్లతో తాగునీటి పైప్‌లైన్ పనులు, ఆర్!!బీ శాఖ ద్వారా రూ.6.5 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 633 డబుల్ బెడ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి, 494 మంది అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇండ్లుజూనియర్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇండ్ల మంజూరు చేయడం చరిత్రాత్మకమన్నారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల హామీలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాజకీయాలకతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రామగుండాన్ని ఉపాధి, పరిశ్రమలు, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రామగుండం ఆలయాల అభివృద్ధికి ..3 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు.

## వెనిజులా చమురు రాబడుల కోసం ట్రంప్ నేషనల్ ఎమర్జెన్సీ విధింపు

**వాషింగ్టన్, జనవరి 11:** అమెరికా ఖాతాల్లో ఉన్న వెనిజులా చమురు విక్రయాల ఆదాయంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. ఈ నిధులు ఎలాంటి న్యాయపరమైన జప్తులకు గురికాకుండా చూసేందుకు నేషనల్ ఎమర్జెన్సీని ప్రకటించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. అమెరికా ట్రెజరీ ఖాతాల్లో ఉన్న వెనిజులా నిధులపై ఏ విధమైన అటాచ్‌మెంట్‌లు, కోర్టు తీర్పులు లేదా ఇతర జుడీషియల్ చర్యలు చెల్లుబాటు కాకుండా ఈ ఉత్తర్వులు అడ్డుకుంటాయి. వెనిజులా ముడి చమురు విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపై అమెరికా తన పట్టును నిలుపుకోవడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశం. వెనిజులా రాజకీయ, ఆర్థిక స్థిరత్వం కోసం అమెరికా చేసే ప్రయత్నాలకు ఈ నిధులు కీలకం కానున్నాయి. అమెరికా దళాలువెనిజులాలో మెరుపు దాడులు నిర్వహించి అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించిన వారం రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది.

# ఉత్తర బంగాళాఖాతంలో భారత్ కొత్త నేవీబేస్!

### చైనా, బంగ్లాదేశ్‌ను కట్టడి చేసేందుకు దీటుగా వ్యూహం

**న్యూఢిల్లీ, జనవరి 11:** చైనా, బంగ్లాదేశ్ కదలికలపై నిఘా మరింత కట్టుదిట్టం చేయడానికి భారత్ సిద్ధమైంది. పొరుగుదేశాల కుట్రలను ధీటుగా కట్టడిచేసేందుకు భారత్ సమాయత్తం అయింది. ఈ మేరకు ఉత్తర బంగాళా ఖాతంలో దాయాదుల చర్యలపై కన్నేసేందుకు మరో నౌకాదళ స్థావరాన్ని (నేవీ బేస్) ఏర్పాటు చేసేందుకు ఇండియన్ నేవీ రెడీ అయింది. బంగాళాఖాతంలోని పశ్చిమ బెంగాల్ తీరం హాల్దియాలో కొత్త నౌకాదళ స్థావరం ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే ఉన్న హాల్దియా డాక్ కాంప్లెక్స్‌లో స్వల్ప స్థాయి యుద్ధ నౌకల్ని మోహరించడానికి అనువుగా విస్తరణ పనులు చేపట్టనున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే హాల్దియా నేవీ బేస్‌లో ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ క్రాఫ్ట్‌లు, 300టన్నుల న్యూ వాటర్ జెట్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్‌లను మోహరించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఇవి గంటకు 40-45 నాట్ల వేగంతో ప్రయాణించగలవు. ఎమర్జెన్సీ సమయంలో త్వరితగతిన స్పందించడానికి ఈ నౌకలు ఉపయోగపడతాయి. అంతేకాకుండా అవి సీఆర్ఎస్91 గన్స్ ఈ నౌకల్లో ఉంటాయి. నాగస్త్ర వ్యవస్థ కూడా అమర్చి ఉంటుంది. అందుకే వీటిని వేగంగా ప్రతిస్పందించడానికి, నిఘా ఉంచడానికి ఉపయోగిస్తారు. హాల్దియా బేస్‌లో ఇలాంటి నౌకలు ఉంటే.. అత్యవసర సమయాల్లో శత్రు దేశాల కుట్రలను తిప్పికొట్టడంలో కీలకంగా మారుతాయి.

ఇటీవలి కాలంలో హిందూ మహా సముద్రం, బంగాళా ఖాతంలో చైనా నేవీ దూకుడుగా వ్యవహరిస్తోంది. అంతేకాకుండా బంగ్లాదేశ్ నుంచి సముద్ర మార్గాల ద్వారా అక్రమ చొరబాట్లు కూడా జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్తితుల్లో కొత్త బేస్ ఏర్పాటు చేయాలని భారత నౌకదళం భావించింది. ఈ నౌకాదళ స్థావరం భారత్‌కు వ్యూహాత్మకంగా అదనపు బలంగా మారుతుంది. కాగా, ఇక్కడ వంద మంది వరకు నేవీ ఆఫీసర్లు, నావికా సిబ్బంది పని చేయనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటు కానున్న హాల్దియా నేవీ బేస్.. కోల్‌కతాకు దాదాపు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ బేస్ సిద్ధమైతే హుగ్లీ నది ద్వారా ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకునే 2024లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సమావేశంలో 120 ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ క్రాఫ్ట్‌లు, 31 విజూరినీతిదిల సేకరణకు అనుమతి ఇచ్చారు. భారత నౌకాదళానికి తూర్పు సముద్ర తీరంలో నేవీ బేస్‌లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ పట్నంలోని తూర్పు నేవీ కమాండ్ ప్రధాన కార్యాలయం ఉంది. ఇక అండమాన్ నికోబార్ దీవులలోని కీలక నేవీ స్థావరాలు ఉన్నాయి. కాగా, హాల్దియా స్థావరం కోసం గతంలో భూమిని కేటాయించి నప్పటికీ.. నిర్మాణం కొంతకాలంగా పెండింగ్‌లో ఉందని అధికారులు తెలిపారు.




# బలమున్న మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పోటీ

### పార్టీ కేడర్‌ను వదులుకోవద్దని అధినేత ఆదేశం

### కరీంనగర్, నల్గొండ, తాండూర్‌లో పోటీ

### జనసేన రాష్ట్ర ఇన్‌చార్జి శంకర్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొద్ది రోజుల్లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో తాము బలంగా ఉన్న చోట పోటీ చేయనున్నట్టు జనసేన తెలంగాణ ఇన్‌చార్జ్ శంకర్ గౌడ్ తెలిపారు. గత పది, పన్నెండేళ్లుగా జనసేన క్యాడర్ పనిచేస్తూ బలంగా ఉన్న ప్రాంతాల్లో తప్పకుండా పోటీచేసే అవకాశం ఇవ్వాలని పార్టీ అధినేత ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారని తెలిపారు. పార్టీ క్యాడర్‌ను నారాజ్ చేయకుండా, వారిని వదులుకోకుండా పోటీ చేయడానికి వారికి అవకాశం ఇవ్వాలని చెప్పారన్నారు. రాష్ట్రంలో జనసేన బలమున్న ప్రాంతాల లిస్టును అధినేతకు పంపిస్తామని తెలిపారు.

117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో తమ పార్టీ బలంగా ఉన్నచోట పోటీ చేయనున్నట్టు తెలిపారు. కరీంనగర్, నల్గొండ, తాండూర్, మెదక్‌లోని కొన్నిచోట్ల బలమున్న క్యాడర్ పనిచేస్తుందన్నారు. 2660 కౌన్సిలర్లు, 266 కార్పొరేషన్ వార్డులున్నందున.. వాటిలో బలంగా ఉన్నచోట పోటీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిపారు. భారతీయ జనతా పార్టీ(బిజెపి)తో తమకు ఎక్కడా విభేదాలు లేవని స్పష్టం చేశారు. గత పది, పన్నెండుళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న క్యాడర్‌ను పోటీ చేయించేలా చూడాలని కొద్దిరోజుల క్రితం కొండగట్టుకు పవన్ కళ్యాణ్ వచ్చిన సందర్భంగా తమకు సూచించారని తెలిపారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సర్వసాధారమని, కానీ పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవల్సిన బాధ్యత ఉంటుందన్నారు. అందులో భాగంగానే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయనుందని శంకర్ గౌడ్ స్పష్టం చేశారు.

## ఎన్నికల నిర్వహణపై అధ్యయనానికి బెల్జియం వెళ్లిన సిఇఒ సి.సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:** తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుధర్శన్ రెడ్డి ఎన్నికల నిర్వహణలో అనుభవాలను పంచుకోవడం, ఉత్తమ విధానాల అధ్యయనం లక్ష్యంగా మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం బెల్జియంకు వెళ్లారు. బెల్జియన్ ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ - ఇంటీరియర్ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు ఈ పర్యటన చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియల్లో పారదర్శకత, సమగ్రత, సామర్థ్యాన్ని మెరుగుపర్చే అంశాలపై రెండు దేశాల అధికారుల మధ్య విస్తృత స్థాయి చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. సీఈఓ సుధర్శన్ రెడ్డి నేతృత్వంలోని బృందంలో ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి, సీఈఓ కార్యాలయ రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బోయపాటి చెన్నయ్య, 48-ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఈఆర్వో కంకనాల అనంతరెడ్డి, 63-నాంపల్లి నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ నం.97 బూత్ స్థాయి అధికారి వేముల ధ్రువకుమార్ రెడ్డి ఉన్నారు. పర్యటనలో భాగంగా బెల్జియన్ ఎఫ్‌పీఎస్ - ఇంటీరియర్, ఎఫ్‌పీఎస్ - ఫారిన్ అఫైర్స్ ఉన్నతాధికారులతో సమావేశాలు, కేయూ లూవెన్ యూనివర్సిటీ నిపుణులతో చర్చలు, బ్రస్సెల్స్‌లోని భారతీయ రాయబార కార్యాలయంలో సేవా ఓటర్లతో పరస్పర చర్చలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడిఈఎం) ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగమని అధికారులు తెలిపారు.

# హైదరాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి

### రాజకీయాల్లో కుటుంబ వారసత్వాన్ని ప్రోత్సహించను

### ముచ్చింతల్ సంక్రాంతి సంబురాల్లో వెంకయ్యనాయుడు



ట్రస్ట్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ముప్పవరపు ఫౌండేషన్ భవనాన్ని ఆదివారం ప్రారంభించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య , త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:** పరిపాలనాపరంగా రాష్ట్రాలుగా విడిపోయినా, తెలుగు ప్రజలంతా కలిసి మెలిసి ఉన్న దృష్ట్యా తెలంగాణ రాజధాని హైదరాబాద్ తరహాలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కూడా అభివృద్ధి చెందుతోందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబురాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, ప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ముప్పవరపు ఫౌండేషన్ భవనం ప్రారంభోత్సవం చేశారు. సంక్రాంతి పండుగ మన జీవితాల్లో నవ్య క్రాంతి తీసుకురావాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షి ంచారు. మూలాల్లోకి వెళ్లి బంధు, మిత్రులతో కలిసి సామూహికంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మన మాతృ భాష తెలుగు సంరక్షణ కోసం ఇటీవల దివంగత రామోజీరావు జయంతి వేళ ఆయన గుర్తుగా పరిపాలన తెలుగులో చేయాలని ఇరు రాష్ట్రాల సీఎంలకు సూచించానని వెంకయ్య నాయుడు తెలిపారు. ప్రసంగాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో కొనసాగాలన్న సూచన మేరకు ఇద్దరు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి అంగీకరించారని గుర్తు చేశారు. తాజాగా ఒక సమీక్షలో కలెక్టర్ ఆంగ్లంలో మాట్లాడబోతే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వారించి తెలుగులో మాట్లా డించారని గుర్తు చేశారు. రాజకీయాల్లో కుటుంబ వారసత్వం తాను ప్రోత్సహించ బోనని, అందుకే తన పిల్లలను రాజకీయాల్లోకి తీసుకు రాలేదని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి విషయంలో అనవసర వివాదాలు వద్దని వెంకయ్యనాయుడు సూచించారు. గుంటూరు, విజయవాడ, గన్నవరం ఇలా కొన్ని ప్రాంతాలు కలిపి అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించు కోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు 'సంక్రాంతి ప్రాశస్త్యం' ప్రవచనం వినిపించారు. అమరావతి కూడా హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చెందాలి, చెందుతుంది. సందేహం లేదని వెంకయ్య నాయుడు ధీమా వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న చర్యలకు కేంద్రం మద్దతు ఇస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. హైదరా బాద్ నుంచి విజయవాడ వెళితే ఆ పక్కన సముద్రం ఉంటుందని, ఏపీలో అన్ని ప్రాంతాలకు సరైన రాజధాని నగరం అమరావతి అని ఉద్ఘాటించారు. ఇక ఈ విషయంలో ఎలాంటి అనవసరమైన వివాదాలు వద్దని కోరారు. 24 ఏళ్ల కింద తమ సొంత గడ్డ నెల్లూరులో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఆ తర్వాత విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో కూడా ఛాప్టర్లు ప్రారంభించి యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మహిళా సాధికారత, వైద్య సేవలందిస్తున్నామని అన్నారు. తన వారసత్వంగా ముప్పవరపు ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ ద్వారా ఆ సేవలు ముందుకు తీసుకెళ్లే బాధ్యత తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపకు అప్పగించానని, అదే తన వారసత్వం అని వెల్లడించారు. సంక్రాంతి పండగ తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా జరుపుకోవడం అనవాయితీగా వస్తుందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. సంక్రాంతి వేళ ప్రతి ఒక్కరూ జన్మభూమి వెళ్లి పాత జ్ఞాపకాలు నెమరువేసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారని తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను అద్భుతమైన సంస్థగా తీర్చి దిద్దడం ద్వారా ఎంతో మందికి సేవలు అందిస్తుండం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# 26 నుండి రైతు భరోసా

### సంక్రాంతి ముహూర్తం వాయిదా

### పంట భూముల గుర్తింపులో జాప్యం

### కంప్యూటర్లలో శాటిలైట్ సర్వే వివరాలు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** రైతు భరోసా నిధులు సంక్రాంతికి జమ చేయాలని తొలుత తెలంగాణ ప్రభుత్వం భావించింది. కానీ శాటిలైట్ సర్వే రిపోర్ట్ ఇంకా ఫైనల్ కాకపోవడం, సాగు భూములను గుర్తించే ప్రక్రియ పూర్తి కాకపోవడంతో నిధుల విడుదల ఆలస్యమవుతోంది. ఇప్పుడు ఎట్టకేలకు మరోసారి ముహూర్తం ఫిక్స్ అయింది. గణతంత్ర దినోత్సవమైన ఈ నెల 26వ తేదీ నుంచి నిధులు రిలీజ్ చేయనుందని తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణలోని రైతులు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందించే రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో నవంబరులో రబీ సీజన్ మొదలవ్వగా, ఆ సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇంకా అందించలేదు. దీంతో పంట సాగుకు కావాల్సిన పెట్టుబడి లేక రైతులు అప్పులు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి సాయం వస్తే తమకు నిధుల కొరత ఉండదని రైతులు చెబుతుండగా, రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులను సంక్రాంతి పండగ సందర్భంగా ఇవ్వాలని రాష్ట్ర తొలుత భావించింది. ఇందుకు ఈ నెల 13 నుంచి జమ చేయాలని తొలుత నిర్ణయించింది. పండక్కి ఇవ్వడం వల్ల రైతుల ఆనందం రెట్టింపు అవుతుందని భావించిన సర్కార్ ఈ మేరకు సంక్రాంతి కల్లా నిధులు జమ చేస్తామని ప్రకటించింది. కానీ కొన్ని కారణాల వల్ల నిధుల విడుదల ఆలస్యమవుతోంది. తెలంగాణ రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా నిధుల విడుదలకు ఎట్టకేలకు ఈ నెల 26 నుండి పంపిణీ చేసేందుకు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సారి రైతు భరోసా పథకంలో కోతల విధింపునకు ప్రభుత్వం సిద్దమైంది. ఇందుకోసం ఈ పథకం అమలు, అర్హతపైన కొత్త రూల్స్ తీసుకొచ్చింది. కేవలం ప్రస్తుతం పంట సాగు చేస్తున్న భూములకే మాత్రమే రైతు భరోసా ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు శాటిలైట్ సర్వే ఆధారంగా పంట భూములను గుర్తిస్తోంది. ఈ శాటిలైట్ సర్వే వల్ల రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. శాటిలైట్ సర్వే వివరాలు ఇప్పటికే కంప్యూటర్లలో స్టోర్ అవ్వగా, వాటిల్లో పంట సాగులో ఉన్న భూములను గుర్తించే ప్రక్రియ షురూ అయింది. ఈ ప్రాసెస్ పూర్తవ్వడానికి మరికొంత సమయం పట్టే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇది పూర్తయిన తర్వాత రైతుల అకౌంట్లో నిధులు జమ చేయనున్నారు. ఎకరానికి రూ.6 వేల చొప్పున ఇవ్వనున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం సాగులో ఉన్న భూములకు మాత్రమే ఇచ్చే అవకాశం ఉన్నందున చాలామంది అనర్హులుగా తేలనున్నారు. జనవరి 26 నుంచి మొదలుకానున్న రైతు భరోసా నిధుల ప్రక్రియ 10 రోజుల పాటు సాగనుంది. ఇప్పటికే ఎంత నిధులు అవసరమవుతాయనేది ప్రభుత్వం అంచనా వేస్తోంది. గత ఖరీఫ్ సీజనులో 69.40 లక్షల మంది రైతులకు సంబంధించి 145.73 లక్షల ఎకరాలకు రైతు భరోసాను అందించింది. ఇందుకు మొత్తం 8,744.13 కోట్ల రూపాయలను రైతుల ఖాతల్లో జమ చేసింది. ఈ సారి దాదాపు 1.50 కోట్ల ఎకరాలకు అందించే అవకాశం ఉన్నట్లు అంచనా. అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాల్సిందిగా ఆర్థికశాఖను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన నిధులు సమకూర్చే పనిలో ఉన్నట్లు తెలియవచ్చింది.

## పత్తి కొనుగోళ్లలో రూ.కోట్ల కుంభకోణం

### టెంపరరీ రిజిస్ట్రేషన్ పేరిట అక్రమ లావాదేవీలు

### వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు నోటీసులు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** పత్తి కొనుగోళ్లలో అక్రమాలు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారుల మెడకు చుట్టుకుంది. తప్పుడు టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్) పత్రాలతో రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోలు చేసి, ఎక్కువ ధరలకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కు అమ్మి కోట్ల రూపాయ అక్రమార్జనకు పాల్పడిన సంఘటనలలో కొందరు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల అధికారులపై విచారణకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఈ కేసులో పలువురిని విచారించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల అధికారుల నుంచే తమ దర్యాప్తునకు అవసరమైన సమాచారాన్ని సేకరించాలని తలపెట్టారు. 2024 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకూ సాగిన పత్తి కొనుగోళ్ల సమగ్ర సమాచారమివ్వాలని ఆ రెండు శాఖలకు లేఖ రాశారు. రైతులు, వ్యాపారులకు సంబంధించి 22 అంశాలతో ప్రత్యేక ఫార్మాట్‌లో వేర్వేరు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. కాగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయానికి ముందుగా రైతులు తమ మండలంలోని వ్యవసాయాధికారుల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలి. సీజన్ వారీగా పత్తి సాగు విస్తీర్ణం, దిగుబడితోపాటు రైతు తన ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ వివరాలను నమోదు చేస్తారు.

# ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలపై కొరవడిన నిఘా

### తప్పుడు పత్రాలతో ఆయుధాల లైసెన్స్‌లు

### పొందుతున్న పలువురు గార్డులు.. హత్య కేసుల్లో ఇంకొందరు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** ప్రైవేటు సెక్టార్‌లో యువతకు ఉపాధి కల్పించడంలో ముందంజలో వున్న సెక్యూరిటీ ఏజెన్సీలపై సర్కారీ విభాగాల నిఘా పూర్తిగా కొరవడింది. లక్షల సంఖ్యలో యువతకు ఉపాధి కల్పిస్తున్న సెక్యూరిటీ సంస్థలు ఇదే సమయంలో సామాజిక బాధ్యత, సమాజ భద్రత విషయంలో పెద్దగా పట్టి ంచుకుంటున్నట్లు లేదని ఇటీవల కాలంలో వెలుగు చూసిన కొన్ని ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇందులో మొదటిది అనేక సెక్యూరిటీ ఏజెన్సీలలో నకిలీ లైసెన్స్‌లతో ఆయుధాలు కలిగిన గార్డులు పెద్ద సంఖ్యలో వుండగా వీరిలో కొందరు హత్య కేసుల్లో అరెస్టవగా మరికొందరు ఇతర కేసుల్లో పట్టుబడడం సంచలనం రేపాయి. మరోవైపు ఆయుధాలు కలిగిన ఇంకొందరు గార్డులు క్షణికావేశంలో ఇతరు లపై కాల్పులకు దిగడం, నేరాలు పాల్పడేందుకు వీటిని వాడుతున్న ఉదంతాలు వెలుగు చూడడం కలకలం రేపాయి. సామాజిక బాధ్యత, సమాజ భద్రతకు సంబంధించిన ఈ రెండు విషయాలలో సెక్యూరిటీ ఏజెన్సీలు పట్టించుకోక పోవడం వల్లే ఆయుధాలు కలిగిన గన్‌మెన్లు వాటిని దుర్విని యోగం చేస్తున్నారు. ఇక సెక్యూరిటీ ఏజెన్సీలపై సర్కారీ విభాగాలు ముఖ్యంగా పోలీసు శాఖ నిరంతరం నిఘా వుంచాల్సి వున్నా ఇది సవ్యంగా సాగడం లేదని ఇటీవలి ఘటనలు బహిర్గతం చేశాయి. ఒకవేళ ఈ ఆయుధాలు అసాంఘీక శక్తుల చేతిలో పడితే దానికి భారీ మూల్యం చెల్లించాల్సి వుంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

సెక్యూరిటీ సంస్థలు దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో వుండగా వీటిలో లక్షలాది మంది పనిచేస్తుండడం తెలిసిందే. ఈ సంస్థల్లో మెజారిటీ సంస్థలు మాజీ సైనికులే ని ర్వహిస్తుండడం విదితమే. రక్షణ బలగాల్లో సుధీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ చేశాక అనేక మంది సొంతంగా సెక్యూరిటీ ఏజెన్సీలు నిర్వహిస్తూ ఆయా ప్రాంతాల నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే నిరుద్యోగులకు సెక్యూరిటీ ఏజెన్సీలు వరంగా మారాయి. ఇక వీటిలో పనిచేస్తున్న వారిలో అనేక మంది కూడా మాజీ సైనికులే కావడం మరో విశేషం. ఇక అనేక సెక్యూరిటీ ఏజెన్సీలు తమ వద్ద పనిచేస్తున్న గార్డులకు లైసెన్స్ వుంటే ఆయుధాలను ఇప్పిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో గార్డులే సొంతంగా ఆయుధాలను ఖరీదు చేస్తున్నారు. సా ధారణ గార్డులతో పోలిస్తే ఆయుధాలు కలిగిన గార్డులకు జీతం రెండింతలు వుండడంతో ఆయుధ లైసెన్స్ వున్న గార్డులకు మంచి డిమాండ్ ఏర్పడి ంది. బ్యాంకులు, ఎటిఎంలలో నగదు నింపేందుకు వాడే వాహనాలకు రక్షనగా వుండేందుకు ఆయుధాలు కలిగిన గార్డు లు కావాల్సి వుండడంతో వీరికి బాగా డిమాండ్ ఏర్పడింది. ఇదే సమయంలో కొందరు రాజకీయ నాయకులు కూడా ఆయుధాలు కలిగిన గార్డులను గన్‌మెన్లుగా నియమించు కుంటుండడంతో వీరికి మరింత డిమాండ్ ఏర్పడింది. ఆయుధాలు కలిగిన గార్డులకు అనేకచోట్ల 30 వేల రూపాయల నుంచి 60 వేల రూపాయల వరకు జీతభత్యాలు అందుతుండడం గమనార్హం. అయితే ఇదంతా నాణానికి ఒకవైపు వున్న వాస్తవాలు. రెండో వైపు వున్న అంశాలు అందరికి షాక్ కు గురిచేస్తున్నాయి. ఈ షాకింగ్ నిజాలు ఏమి టంటే...ఆయుధాలు కలిగిన గార్డుల్లో అనేక మంది నకిలీ లైసెన్స్‌లతో వాటిని కొనడం. సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ తరహా గోల్‌మాల్ వ్యవహారాలను పలుమార్లు రట్టు చేశారు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో నకిలీ లైసెన్స్‌లతో అనేక మంది గార్డులు ఆయుధాలు కొన్నట్లు తేలింది. ఆయుధాలు కలిగిన గార్డులకు మంచి జీతభత్యాలు వస్తుండడంతో ఈ గోల్‌మాల్ కార్యకలాపాలకు తెరలేచి ందని చెప్పాలి. ఈ తరహా వ్యవహారాలు వెలుగు చూడడం ఇది తొలిసారి కాదు. గతంలో కూడా పలుమార్లు నకిలీ లైసెన్స్‌లతో ఆయుధాలు కలిగిన గార్డులు దొరికిపోయిన ఉదంతాలు వున్నా యి. అప్పట్లో వీటిపై కఠినంగా వ్యవహరించి వుంటే తాజా ఘటనలకు ఆస్కారం వుండేది కాదనడంలో సందేహం లేదు.

**సెక్యూరిటీ ఏజెన్సీలపై పోలీసుల నిఘా కరువు**

నకిలీ లైసెన్స్‌లతో ఆయుధాలను పొందుతున్న గార్డుల వ్యవహారం వెనుక కొన్ని సెక్యూరిటీ ఏజెన్సీల హస్తం వుందని పోలీసులు భావిస్తున్నాయి. వాస్తవానికి ఏ సెక్యూరిటీ సంస్థ అయినా తమ వద్ద గార్డులుగా చేరుతున్న వారికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాల్సి వుంటుంది. అ యితే ఈ విషయంలో కొన్ని సంస్థ లు తప్పించి మెజారిటీ సంస్థలు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వున్నాయి. ఇక ఆయుధ లైసెన్స్‌లు కలిగిన గార్డుల విషయంలో సెక్యూరిటీ ఏజెన్సీలు మరింత జాగ్రత్తగా వుండాల్సి వున్నా చూసీచూడనట్లుగా వుంటున్నాయనే అభియోగాలు వునా ్నయి. ఆయధ లైసెన్స్‌లు అసలైనవేనా...? నకిలీవా...? అనే విషయాలను సెక్యూరిటీ ఏజెన్సీలు కచ్చితంగా పరిశీలించాల్సి వున్నా వాస్తవంలో ఇలా జరగడం లేదని ఇటీవల వెలుగు చూసిన నకిలీ ఆయుధ లైసెన్స్ వ్యవహారం తేల్చి చెప్పింది. ఇ లా ఎందుకు జరుగుతుందనే దానిపై సెక్యూరి టీ ఏజెన్సీల వద్ద కానీ వీటిపై పర్యవేక్షణ చేయాల్సిన పోలీసు వద్ద కానీ సరైన సమాధానం లేదు. వాస్తవ విషయానికి వ స్తే పోలీసు స్టేషన్ల వారిగా ప్రతీ ఏటా లేదా ఆరు నెలలకు ఒకసారి సెక్యూరిటీ ఏజెన్సీలతో ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు సమావేశమై గార్డుల పనితీరు, ఆయుధాలు కలిగిన వారి పనితీరు, ఆయుధ లైసెన్స్‌లు సరైనవేనా...? కాదా...? అనే అంశాలను చూడాల్సి వుంది. కానీ ఇవి ఎక్కడా జరుగుతున్నట్లు కనిపిం చడం లే దు. ఈ క్రమంలోనే నకిలీ ఆయుధ లైసెన్స్‌లు రాజ్యమేలు తున్నాయి. ఎక్కడో జమ్మూ కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో జారీ అయినట్లుగా నకిలీ ఆయుధ లైసెన్స్‌లతో హై దరాబాద్‌లో కొందరు గార్డులు ఆయుధాలను కొంటున్నారు. ఒకవేళ ఈ ఆయుధాలు అసాంఘీక శక్తుల చేతిలో పడితే బాధ్యులెవరనే దానికి సర్కారు సమాధానం చెప్పాల్సి వుంటుంది. ఇదే సమయంలో కొందరు గార్డులు ఆయుధాలను దుర్వినియోగం చేస్తున్న ఘట నలు కూడా పెరుగుతున్నాయి. వీటిని కూడా నివారించాల్సి వుంది.

వార్త

పుస్తకాలను మాత్రమే చదవకు. మనుషులను కూడా చదువు. ముఖ్యంగా నిన్ను నీవు చదువుకో!

-ఆస్కార్ వైల్డ్ న

# ప్రజాస్వామ్యంలో ఇది తగునా?

అధికార విపక్షాల మధ్య పొత్తు పొసగనప్పుడు, స్నేహపూర్వక సంబంధాలు నెరపుకోలేనప్పుడు విపక్షాల మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, దాడులు చేస్తుందన్నది మామూలే. ఇడికి అజమాయిషీ సంస్థ కేంద్రమే కనుక ఎక్కడ ఇడిదాడులు జరిపినా అవి కేంద్రప్రభుత్వం తరపున జరిగినట్లుగానే అందరూ భావిస్తారు. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగానే ఇడి విపక్షాల నేతలు, వారి సంబంధీకుల మీద దాడులకు సమాయత్తమౌతోందని సకల భారత జనులకు వచ్చే అనుమానమే. ప్రజాస్వామ్యదేశంలో రాజకీయ కక్షలు, వేధింపులు ఏమాత్రం సమ్మతం కావు. అయినా కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఇడి దృష్టిపెట్టే కేసులన్నీ అధికార పక్షాన్ని సంతృప్తిపరచడానికేనన్నట్లు భావిస్తుండటం సర్వసాధారణం. పశ్చిమ బెంగాల్‌లో గురువారం ఇడి అధికారులు చేపట్టిన దాడులు మళ్లీ ఆ కోవకే చెందినవన్న అనుమానాలు లేకపోలేదు. దాడులు జరిపింది రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో ఇడి చెప్తున్న కారణం చూస్తే బొగ్గు అక్రమ రవాణాకు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఆధారాల కోసం ఆయనింట్లో సోదాలు జరిపినట్లుచెబుతోంది. ఐప్యాక్ డైరెక్టర్‌గా ప్రతీక్ జైన్ విధులు పార్టీ అభివృద్ధి, జరుగుతున్న రాజకీయ వ్యవహారాలకు, వ్యూహ ప్రతి వ్యూహాలను ప్రతిపాదించడం వరకే. కానీ ఆయనకు మనీ లాండరింగ్‌తో ఏం సబంధముంటుంది కానీ ఆయనమీద వచ్చిన ఆరోపణ తన విధి నిర్వహణలోది కాదు. అందుకే ప్రతీక్ జైన్ ఇల్లు, కార్యాలయంలో ఇడి సోదాలు ఒక హైడ్రామా నడిచాయి. పార్టీ ఆఫీసులో పార్టీ కార్యక్రమాలను చక్కబెట్టి సర్వేలకు సమయం వెచ్చించే ఐప్యాక్ డైరెక్టర్ వద్ద పార్టీ వ్యహారాల నివేదికలు ఆయా నియోజక వర్గాలపై సర్వే నివేదికలు తప్ప వేరొకటి ఉంటాయని అనుకునే అవకాశం ఉండదు. 'తుంటి మీద కొడితే పళ్లురాలాయన్నట్లు' మనీలాండరింగ్‌తో ప్రతీక్ జైన్‌కేమి పని అనుకుంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానం. అంతేకాదు విషయం తెలిసి ఆ తరుణంలోనే మమతా బెనర్జీ అక్కడికి చేరుకోగానే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సిఎం కోల్‌కత్తా పోలీసు కమిషనర్ మనోజ్ వర్మతో అక్కడికి చేరుకున్నారు. దాంతో కార్యకర్తల్లో అలజడి బయలుదేరింది. ఐప్యాక్ కార్యాలయంలో ఇడి దాడి చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆమె విమర్శించింది. కేంద్ర దర్యాప్తు సంస్థల విధులకు ఆటంకం కలిగించడంలో ఆమె చిచ్చరపిడుగై కలయతిరిగారు. జనం భయభ్రాంతులయ్యారు. సిఎం ప్రత్యేక చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని దర్యాప్తు సంస్థలను భారతీయ జనతాపార్టీ కోరింది. పైగా మమతా ఈ సందర్భంగా దర్యాప్తు సంస్థలు పరిశీలనకు ముందే వారి వద్దనున్న తమ పార్టీకి సంబంధించిన కొన్ని పత్రాలతో పాటు హార్డ్ డిస్క్‌లను తీసుకెళ్లి పోయారని ఆరోపణలు ఎదుర్కొంటోంది. 2020లో నమోదైన బొగ్గు అక్రమ రవాణా కేసులో బెంగాల్‌లో ఆరు చోట్ల, ఢిల్లీలో 4చోట్ల తనిఖీలు చేసింది. ఈకేసులో నిందితుడైన హవాలా నిర్వాహకుడొకరుఐప్యాక్‌తో కోట్లాది రూపాయల మేరకు నగదు లావాదేవీలు జరిగినట్లు ఆధారాలున్నందునే సోదాలు నిర్వహించినట్లు ఇడి వెల్లడించింది. మమతా బెనర్జీ, కోల్‌కత్తా పోలీస్ కమిషనర్‌లు తమ దర్యాప్తునకు ఆటంకం కలిగించారని కూడా పేర్కొంది. ఈఆరోపణలపై పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఇడి కోల్‌కత్తా హైకోర్టును ఆశ్రయించింది. బెంగాల్‌లోని ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ మైన్స్ లోవందల కోట్లరూపాయల విలువైన బొగ్గు దొంగతనానికి గురైనట్లు 2020లో సిబిఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న విషయాలపై విచారించింది. అందులో నగదు అక్రమ చెలా మణీ జరిగినట్లు తేల్చారు. స్థానికవ్యాపారి అనూప్ మాంఝీ నుంచినగదు లావాదేవీలు, హవాలా వ్యవహారాలు ప్రతీక్ జైన్ ద్వారానే జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా ఐప్యాక్ కార్యాలయంలో ఉదయం 6 గంటల నుంచే సోదాలు ప్రారంభించి తమ పార్టీరాజకీయ వ్యూహాలకు సంబంధించిన వివరాలన్నీ వారి కంప్యూటర్లలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని తృణమూల్ కాంగ్రెస్‌నేత ఆరోపించారు. రాజకీయ పార్టీ సమాచారాన్ని సేకరించడమే ఇడి పనిగా పెట్టుకుందని మమతా ఆరోపించారు. తమ పార్టీ ఎన్నికలకమిషన్ వద్ద నమోదైన క్రమం తప్పకుండా ఆదాయం పన్ను చెల్లిస్తున్నట్లు ఆమె చెప్పిన విషయాలు కాదనలేం. కానీ బిజెపికి వ్యతిరేకంగా పనిచేస్తున్న తృణమూల్ కాంగ్రెస్‌ను ఎలాగైనాతొక్కేయాలన్న మిషతో ఇడి చేతదాడులు చేయిస్తోందని ఆరోపణలున్నాయి. తమపార్టీ ఎన్నికల వ్యూహరచన చేసి నివేదికలు రూపొందించి ఐప్యాక్ కార్యాలయంపై బిజెపి దాడులు చేయిస్తుండగా తాముకూడా బిజెపి కార్యాలయంపై దాడులు చేస్తే ఎలా ఉంటుందన్న విమర్శను కూడా మమతా బెనర్జీ జనం ముందుంచారు. అంతేకాదుప్రజాస్వామ్యంలో ఏ పార్టీకి ఆపార్టీ తమఎన్నికల వ్యూహాలు జరుపుకుంటుండగా వాటికి సంబంధించిన వివరాలనుతస్కరించేందుకేనన్నట్లు ఇడి దాడులు జరపడం సబబు కాదని ఆమె వివరణ. ఇడిదాడుల సమయంలో సిఎం తమ అనుచరులతో వచ్చిన సందర్భంగా మరికొన్ని ఉదంతాలు జరిగాయి. సమాచారంమేరకు ఇడిఅధికారులు సోదాల అనంతరం జైన్‌భార్య తమఇంట్లో అత్యవసరమైన పత్రాలను ఇడి చోరీచేసిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెంగాల్ లో తనను రాజకీయంగా ఎదుర్కోవాలంటే ఇడిని ప్రయోగించడం కరెక్టు కాదని ముఖ్యమంత్రి అన్నారు. ఈవిధమైన డ్రామాలురాజకీయంగా ఏ మేరకు రక్తికడతాయో వేచి చూడాల్సిందే.

గొప్పవారి గొప్పతనం వారు చిన్నవాళ్ల పట్ల ప్రవర్తించే తీరును బట్టి తెలుస్తుంది.



ఐ.జాన్సన్

జీవితంలో విజయం సాధించాలంటే మెట్లవైపు చూస్తూ ఉండక, వాటివైపు పయనం సాగించాలి.



బైరన్

# ప్రజావాక్కు



### మారుతున్న విలువలు

ఇటీవలి కాలంలో పట్టణప్రాంతాల్లో 'లివింగ్ రిలేషన్‌షిప్' అనే ధోరణి వేగంగావిస్తరిస్తోంది. వివాహం చేసుకోకుండానే ప్రేమజంట కలిసి జీవించడం అనే ఈ విధానం పాశ్చాత్య ప్రభావంతో మన సమాజంలో స్థిరపడుతోంది. కొందరు దీన్ని స్వేచ్ఛాజీవనానికి ప్రతీకగాచూస్తే, మరికొందరు సాంప్రదాయ విలువలకు వ్యతిరేకంగా భావిస్తున్నారు. యువతలో ఈ ధోరణి పెరగడానికి వ్యక్తిగత స్వాతంత్ర్యం, పరస్పర అర్థన, వివాహానికి ముందు అనుకూలత పరీక్షించుకోవాలనే ఆలోచన ప్రధాన కారణాలు. సోషల్ మీడియా ప్రభావంకూడా దీనినిమరింత ప్రోత్సహిస్తోంది. చట్టపరంగా లివింగ్ రిలేషన్‌షిప్‌కి కొంత రక్షణ ఉన్నప్పటికీ, సామాజిక అంగీకారం ఇంకా పూర్తిగా లభించలేదు. గ్రామీణప్రాంతాల్లో దీనినిప్రతికూలంగాచూడటంసహజం.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

### నిబంధనలను పాటించాలి

వైద్యుల ప్రెస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూనేరమే కానీ, తెలంగాణలో అన్ని జిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈనిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కొక్క మందుల షాప్‌లో ఫార్మాసిస్ట్ లేడు. పర్యవేక్షణ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి మందుల దుకాణంలో అర్హత పొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. యాంటీబయాటిక్ మందుల అమ్మకాలకు సంబంధించిన హెచ్1 రిజిస్టర్‌ను చాలా దుకాణాలు నిర్వహించడం లేదు.

- పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

### పుర ప్రణాళిక అవసరం

గ్రామీణ ఆత్మను పోగొట్టకుండా పట్టణ స్థాయిలో ఉండే ప్రయోజనాలు సౌకర్యాలు గ్రామీణప్రాంతాలలో కల్పించడమే వీటి ప్రధాన ఉద్దేశం. అయితే ఉమ్మడి పాలన లో కేవలం అభివృద్ధి హైదరాబాద్ చుట్టూనే తిరిగింది. ఇప్పుడు దానిని వికేంద్రీకరణ చేయవలసి ఉంది. అందుకే కోచ్ ఫ్యాక్టరీ లాంటివి వరంగల్ రావడం కూడా అదే మోడల్ లో భాగం. కోచ్ మైంటైనెన్సు ఫ్యాక్టరీ కాజీపేటలో పెడితే యువతకు ఉద్యోగాలు లభిస్తాయి.

-భారత అవినాష్, జనగామ

### నిధుల కొరత

వాతావరణ మార్పులు గ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లో భారత్ ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమేకాదు, అది వాతావరణ న్యాయం, సమానత్వం, చారిత్రక బాధ్యతలపై ఆధారపడిన ఒక సుస్థిర దృక్కోణం. ప్యారిస్ ఒప్పందానికి పునాది అయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం, సర్వదేశాలకు ఒకేరకం బాధ్యతలను పెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. భారత్ ఈ నిర్మాణాన్ని రక్షించడానికి ప్రయత్నించడం వెనకఉన్న తర్కం చరిత్రపరమైన కర్బన ఋణాన్ని గుర్తించాలనే డిమాండ్. పారిశ్రామికీకరణ ద్వారా శతాబ్దాలుగా అధిక ఉద్గారాలు విడుదల చేసిన అభివృద్ధి చెందిన దేశాలు తమ పాత్రను సక్రమంగా నిర్వర్తించకపోవడం, కానీ అదేసమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలపై కఠిన బాధ్యతలను మోపాలని కోరుకోవడం, వాతావ రణ చర్చల్లో ఏర్పడుతున్న అసమతౌల్యాన్ని బహిర్గతం చేస్తుంది. ఈ నేపథ్యంలో భారత్ విమర్శ సమానత్వం లేకుండా వాతావరణ చర్యలు న్యాయం సాధించలేవు అనేది సరళమైన వ్యాఖ్య కాదు. ఒక నిర్మాణాత్మక విశ్లేషణ.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వికలాంగులకు తగిన వసతి కల్పించాలి

మేడారం జాతరకు వచ్చే వికలాంగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీద్వారా తగినన్నిఅనుకూలమైన బస్సులను ఏర్పాటు చేయాలి. మేడారం జాతరలో వికలాంగుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలి. చలి, దుమ్ము ధూళి, వైద్య సదుపాయాలు కల్పించాలి, దేవాదాయ శాఖ, రెవెన్యూశాఖ, వైద్యశాఖ, పోలీస్ శాఖ మేడారంకు వచ్చే వికలాంగులకు తగిన వసతి కల్పించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### కల్తీ నూనె విక్రయాల జోరు

వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్నిజిల్లాలలో కల్తీనూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు కల్తీనూనె విక్రయిస్తున్నారు. అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి వెళ్తున్నారే తప్ప కల్తీ నూనె విక్రయాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, వివిధప్రాంతాల నుంచి డ్రమ్ములు, క్యాన్లలో నూనెను వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

-కె. సతీశ్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యువతే భవిష్యత్ నిర్మాతలు

**ఏ దేశభవిష్యత్తైనా అక్కడి యువశక్తి నైపుణ్యాలు, విలువలపైనే ఆధారపడి ఉంటుంది. పాలకులు వస్తారు పోతారు. కానీ స్వేచ్ఛాస్ఫూర్తి, జాతీయ భావం, సమసమాజనిర్మాణం యువత చేతుల్లోనే ఉంది. ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అనివార్యమని భావించకండి. మేమేం చేయలేం అన్న అపోహను విడిచిపెట్టండి. యువత ఏకమైతే ప్రపంచాన్ని తప్పకుండా మార్చగలదు. అందరికీ మెరుగైన భవిష్యత్తును అందించగలదు. ఇలా యువతరం జీవితాన్ని కొత్త సంకల్పంతో రీస్టార్ట్ చేసుకునే క్షణం. రేపు మనదవ్వాలంటే? భవిష్యత్తును చూసి భయపడటంకాదు, దాన్ని ఎదుర్కొనే ధైర్యం పెంచుకోవాలి. సంసిద్ధతే మన కవచం, మన ఆయుధం. కాలం అమూల్యం అనిచెప్పడమే కాదుదాన్ని గౌరవించాలి. కాలాన్ని వృథాచేయడం అంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే. కాలం పిరికివారిని వెనక్కి నెట్టివేస్తుంది. ధైర్యవంతులను మాత్రం ముందుకు తోస్తుంది. యువతరం చిత్తశుద్ధితో చేసే ప్రయత్నాలు ఫలించాలని ఆశిద్దాం.**



మేకిరి దామోదర్

ప్రపంచంలోనే మన దేశంలో యువజనాభా అధికంగా ఉంది. ఈ సంఖ్య గర్వకారణమే కాదు, అది ఒక గొప్ప బాధ్యత కూడా. యువశక్తి సద్వినియోగమైతే దేశం ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుంది. అదే శక్తి దారి తప్పితే సమాజం అనేక సమస్యల్లో చిక్కుకుంటుంది. యువత అంటే ఉత్సాహం, వేగం, సంకల్ప బలం, కలలు. కానీ అదే సమయంలో సంయమనం, నియంత్రణ, బాధ్యత కూడా ఉండాలి. భావోద్వేగాలు మనిషి ఆధీనంలో ఉంటే మహనీయుడిగా నిలబెడతాయి, కాని భావోద్వేగాలే నిర్ణయాధిపతులైతే జీవితం అదుపు తప్పుతుంది. నేడు యువతరం ఎదుర్కొంటున్న అసలైన సవాలు బయటి పరిస్థితులు కాదు, అంతర్గత అస్థిరత. క్రమశిక్షణ, అంకితభావం, మనోనిగ్రహం లేకుండా ఎవరూ మన జీవితాన్ని బాగుచేయలేరు. మార్పు కావాలంటే గతాన్ని నిందించడం కాదు, రేపటి నుంచి మన ప్రవర్తనను మార్చుకోవడమే అసలైన మార్గం. అంతేకాదు? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్నాళ్ల ప్రజాస్వామ్య పాలనలో కూడా నిరుద్యోగం, పేదరికం, అవినీతిని నిర్మూలించలేకపోవడం పాలన విధానాల వైఫల్యంగా చూడాల్సి వస్తోంది. సేవ పేరుతో పాలకులైన వారు ఈ సామాజిక రుగ్మతులను సమూలంగా నిర్మూలించాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు'స్వామి వివేకానందుడి జయంతిన జాతీయ యువజన దినోత్సవ స్ఫూర్తితో పాలన వైఫల్యాలు సమీక్షించుకొని సంపన్నులపై ప్రత్యేక అదనపు పన్నుతో యువతరం ఆశయాలు నెరవేర్చాల్సి ఉంది. ప్రశ్నిస్తూ పాలనాపగ్గాలు చేపట్టేలా యువత మారితే, భారత్ మారుతుంది. మన కులం, మతం, ప్రాంతం, రాజకీయ గుర్తింపు ఇవేవీ మన భవిష్యత్తును నిర్మించవు. నాయకులు, సినిమా హీరోలు, పారిశ్రామికవేత్తలు ప్రేరణ ఇవ్వవచ్చుగానీ, మన జీవితానికి దిశానిర్దేశం మనమే చేసుకోవాలి. ఎవరైనా వచ్చి నన్ను బాగు చేస్తారు అన్న భావన యువతను బలహీనులను చేస్తుంది. నేనే నా భవిష్యత్తు శిల్పిని అన్న ఆలోచన యువతను శక్తివంతులను చేస్తుంది.

నిరుద్యోగం, తీవ్రమైన పోటీ, కుటుంబ ఒత్తిళ్లు ఇవన్నీ వాస్తవాలు. కానీ వాటిని సాకులుగా మార్చుకోవాలా? సాధనగా మలచుకోవాలా? అన్నది యువత నిర్ణయించుకోవాలి. కుటుంబ భవిష్యత్తు కూడా యువత విజయంపై ఆధారపడి ఉంటుంది. అందుకే యువత సమయాన్ని అత్యంత విలువైన సంపదగా భావించాలి. టైమ్ మేనేజ్‌మెంట్ గురించి చాలా మంది మాట్లాడతారు. కానీ దాని కంటే ముఖ్యమైనది సెల్ఫ్ మేనేజ్‌మెంట్. మనం నిర్ణయించిన గడువులో పని పూర్తికాకపోతే?, ఎక్కడో కాలం వృథా అవుతోందన్న మాట. కుళాయి పైపులో చిల్లులు పడితే



నీళ్లు నేలపాలవుతాయి. అది పైపు తప్పు కాదు, లోపాన్ని గుర్తించని మన నిర్లక్ష్యం. మన జీవితాల్లోనూ కాలం అలా జారిపోతూనే ఉంటుంది. నిపుణులు చెబుతున్న సత్యం ఒక్కటే. 'ఈ ప్రపంచంలో నిరుపేదలంటూ ఎవరూ లేరుప్రతి ఒక్కరూ టైం బిలియనీర్లే'. రోజుకు ఇరవై నాలుగు గంటలు కూలీకి అయినా, కుబేరుడికి అయినా ఒకటే. తేడా ఏమిటంటే? ఎవరు ఆ కాలాన్ని ఎలావినియోగిస్తున్నారు అన్నదే. అరవై ఏళ్ల కోటీశ్వరుడితో పోలిస్తే, పాతికేళ్ల పేద యువకుడే నిజమైన 'కాలసంపన్నుడు'. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే, ఎంచుకున్నరంగంలో అగ్రస్థానానికి చేరుకోవడం సుసాధ్యమే. విజయం అంటే సంపద మాత్రమే కాదు. సంపద విజయానికి ఒక రూపం మాత్రమే. మంచి ఆరోగ్యం, శక్తి, ఉత్సాహం, ఇతరులతో సత్సంబంధాలు, స్వేచ్ఛ, మానసిక స్థిరత్వం, ప్రశాంతత ఇవన్నీ విజయానికి విభిన్న రూపాలు. కానీ యువత ఈ సత్యాన్ని ఆలస్యంగా గ్రహిస్తోంది. యువత ఎదుర్కొంటున్న మరో పెద్ద సమస్య దురలవాట్లు, వ్యసనాలు. వ్యసనాలు ఆరోగ్యాన్ని కుప్ప కూలుస్తాయి. ఆర్థికంగా నష్టపరుస్తాయి. ఆత్మీయులను దూరం చేస్తాయి. సమాజం ముందు దోషిగా నిలబెడతాయి. దురలవాట్లను వదిలించుకోవాలన్న ఆలోచన మంచిదే. కానీ అది అనుకున్నంత సులువు కాదు. దానికి ప్రణాళిక అవసరం. మన చుట్టూ ఉన్నపరిస్థితులను మార్చుకోకుండా ఏ చిన్న వ్యసనాన్నైనా దూరం చేయలేం. ప్రతి దురలవాటు పది మంచి అలవాట్లను మింగేస్తుంది. అందుకే చిన్న వ్యసనాన్ని కూడా తేలిగ్గా తీసుకోకూడదు. ఆరోగ్యం కావాలంటే మంచి అలవాట్లపై పెట్టుబడి పెట్టాలి. చేతినిండా డబ్బు కావాలంటే కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మెరుగైన జీవితం కావాలంటేఆలోచనలు, మాటలు, ప్రవర్తన మూడింటిపైనా నియంత్రణ అవసరం. జీవితం మెరుగ్గా ఉండాలంటే ఒంటరిగా ఉన్నప్పుడు ఆలోచనలను అదుపులో ఉంచాలి, స్నేహితులతో ఉన్నప్పుడు నాలుకను నియంత్రించాలి, సమూహంలో ఉన్నప్పుడు ప్రవర్తన సంస్కారంగా ఉండాలి. సమస్యల్లో ఉన్నప్పుడు భావోద్వేగాలను కట్టడి చేయాలి. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు అహంకారం దరిచేరనివ్వకూడదు. స్వామి వివేకానంద స్ఫూర్తితో 'యువతే దేశ నిర్మాత స్వామి వివేకానందుడు యువతను ఉద్దేశించి' చెప్పిన మాటలు నేటికీ మార్గదర్శకాలు. స్ఫూర్తి, పట్టుదల, సద్భావనతో యువత ముందుకు సాగితే ఈ దేశ భవిష్యత్తు భద్రమైన చేతుల్లో ఉన్నట్లే. ఏ దేశభవిష్యత్తైనా అక్కడి యువశక్తి నైపుణ్యాలు, విలువలపైనే ఆధారపడి ఉంటుంది. పాలకులు వస్తారు పోతారు. కానీ స్వేచ్ఛాస్ఫూర్తి, జాతీయ భావం, సమసమాజనిర్మాణం యువత చేతుల్లోనే ఉంది. ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అనివార్యమని భావించకండి. మేమేం చేయలేం అన్న అపోహను విడిచిపెట్టండి. యువత ఏకమైతే ప్రపంచాన్ని తప్పకుండా మార్చగలదు. అందరికీ మెరుగైన భవిష్యత్తును అందించగలదు. ఇలా యువతరం జీవితాన్ని కొత్త సంకల్పంతో రీస్టార్ట్ చేసుకునే క్షణం. రేపు మనదవ్వాలంటే? భవిష్యత్తును చూసి భయపడటంకాదు, దాన్ని ఎదుర్కొనే ధైర్యం పెంచుకోవాలి. సంసిద్ధతే మన కవచం, మన ఆయుధం. కాలం అమూల్యం అనిచెప్పడమే కాదుదాన్ని గౌరవించాలి. కాలాన్ని వృథాచేయడం అంటేమనల్ని మనం మోసం చేసుకోవడమే. కాలం పిరికివారిని వెనక్కి నెట్టివేస్తుంది. ధైర్యవంతులను మాత్రం ముందుకు తోస్తుంది. యువతరం చిత్తశుద్ధితో చేసే ప్రయత్నాలు ఫలించాలని ఆశిద్దాం. •

# పుతిన్ నివాసంపై దాడితో ఉక్రెయిన్ తప్పు చేసిందా?


జి.సత్యనారాయణరాజు

ఉక్రెయిన్ దూకుడు మీద ఉంది. ఒకవైపు యుద్ధ విరమణకు ప్రయత్నాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్ దుందుడుకు స్వభావం చర్చనీయాంశంగా మారింది. పలు దేశాలు ఈఘటనను ఖండిస్తున్న నేపథ్యంలో దాడి నిజమేనని నిరూపించుకునే పనిలో పడింది రష్యా. ఇందులో భాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది. దాడికి ఉపయోగించిన మానవ రహిత విమానం శకలాలను కనుగొన్నారు. ఉక్రెయిన్ తమపై దాడి చేసిందంటూ రష్యా చేస్తున్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. నాటో దేశాలు కూడా మాస్కోకు మద్దతి వ్వకపోవడం చర్చకి దారితీస్తోంది. మరోవైపు కీవ్ దాడికి యత్నించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని యూఎస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కూడా వెల్లడించినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రష్యా ఉక్రెయిన్ యుద్ధం దాదాపు నాలుగున్నరేళ్లుగా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది. ఈ సంఘర్షణకు ముగింపు పలకడానికి అంతర్జాతీయ సమాజం ఎదురుచూస్తున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో 24 గంటల్లో యుద్ధాన్ని ఆపుతానని ప్రకటించిన ట్రంప్, తన రెండవసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శాంతి చర్చల కోసం విస్తృతంగా కృషి చేస్తున్నారు. పుతిన్, జెలెన్స్కీలతో వరుస సమావేశాలు నిర్వహించి శాంతి ప్రణాళికను రూపొందించారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో జెలెన్స్కీతో సమావేశమైన తర్వాత, శాంతి ప్రణాళిక 95 శాతం పూర్తయిందని జెలెన్స్కీ ప్రకటించారు. పుతిన్ కూడా ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడగా, యుద్ధ పరిష్కారానికి ఇరుపక్షాలు ఎన్నడూ లేనంతగా దగ్గరయ్యాయని ట్రంప్ వెల్లడించారు. అయితే, ఈ సానుకూల పరిణామాల మధ్య ఒక సంచలనాత్మక ఘటన వెలుగులోకి వచ్చింది. డిసెంబర్ 28, 29 తేదీల్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాస్కో సమీపంలోని నోవ్‌గోరోడ్ ప్రాంతంలో గల తన వ్యక్తిగత నివాసం వాల్దాయిలోని ఉజిన్ కాంప్లెక్స్‌పై డ్రోన్ దాడి జరిగిందని రష్యా ఆరోపించింది. ఈ దాడిలో 91 లాంగ్ రేంజ్ డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగించిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ పేర్కొన్నారు. రష్యన్ వైమానిక రక్షణ దళాలు ఈ డ్రోన్లను సమర్థవంతంగా తిప్పికొట్టాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని రష్యా తెలిపింది. ఈ దాడిని ఉగ్రవాద చర్యగా



రష్యా అభివర్ణించి, దీనికి గట్టి ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. రష్యా ఆరోపణలను ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. పుతిన్ నివాసంపై దాడులకు సంబంధించి రష్యా ఎలాంటి ఆధారాలనూ చూపలేదని, ఇవి కేవలం నిరాధార ఆరోపణలని కొట్టిపారేసింది. శాంతి చర్చలను దెబ్బతీసేందుకు రష్యా డ్రామాలు చేస్తోందని ఉక్రెయిన్ విమర్శించింది. ఈ ఘటనపై డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడం తనకు రాజకీయంగా, వ్యక్తిగతంగా కీలకమైనదని పేర్కొంటూ, పుతిన్ స్వయంగా ఫోన్ చేసి దాడి జరిగిందని చెప్పినట్లు తెలిపారు. యుద్ధంలో దాడులు సహజమే అయినప్పటికీ, అధ్యక్షుడి నివాసాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, దాడి జరగకపోవడానికి కూడా కారణం ఉండవచ్చని, ఇంటెలిజెన్స్ నివేదికల కోసం ఎదురుచూస్తున్నానని ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ దాడిని 'నీచమైనది' గా ఖండిస్తూ, ప్రాంతీయ భద్రతకు ముప్పుగా మారే ఇలాంటి ఘటనలను నివారించాలని పిలుపునిచ్చింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ సైతం పుతిన్ ఇంటిపై దాడి ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య ప్రస్తుతం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు శత్రుత్వాలను అంతం చేయడానికి, శాంతిని సాధించడానికి మంచి మార్గాన్ని అందిస్తాయని, వాటిని దెబ్బతీసే చర్యలను నివారించాలని సూచించారు. పుతిన్ వ్యక్తిగత నివాసమైన వాల్దాయిలోని ఉజిన్ కాంప్లెక్స్ చుట్టూ అత్యంత పటిష్టమైన వైమానిక రక్షణ వ్యవస్థలు ఉన్నాయని ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. ఇందులో 12 పాంట్సీర్‌ఎస్1 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్స్ ఉన్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఇవి చిన్న డ్రోన్లు, క్షిపణులను కూల్చేసే సామర్థ్యం కలిగి ఉంటాయి. గాల్లోని చిన్న కదలికనైనా వెంటనే గుర్తించేలా ఈ వ్యవస్థ రూపొందించబడింది. ఇంతటి పటిష్టమైన భద్రత ఉన్నప్పటికీ డ్రోన్లు లక్ష్యాన్ని ఛేధించాయన్న రష్యా వాదనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదివరకు మే నెలలో మాస్కో సమీపంలోని నోవోఒగరియోవోలోని పుతిన్ మరో నివాసంపై కూడా డ్రోన్ దాడి జరిగిందని గుర్తు చేశారు. ఈ డ్రోన్ దాడి ఘటన రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని కొత్త మలుపు తిప్పడం ఖాయంగా కనిపిస్తోంది. శాంతి చర్చలు మళ్లీ పక్కకు వెళ్లే అవకాశం ఉందని, యుద్ధం మరికొన్నేళ్లు కొనసాగే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా కీవ్‌తో పాటు ఇతర ఉక్రెయిన్ నగరాలపై ప్రతీకార దాడులకు దిగే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. •

# ఆహార చిత్రపటంలో మహోన్నత శక్తి భారత్



డా. చిట్యాల రవీందర్

భారతదేశం నేడు ప్రపంచ ఆహార చిత్రపటంలో ఒక మహోన్నత శక్తిగా విరాజిల్లుతోంది. ముఖ్యంగా వరి పండించడంలో మనం సాధించిన ప్రగతి అద్వితీయం. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో ఒకటైన భారత్, తన కోట్లాది మంది ప్రజల ఆకలిని తీర్చడమేకాకుండా, ప్రపంచానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా అవతరించింది. తాజా గణాంకాల ప్రకారం భారత దేశం 157.5 మిలియన్ టన్నుల బియ్యం ఉత్పత్తిని సాధించి, పొరుగు దేశమైన చైనాను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరుకుంది. చైనా ఉత్పత్తి సుమారు 145.5 మిలియన్ టన్నుల వద్ద నిలవగా, భారత్ తన వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ద్వారా ఈ అద్భుతాన్ని ఆవిష్కరించింది. ఇది కేవలం విత్తనాలు, ఎరువుల కలయిక మాత్రమే కాదు, కోట్ల మంది రైతుల శ్రమశక్తి, శాస్త్రవేత్తల మేధోసంపత్తి కలయిక అని అర్థమవుతుంది. భారతదేశంలో హరిత విప్లవం తర్వాత వ్యవసాయ రంగం అనేక మలుపులు తిరిగింది. ఒకప్పుడు విదేశాల నుండి గోధుమలు, బియ్యం దిగుమతి చేసుకున్న మనం, నేడు 150 మిలియన్ టన్నుల మార్కును దాటి అంతర్జాతీయ మార్కెట్‌ను శాసిస్తున్నాం. భారతీయ వాతావరణం, విభిన్నమైన నేలలు, నదుల అనుసంధానం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఈ విజయానికి పునాది వేశాయి. ముఖ్యంగా గంగా, కృష్ణ, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో వరి సాగు అత్యంత విస్తారంగా జరుగుతోంది. పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు దేశ ఆహార భాండాగారాలుగా నిలుస్తున్నాయి. ఆహార భద్రత అనేది ఒక దేశ సార్వభౌమాధికారానికి ప్రతీక. ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించడమే దీని ప్రధాన ఉద్దేశం. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక భద్రతా పథకాల్లో ఒకటి. దీని ద్వారా సుమారు 80 కోట్ల మంది ప్రజలకు అతి తక్కువ ధరకే రేషన్ బియ్యం అందుతోంది. 155 మిలియన్ టన్నుల రికార్డు స్థాయి ఉత్పత్తి వల్ల దేశంలో బఫర్ స్టాక్ లేదా అత్యవసర నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఇది యుద్ధాలు, కరువులు లేదా కరోనా వంటి మహమ్మారుల సమయంలో దేశాన్ని ఆకలి నుండి కాపాడింది. చైనాతో పోల్చినప్పుడు భారత్ కేవలం ఉత్పత్తిలోనే కాకుండా, వైవిధ్యంలో కూడా ముందంజలో ఉంది. మన దగ్గర దాదాపు వందల రకాల వరి వంగడాలు ఉన్నా



యి. సువాసన వెదజల్లే బాస్మతి నుండి పౌష్టిక విలువలున్న చిట్టిముత్యాలు, నల్ల బియ్యం (బ్లాక్ రైస్) వరకు అనేక రకాలు ఇక్కడ పండుతాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ బాస్మతి బియ్యానికి విపరీతమైన గిరాకీ ఉంది. మధ్య ప్రాచ్య దేశాలు, యూరప్, అమెరికా దేశాలకు భారత్ ప్రతి ఏటా వేలకోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని ఎగుమతి చేస్తోంది. ఎగుమతుల విషయంలో భారత్ వాటా ప్రపంచ మార్కెట్‌లో సుమారు 40 శాతంగా ఉంది. అంటే ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యే ప్రతి ఐదుకిలోల బియ్యంలో రెండు కిలోలు భారతదేశానికి చెందినవే. ఇది మన ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చిపెడుతోంది. సాంకేతికత వినియోగం కూడా ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించింది. డ్రోన్ల ద్వారా ఎరువుల జల్లడం, భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాల సరఫరా, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) వంటి పద్ధతులు దిగుబడిని పెంచాయి. గతంలో ఒక ఎకరాకు పండే దానికంటే ఇప్పుడు రెట్టింపు దిగుబడి వస్తోంది. అయితే ఈ ప్రస్థానంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. వరి పండించడానికి విపరీతమైన నీరు అవసరమవుతుంది. దీనివల్ల భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఇప్పుడు 'డైరెక్ట్ సీడెడ్ రైస్' లేదా తక్కువ నీటితో పండే రకాలను శాస్త్రవేత్తలు ప్రోత్సహిస్తున్నారు. అలాగే వాతావరణ మార్పుల వల్ల వచ్చే అకాల వర్షాలు, తుఫానులు పంటను దెబ్బతీస్తున్నాయి. వీటిని తట్టుకోవడానికి ఉప్పునీటిలో కూడా పండే రకాలను, గాలివానలకు పడిపోని గట్టి రకాలను రైతులకు పరిచయం చేస్తున్నారు. చైనా తన సాగు భూమిని పారిశ్రామిక అవసరాలకు మళ్లిస్తుండటం, అక్కడి జనాభా వృద్ధాప్యం వైపు మళ్లడం వల్ల వారి ఉత్పత్తి తగ్గుముఖం పట్టి ఉండవచ్చు. కానీ భారత్ తన యువశక్తిని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను బలోపేతం చేస్తూ ముందుకు వెళుతోంది. ఆహార శుద్ధి పరిశ్రమలు పెరగడం వల్ల రైతులు పండించిన ధాన్యానికి మంచి ధర లభిస్తోంది. బియ్యం నుండి తీసే నూనె (రైస్ బ్రాన్ ఆయిల్) వంటి ఉప ఉత్పత్తులకు కూడా మంచి మార్కెట్ ఏర్పడింది. ముగింపులో చెప్పాలంటే, 155 మిలియన్ టన్నుల బియ్యం ఉత్పత్తి అనేది కేవలం ఒక గణాంకం కాదు, అది భారత్ సాధించిన ఆత్మనిర్భరతకు సంకేతం. చైనా వంటి అగ్రరాజ్యాన్నిఉత్పత్తిలో మించిపోవడం ద్వారా భారత్ తన సత్తాను చాటింది. రాబోయే కాలంలో మరింత ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ, ప్రకృతిని కాపాడుకుంటూ వ్యవసాయం చేస్తే భారత్ ప్రపంచానికి తిరుగులేని ఆహార సరఫరాదారుగా నిలుస్తుంది. ఆకలి లేని భారతదేశాన్ని నిర్మించడంలో రైతన్నల పాత్ర చిరస్మరణీయం. ఈ ఆహార భద్రత భవిష్యత్తులో దేశాన్ని ఆర్థికంగా మరింత ఉన్నత స్థానానికి చేరుస్తుంది. కేవలం బియ్యమే కాకుండా పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిలో కూడా మనం ఇదే తరహా వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉంది. అప్పుడే సంపూర్ణ ఆహార భద్రత సాధ్యమవుతుంది. •

# రష్యాపై సైనిక చర్య ఆలోచన లేదు

## వెనెజులాలో చమురు కంపెనీలకు రక్షణ : ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 11:** వెనిజులాలో రష్యా, చైనాల ఉనికిని తాము ఏమాత్రం సహించబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వెనిజులా నేత మదురో మాదిరిగానే రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కూడా భవిష్యత్తులో బంధించేందుకు అమెరికా సైనిక చర్యలకు దిగుతుందా? అని విలేకరులు ప్రశ్నించగా ఎన్నో యేళ్లుగా తనకు పుతిన్‌తో మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. పుతిన్‌ను బంధించేందుకు లేదా రష్యాపై సైనిక చర్యలకు దిగే ఆలోచన తనకు లేదని తేల్చి చెప్పారు. అయితే ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు దిశగా రష్యాపై రాజకీయ, దౌత్యపరమైన ఒత్తిడి మాత్రం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నోబెల్ శాంతి పురస్కారం అందుకునేందుకు తనకంటే అర్హుడు చరిత్రలోనే ఎవరూ లేదని ట్రంప్ వ్యాఖ్యాంచారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఏమీ చేయలేకపోయినా ఆ గౌరవం దక్కిందని అసహనం వ్యక్తం చేశారు. వెనిజులాలో చమురు నిల్వల ప్రణాళికలపై చర్చించేందుకు చమురు, సహజవాయువు సంస్థలకు చెందిన ప్రతినిధులతో శ్వేతసౌధంలో ట్రంప్ శుక్రవారం భేటీ అయ్యారు. వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడో అమెరికాలో పర్యటించనున్న నేపథ్యంలో నోబెల్‌పై ట్రంప్ మరోసారి ప్రస్తావించారు. వెనిజులాలో పెట్టుబడులు పెట్టే చమురు కంపెనీలకు పూర్తి రక్షణ కల్పిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. 'మీరు ఇప్పుడు నేరుగా అమెరికాతో లావాదేవీలు జరుపుతున్నారు. వెనిజులాతో కాదు. మీకు అక్కడ పూర్తి రక్షణ, భద్రత ఉంటుంది. మీరు వెనిజులాతో సంబంధం కలిగి ఉండాలని మేం కోరుకోవడం లేదు' అని పేర్కొన్నారు.

# డొనాల్డ్ ట్రంప్ హింట్‌తో ఇజ్రాయెల్ హైఅలర్ట్

## సమావేశమైన ఇరాన్ పార్లమెంట్

**టెహరాన్, జనవరి 11:** ఇరాన్‌లో కొన్ని రోజులుగా జరుగుతోన్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు చేసిన పోస్టుపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తమపై అమెరికా దాడిచేస్తే.. ఆ దేశంతోపాటు ఇజ్రాయెల్ తమ లక్ష్యాలుగా మారతాయని హెచ్చరించింది. ఈ పరిణామాల వేళ ఇజ్రాయెల్ ప్రభుత్వం అత్యంత అప్రమత్తతో వ్యవహరిస్తోంది. ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ దారుణంగా పడిపోవడం, జీవన వ్యయాలు పెరగడం వంటి సమస్యలతో డిసెంబరు 28 నుంచి ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారు. ఇంటర్నెట్ సేవలపై నిషేధం కొనసాగుతోంది. ఈ క్రమంలో ట్రంప్.. 'ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఇరాన్ స్వేచ్ఛ కోసం ఎదురుచూస్తోంది. వారికి సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉంది' అని నిరసన కారులకు మద్దతుగా పోస్టు పెట్టి కలకలం రేపారు. తాజా పరిణామాల వేళ ఇరాన్ పార్లమెంట్ సమావేశమైంది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులపై చట్టసభ సభ్యులు చర్చించారు. ఈ క్రమంలోనే ఇరాన్ పార్లమెంట్ స్పీకర్.. అమెరికా, ఇజ్రాయెల్‌కు హెచ్చరికలు చేశారు. సభలో పలువురు అమెరికాకు వ్యతిరేకంగా, తమ సుప్రీం లీడర్ ఖమేనీకి అనుకూలంగా నినాదాలు చేశారు. మరోవైపు ట్రంప్ పోస్టు నేపథ్యంలో.. ఇజ్రాయెల్ అప్రమత్తమైంది.

ఇరాన్ మద్దతు ఉన్న హమాస్ మిలిటెంట్లు 2023లో ఈ దేశంపై దాడులకు తెగబడ్డారు, అలాగే మరో గ్రూప్ హెచ్‌బొల్లాతోనూ పోరాడిన సంగతి తెలిసిందే.

# నిరసనకారులంతా దేవుని శత్రువులే!

## కఠిన చర్యలకు ఉపక్రమించిన ఇరాన్

**టెహ్రాన్, జనవరి 11:** ఇరాన్‌లో ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. ఇంటర్నెట్ షట్‌డౌన్, కఠినమైన అణచివేత చర్యలు ఉన్నప్పటికీ ఆందోళనకారులు వెనక్కి తగ్గడం లేదు. ఇరాన్ ప్రభుత్వం నిరసనకారులపై యుద్ధం ప్రకటించినట్లయింది. నిరసనకారులను ఏమాత్రం ఉపేక్షించవద్దని, వారిపై కఠినమైన అభియోగాలు మోపాలని ఇరాన్ అటార్నీ జనరల్ మహ్మద్ మొవాహెదీ ఆజాద్ ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. నిరసనల్లో పాల్గొన్న వారే కాకుండా, వారికి సహాయం చేసే వారిని కూడా మొహారెబ్ (దేవుడి శత్రువులు) గా పరిగణిస్తామని, దీనికి ఇరాన్ చట్టాల ప్రకారం మరణశిక్ష పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మరోవైపు, సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ కూడా నిరసనలను విదేశీ కుట్రగా అభివర్ణిస్తూ అణచివేతకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిరసనల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. అమెరికా పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. శాంతియుత నిరసనకారులను చంపితే తీవ్ర పరిణామాలు ఉంటాచని ట్రంప్ హెచ్చరించారు. మరోవైపు బహిష్కృత యువరాజు రెజా పహ్లావి కూడా శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున వీధుల్లోకి రావాలని, ప్రభుత్వ ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి సమ్మెలు చేపట్టాలని ఇరాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఇరాన్ ప్రపంచంతో సంబంధాలు లేకుండా డిజిటల్ చీకట్లో ఉంది. గురువారం నుంచే ఇంటర్నెట్, ఫోన్ సౌకర్యాలను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ ముసుగులో భద్రతా దళాలు భారీగా హింసకు పాల్పడే అవకాశం ఉందని మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే ఆస్ట్రియన్, టర్కిష్ వంటి విదేశీ విమాన సంస్థలు ఇరాన్‌కు తమ విమాన సర్వీసులను రద్దు చేసుకున్నాయి.

# సామూహిక తిరుగుబాటు చేయండి!

## ఇరాన్ ప్రవాస యువరాజు రెజా పహ్లావీ పిలుపు

**టెహ్రాన్, జనవరి 11:** దేశవ్యాప్తంగా సామూహిక తిరుగుబాటు చేయాలని ఇరాన్ ప్రవాస యువరాజు రెజా పహ్లావీ ఇరాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. సిటీ సెంటర్లను ముట్టడించాలని, ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాల్లో సమ్మెలు చేయాలని కోరారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను పతనం చేయడానికి వీధుల్లో నిరసనలు చేపట్టాలన్నారు. "ద్రోహి, క్రిమినల్ అయిన ఇస్లామిక్ రిపబ్లిక్ నేత బెదిరింపులకు దీటైన సమాధానం మీరంతా వీధుల్లోకి పెద్ద ఎత్తున రావడమే అని వారి నిరసనలను ప్రశంసించారు. ఈ నిరసనలు చూసిన తర్వాత సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ భయంతో వణికిపోతున్నారన్నారు. ఇకపై నిరసనలు మరింత సునిశిత లక్ష్యంతో, విధ్వంసకరంగా జరగాలన్నారు. రవాణా, చమురు, గ్యాస్, ఎనర్జీ సహా ముఖ్యమైన రంగాల్లోని ఉద్యోగులు, కార్మికులు దేశవ్యాప్తంగా సమ్మెను ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయడం వల్ల అసమ్మతిని అణచివేసే సామర్థ్యాన్ని ప్రభుత్వం కోల్పోతుందని చెప్పారు. వారాంతంలో మళ్లీ నిరసనలు చేపట్టాలని కోరారు. తాను కూడా స్వస్థలానికి తిరిగి రావడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. జాతీయ విప్లవ విజయోత్సవ సమయానికి మీ పక్కనే ఉండే విధంగా వస్తానన్నారు. ఇరాన్‌లో రెండు వారాల నుంచి నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో పహ్లావీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరాన్ సంక్షోభంపై పహ్లావీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యాన్ని కోరారు. ఇరాన్‌లో రాజకీయ, ఆర్థిక మార్పుల డిమాండ్‌తో జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారుతున్నాయి. దేశాధినేత అయతొల్లా ఖమేనీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ నిరసనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. టెహ్రాన్‌లోని ఆరు దవాఖానల్లో దాదాపు 217 మంది మరణించారని ఓ వైద్యుడు తెలిపారు. ఉత్తర టెహ్రాన్ పోలీస్ స్టేషన్ వెలుపల నిరసనకారులపై భద్రతా దళాల కాల్పుల్లో 40 మంది మరణించినట్లు ఆయన తెలిపారు. ఇరాన్‌లో ప్రజల ఉద్యమాల ప్రభావం భారత దేశం నుంచి ఎగుమతి అవుతున్న బాస్మతి బియ్యంపై పడింది. ఇరాన్‌కు ఎగుమతి చేయాల్సిన సుమారు రూ.2 వేలకోట్ల విలువైన ప్రీమియం బాస్మతి బియ్యం భారత గోదాముల్లో నిలిచిపోయాయి. ఇరాన్ స్పష్టమైన హామీ ఇస్తేనే వీటిని ఎగుమతి చేస్తారు. మన దేశంలో పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో బాస్మతి బియ్యం ఎక్కువగా పండుతాయి. డాలర్‌తో ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ తీవ్రంగా పతనమైంది. మన దేశం నుంచి బాస్మతి బియ్యాన్ని అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశం ఇరాన్. ఏటా దాదాపు 12 లక్షల టన్నుల బియ్యాన్ని ఇరాన్ దిగుమతి చేసుకుంటుంది. వీటి విలువ సుమారు రూ.12,000 కోట్లు. ఇరాన్ ప్రభుత్వంపై ఉద్యమిస్తున్న నిరసనకారులు వినూత్న రీతుల్లో తమ నిరసనను తెలియజేస్తున్నారు. మహిళలు సిగరెట్లు తాగుతూ, ఇరాన్ అధినేత అయతొల్లా ఖమేనీ ఫొటోలను కాల్చేస్తున్నారు. ఈ ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. ఇరాన్‌లో 1989 నుంచి కొనసాగుతున్న ఖమేనీ పాలనలో మహిళలపై తీవ్రమైన ఆంక్షలను అమలు చేశారు. సంప్రదాయాలను పాటించని మహిళలను నిర్బంధించి, హింసించారు. దీంతో ప్రజలు గత పాలకుడు షా వారసుడు రెజా పహ్లావీ తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పా టు చేయాలని కోరుకుంటున్నారు.



# అభివృద్ధిలో భారత్ పరుగులు

అదుపులోనే ద్రవ్యోల్బణం
రికార్డు స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులు
పాల ఉత్పత్తిలో మొదటి స్థానం
వైబ్రంట్ గుజరాత్ సదస్సులో ప్రధాని మోడీ

**రాజ్‌కోట్, జనవరి 11:** భారత్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, దేశంలో ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందన్నారు. రాజ్‌కోట్‌లో వైబ్రంట్ గుజరాత్ సదస్సును ప్రధాని మోడీ ప్రారంభించి, ప్రసంగించారు. భారతదేశ వృద్ధి సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే మంత్రం విజయగాథను ప్రతిబింబిస్తుందని అన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు పరిశ్రమలకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తి అతిపెద్ద అవసరమని కూడా ఆయన నొక్కి చెప్పారు. "వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్‌కు వేదిక సిద్ధమైనప్పుడల్లా, నేను దానిని మరొక శిఖరాగ్ర సమావేశంగా చూడను. ఆధునిక 21వ శతాబ్దపు భారతదేశం ప్రయాణాన్ని చూస్తున్నాను, ఇది ఒక కలతో ప్రారంభమై నేడు అచంచలమైన విశ్వాసం దశకు చేరుకుంది" అని ఆయన అన్నారు. "భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంది. భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తి కొత్త రికార్డులను సృష్టిస్తోంది. పాల ఉత్పత్తిలో దేశం మొదటి స్థానంలో ఉంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ల ఉత్పత్తిదారు కూడా. గత 11 సంవత్సరాలుగా, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ డేటాను వినియోగించే దేశంగా మారింది" అని ఆయన అన్నారు. కేంద్రంలోని తన ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీ లంకలో ఇటీవలి రాజకీయ గందర గో ళాన్ని ప్రస్తా విస్తూ, ప్రపంచ దేశాల అనిశ్చితి మధ్య భారతదేశం అపూర్వమైన నిశ్చయతను చూస్తోందని ప్రధానమంత్రి అన్నారు.

**దేశానికి అజేయమైన రక్షణ ప్రధాని మోడీ: ముఖేష్ అంబానీ**

రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండి ముఖేశ్ అంబానీ ప్రధాని నరేంద్రమోడీపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగు తున్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో భారత్ రక్షించబడిందని, దీనికి కారణం 'నరేంద్రమోడీ అనే అజేయమైన రక్షణ గోడ' ఉందని అన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జరిగిన వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సమావేశంలో ప్రసంగించిన అంబానీ.. 'ప్రపచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, వాటి ప్రభావం భారతీయులపై పడలేదని, భారతదేశానికి నరేంద్రమోడీ అజేయమైన రక్షణ గోడ ఉంది' అని అన్నారు. ఈ దశాబ్దం భారత దేశ భవిష్యత్తును నిర్వచిస్తుందని ముఖేశ్ అన్నారు. 2036 ఒలింపిక్స్‌ను అహ్మదాబాద్‌కు తీసుకురావాలనే ప్రధానమంత్రి దార్శనికతకు రిలయన్స్ ఫౌండేషన్ మద్దతు ఇస్తుందని, నరన్‌పూరాలోని వీర్‌సావర్కర్ మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్వహించడానికి, దానిని జాతీయ-అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలు, అథ్లెట్ శిక్షణకు కేంద్రంగా మార్చ దానికి రిలయన్స్ రాష్ట్ర ప్రభుత్వంతో భాగ స్వామ్యం కలిగి ఉంటుందని ఆయన అన్నారు. రిలయన్స్ గత ఐదేళ్లలో రూ. 3.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడుల్ని పెట్టిందని చెప్పారు. ఏఐని అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో భారత్‌లోనే అతిపెద్ద ఏఐ-రెడీ డేటా సెంటర్‌ను నిర్మించే ప్రణాళికలు ఉన్నట్లు చెప్పారు. జియో భారతదేశం, ప్రపంచం కోసం భారతదేశంలో నిర్మించబడిన 'పీపుల్-ఫస్ట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభిస్తుందని, ప్రజల రోజువారీ ఉత్పాదకతలను మెరుగుపరచడానికి వారి స్వంత భాషలో, వారి స్వంత పరికరాల్లో ఏఐ సేవలను యాక్సెస్ చేయడానికి వీలుకల్పిస్తుందని ముఖేశ్ అంబానీ ప్రకటించారు.



## ప్రముఖ సింగర్, ఇండియన్ ఐడల్ ప్రశాంత్ తమాంగ్ కన్నుమూత



**న్యూఢిల్లీ, జనవరి 11:** ప్రముఖ సింగర్, ఇండియన్ ఐడల్ మూడవ ఎడిషన్ విజేత ప్రశాంత్ తమాంగ్ కన్నుమూశారు. గుండెపోటుతో ఆయన మరణించినట్లు తెలుస్తోంది. ప్రశాంత్ మరణాన్ని ఆయన స్నేహితుడు, ఇండియన్ ఐడల్ కో కంటెస్టెంట్ భవేన్ ధనాక్ ధ్రువీకరించారు. ఆకస్మాత్తుగా ప్రశాంత్ ఈ లోకాన్ని వీడటం తమనుషాక్‌కు గురి చేసిందని చెప్పారు. గుండెపోటుతో ప్రశాంత్ మరణించినట్లు అనుకుంటున్నామని చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు. ప్రశాంత్ కొంతకాలంగా ఢిల్లీలో ఉంటున్నారని ఆయన చెప్పారు. ఇండియన్ ఐడల్ సమయంలో తాము రూమ్‌మేట్స్‌గా ఉండేవాళ్లమని కూడా వివరించారు. ఇండియన్ ఐడల్ ద్వారా పాపులర్ కాకమునుపు ప్రశాంత్ పశ్చిమ బెంగాల్ పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పని చేశారు. ఆయనకు భార్య, ఒక కూతురు ఉన్నారు. ఇక ప్రశాంత్ మృతిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు.

# 'సుప్రీం'కు మమత - ఇడి వివాదం

## కోల్‌కతా హైకోర్టులో రభసపై సుప్రీంకు అప్పీలు చేసిన ఇడి



**న్యూఢిల్లీ, జనవరి 11:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మధ్య తలెత్తిన వివాదం కలకత్తా హైకోర్టులో రసాభాసగా మారిన నేపథ్యంలో ఇరుపక్షాలూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ కేసు విచారణను హైకోర్టు ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసిన క్రమంలో ఈడీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బొగ్గు స్కామ్ దర్యాప్తులో భాగంగా చేపట్టిన సోదాలు, ఆధారాల సేకరణను సీఎం మమతా బెనర్జీ మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అడ్డుకున్నారని ఈడీ తన పిటిషన్‌లో ఆరోపించింది. మరో నాలుగు నెలల్లో పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార టీఎంసీ పార్టీ ఎన్నికల వ్యూహాల కోసం పనిచేస్తున్న ఐప్యాక్ సంస్థ కార్యాలయం, ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించడం తీవ్ర కలకలాన్ని రేపింది. అయితే తమ ఎన్నికల వ్యూహాలను దోచుకునేందుకే ఈడీ ఈ దాడులు చేపట్టిందని టీఎంసీ ఆరోపించింది. ఈడీ చర్యలకు నిరసనగా మమతా బెనర్జీ భారీ ప్రదర్శన కూడా నిర్వహించారు.

సోదాల సమయంలో జరిగిన వరుస ఘటనలను ఈడీ తన పిటిషన్‌లో వివరించింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను బలప్రదర్శనగా అభివర్ణిస్తూ, పోలీసులు సహా రాష్ట్ర అధికారులు జోక్యం చేసుకోవడం వల్ల బొగ్గు స్మగ్లింగ్ కేసు దర్యాప్తు సమగ్రత దెబ్బతిన్నట్టేనని పేర్కొంది. స్వేచ్ఛాయుతంగా, స్వతంత్రంగా దర్యాప్తు జరిపే తమ హక్కును రాష్ట్ర యంత్రాంగం హరించిందని ఆక్షేపించింది. ఈ ఘటనలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరింది. బొగ్గు స్కామ్‌కు సంబంధించిన రూ.20 కోట్లను హవాలా మార్గాల ద్వారా ఐప్యాక్‌కు మళ్లించినట్టు కీలక ఆధారాలు లభించాయని ఈడీ తెలిపింది. అయితే సోదాల సమయంలో ప్రతీక్ జైన్ ఇంట్లోకి మమత ప్రవేశించి కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను లాక్కెళ్లారని ఆరోపించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద జరుగుతున్న సోదాల్లో జోక్యం చేసుకోవద్దని కోరినప్పటికీ, మమత పోలీసుల సాయంతో బలవంతంగా ఆధారాలను తీసుకెళ్లారని పేర్కొంది. ఐదుగురు సాక్షులను కూడా "సమర్థవంతంగా హైజాక్ చేశారని ఆరోపించింది. స్వాధీనం చేసుకున్న పత్రాలు, డిజిటల్ పరికరాలను వినియోగించ "కుండా, తొలగించకుండా లేదా మార్పుచేర్పులు చేయకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని ఈడీ కోరింది. ఇదే సమయంలో, తమ వాదన వినకుండా ఎలాంటి ఆదేశాలూ జారీ చేయవద్దని కోరుతూ ప్రభుత్వం కెవియెట్ దాఖలు చేసింది.

# యుపిఎస్‌సి పరీక్షలకు ముఖ గుర్తింపు తప్పనిసరి!

**న్యూఢిల్లీ, జనవరి 11:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తమ పరీక్షల నిర్వహణలో మార్పులుచేసింది. పరీక్షల్లో పారదర్శకతను పెంచి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇకపై యూపీఎస్సీ నిర్వహించే అన్ని ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఫేస్ అథెంటికేషన్ (ముఖ గుర్తింపు) తప్పనిసరి చేసింది. యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే ప్రతీ అభ్యర్థికి పరీక్షా కేంద్రంలో ఫేస్ అథెంటికేషన్ నిర్వహిస్తాం" అని ప్రకటనలో స్పష్టం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫేషియల్ అథెంటికేషన్ టెక్నాలజీని యూపీఎస్సీ ఇప్పటికే ప్రయోగాత్మకంగా పరీక్షించింది. 2025 సెప్టెంబర్ 14న జరిగిన ఎన్‌డీఏ (నేషనల్ డిఫెన్స్ అకాడమీ), ఎన్ఏ (నావల్ అకాడమీ) , సీడీఎస్ (కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్) పరీక్షల్లో ఈ పైలట్ ప్రోగ్రాంను విజయవంతంగా నిర్వహించింది. గురుగ్రామ్‌లోని ఎంపిక చేసిన కేంద్రాల్లో అభ్యర్థుల ముఖాలను డిజిటల్‌గా స్కాన్ చేసి, వారి దరఖాస్తు ఫారాల్లోని ఫొటోలతో సరిపోల్చారు. ఈ కొత్త విధానంపై యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్ కుమార్ మాట్లాడుతూ, దీనివల్ల ఒక్కో అభ్యర్థి వెరిఫికేషన్ సమయం సగటున 8 నుంచి 10 సెకన్లకు తగ్గిందని తెలిపారు. ఇది సమయం ఆదా చేయడంతో పాటు పరీక్షలకు అదనపు భద్రతను అందిస్తుందని వివరించారు. దేశంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ సహా పలు నియామక పరీక్షలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# ఫోన్, ఇంటర్నెట్ కూడా వాడని ఎన్ఎస్ఏ అజిత్‌దోవల్!



**న్యూఢిల్లీ, జనవరి 11:** ఇండియన్ జేమ్స్‌బాండ్‌గా పేరు పడిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఫోన్, ఇంటర్నెట్ అస్సలు వాడనే వాడరని తేలింది. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో అజిత్ దోవల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, తాను ఇంటర్నెట్ ఉపయోగించననే మాట నిజమే అని అజిత్ దోవల్ వెల్లడించారు. ఫోన్ కూడా వాడనని చెప్పారు. తన కుటుంబ సభ్యులు, ఇతర దేశాల్లోని ప్రజలతో మాట్లాడేందుకు కొన్ని సందర్భాల్లో మాత్రమే ఉపయోగిస్తాని చెప్పారు. అది కూడా అవసరం అనుకుంటేనే వాడతానని చెప్పారు. ప్రతిరోజు ఈ రెండు లేకుండా తన పనులు చేసుకునేలా నిర్వర్తించేలా ప్రణాళిక వేసుకుంటానని భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. అయితే కమ్యూనికేషన్ కోసం చాలా మార్గాలు ఉన్నాయని అందులో ప్రజలకు తెలియనివి చాలా ఉన్నాయని దోవల్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో 1945లో జన్మించిన అజిత్ దోవల్ 1968లో ఐపీఎస్‌లో చేరారు. విధుల్లో చూపిన ధైర్యసాహసాలకుగానూ కీర్తిచక్ర అందుకున్న అతి పిన్న పోలీస్ అధికారిగా నిలిచారు అజిత్ దోవల్. మిజోరం, పంజాబ్, ఈశాన్య ప్రాంతాల్లో చోటుచేసుకున్న తిరుగుబాటు వ్యతిరేక ఆపరేషన్లలో కీలకంగా వ్యవహరించారు ఈ భారత గుఢచారి. కేరళ క్యాడర్‌కు చెందిన అజిత్ దోవల్ నిఘా, అంతర్గత భద్రతా విభాగాల్లో ఎక్కువకాలం పనిచేశారు. జాతీయ భద్రతా నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. 1999లో కాందహార్ ఐసి814 ప్లేన్ హైజాక్ సందర్భంగా చర్చల్లో పాల్గొన్న వారిలో దోవల్ ఒకరు.

# సంక్షిప్తంగా..

## నన్నుచూసి భారత్ భయపడుతోంది:సైఫుల్లా కసూరి



**కరాచి, జనవరి 11:** తన ఉనికి చూసి భారతదేశం భయపడుతోందని లష్కరే తోయిబా టాప్ లీడర్, పహల్గామ్ ఉగ్రదాడి మాస్టర్‌మైండ్ సైఫుల్లా కసూరి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కశ్మీర్ మిషన్ నుంచి తాము ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రగల్భాలు పలికాడు. అంతర్జాతీయ సమాజం ముందు ఉగ్రవాదంపై పోరాడుతున్నామని చెబుతున్న పాకిస్థాన్ ముసుగును కసూరి ఈ సందర్భంగా తొలగించాడు. కేవలం ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం భారత్ చేసిన పొరపాటని, తమ పోరాటం కొనసాగుతుందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. పహల్గామ్ దాడి తర్వాత తన పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోతోందని కసూరి పేర్కొన్నాడు.

## గోవులను తరలిస్తున్నారని జార్ఖండ్‌లో ముస్లిం వ్యక్తి హత్య

**గొడ్డా(జార్ఖండ్), జనవరి 11:** జార్ఖండ్‌లోని గొడ్డా జిల్లాలో పశువుల దొంగతనం అనుమానంతో 45 ఏళ్ల పప్పు అన్సారీ అనే వ్యక్తిని అల్లరి మూక దారుణంగా కొట్టి చంపింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కలకలం రేపింది. రాణిపూర్ గ్రామానికి చెందిన పప్పు అన్సారీ పశువుల రవాణా వ్యాపారం చేస్తుంటాడు. బీహార్‌లోని శ్యామ్ బజార్ పశువుల సంత నుంచి తిరిగి వస్తుండగా 2025 మంది వ్యక్తులు అతడి వాహనాన్ని ఆపి దాడికి దిగారు. బాధితుడి సోదరుడు నసీమ్ కథనం ప్రకారం నిందితులు పప్పు అన్సారీని వివస్త్రను చేసి, అతడు ముస్లిం అని తెలుసుకున్న తర్వాతే గొడ్డళ్లు, బాణాలతో దాడి చేశారు. నా సోదరుడిని ముస్లిం అని తిడుతూ, గొడ్డలితో తల పగలగొట్టి చంపారు. ముస్లిం కావడం ఈ దేశంలో నేరమా అని నసీమ్ కన్నీటిపర్యంతమయ్యాడు.

## అత్యాచార ఆరోపణలపై కేరళ ఎమ్మెల్యే అరెస్ట్



**తిరువనంతపురం, జనవరి 11:** అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న కేరళ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్‌ను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. పాలక్కాడ్‌లోని ఒక హోటల్ నుంచి కస్టడీలోకి తీసుకున్నారు. ఇటీవల ఓ యువతి అతడిపై అత్యాచార ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ అరెస్టు చోటు చేసుకుంది. రాహుల్ మామ్‌కుటత్తిల్ తమను లైంగికంగా వేధిస్తున్నట్లు గతంలో ఓ నటి, మరో యువతి అతడి ఫిర్యాదు చేశారు. దాంతో అత్యాచార కేసులు నమోదయ్యాయి. వాటిల్లో ముందస్తు బెయిల్ పొందారు. ఇటీవల మరో యువతి కూడా అతడిపై ఆరోపణలు చేసింది. ఎమ్మెల్యేపై రేప్‌కేసులు నమోదు కావడంతో తాను కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఇక అప్పటి నుంచి పరారీలో ఉన్న అతడిని పాలక్కాడ్‌లో తాజాగా అరెస్టు చేశారు. వరుస లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అతడిని బహిష్కరించింది.

## 'గ్రోక్ ' అసభ్య కంటెంట్ వ్యవహారం: 600 ఖాతాలు డిలిట్

**న్యూఢిల్లీ, జనవరి 11:** ఎక్స్‌లోని ఏఐ ప్లాట్‌ఫామ్ గ్రోక్‌ను వాడి కొందరు అసభ్య, అశ్లీల, చట్టవిరుద్ధ కంటెంట్‌ను సృష్టిస్తున్నారంటూ తీవ్ర ఆందోళన వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఆ కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఎక్స్ చర్యలు చేపట్టింది. 3500 పోస్టులను బ్లాక్ చేయడంతో పాటు 600 ఖాతాలను డిలీట్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అలాగే తమ వేదికపై అసభ్యతకు తావివ్వబోమని, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నాయి. మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం ఎక్స్ అనుసంధానంగా ఉన్న గ్రోక్ సాయంతో ఇటీవల కొందరు అసభ్యకర చిత్రాలు సృష్టించారు. మహిళల ఫొటోలను ఇబ్బందికరంగా మార్ఫింగ్ చేసి పోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి.

## అమెరికాలో కాల్పులు, ఆరుగురి మృతి

**అలబామా, జనవరి 11:** అమెరికాలోని ఈస్టర్న్ మిసిసిపీలో శుక్రవారం రాత్రి జరిగిన వరుస కాల్పుల ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. నిందితుడు ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్నాడు. అలబామా సరిహద్దుకు సమీపంలోని వెస్ట్ పాయింట్ పట్టణంలో ఈ దాడులు జరిగాయి. మొత్తం మూడు చోట్ల నిందితుడు కాల్పులు జరిపినట్లు స్థానిక వార్తా సంస్థలు పేర్కొన్నాయి. "హింస కారణంగా పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోయారు" అని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల కస్టడీలో ఉన్నాడని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దాదాపు 20 వేల జనాభా కలిగిన క్లే కౌంటీలో ఈ దారుణం చోటుచేసుకుంది.

# కేరళ, బెంగాల్‌లో బిజెపి అధికారం తథ్యం - శబరిమల కేసు తటస్థ ఏజెన్సీకి అప్పగించాలి

## కేరళ పర్యటనలో పినరై సర్కార్‌పై అమిత్ షా ధ్వజం



**తిరువనంత పురం, జనవరి 11:** శబరిమల బంగారం చోరీ వ్యవహారంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సారథ్యంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం బంగారం మాయం చేసినవారి కొమ్ముకాస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఈ కేసును స్వతంత్ర, తటస్థ విచారణ ఏజెన్సీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. పినరయి విజయన్ ప్రభుత్వం హయాంలో నిజం బయటకు రాదన్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరువనంతపురం కార్పొరేషన్‌ను గెలుచుకుంది. ఈ విజయం అనంతరం తిరువనంతపురంలో అమిత్‌షా తొలిసారి పర్యటించారు. కొత్తగా ఎన్నికైన బీజేపీ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడటంతో పాటు పార్టీ మిషన్2026 ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో అమిత్‌షా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. శబరిమల అంశాన్ని ప్రస్తావిస్తూ, ఈ ఘటన కేవలం కేరళకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా ఉన్న భక్తులతో ముడిపడిన అంశమని చెప్పారు. కీలకమైన పుణ్యక్షేత్రంలోని విలువైన వస్తువులను కాపాడటంలో విఫలమైన ప్రభుత్వం ప్రజల మత విశ్వాసాలను ఎలా కాపాడుతుందని ప్రశ్నించారు. ఈ కేసులో నిందితులకు అనుకూలంగా ఎఫ్ఐఆర్ రూపొందించినట్లు కనిపిస్తోందన్నారు.

ఎల్‌డీఎఫ్‌తో సంబంధం ఉన్న ఇద్దరు అనుమానితుల్లో ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో నిష్పాక్షిక విచారణ ప్రశ్నార్థకమేనని అన్నారు. శబరిమల బంగారం చోరీపై విచారణను తటస్థ విచారణ ఏజెన్సీకి అప్పగించాలని అమిత్‌షా డిమాండ్ చేశారు. ఈ విషయమై బీజేపీ ఇంటింటికి వెళ్లి ప్రచారం సాగిస్తుందని, ప్రజల్లో చైతన్యం కలిగిస్తుందని చెప్పారు.

వార్త, హైదరాబాద్, సోమవారం 12, జనవరి 2026

## హైదరాబాద్‌లో అరైవ్ అలైవ్ కార్యక్రమం

**హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరగనుంది. యూసుఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో మధ్యాహ్నం జరగనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.డిజిపి శివధర్‌రెడ్డితోపాటు సిటీ కొత్వాల్ సజ్జనార్ సహా పోలీసు ఉన్నతాధి కారులు, అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను కనిష్టస్థాయికి తెచ్చేందుకు పోలీసు శాఖ ఇటీవల ప్రారంభించిన అరైవ్ అలైవ్ కార్య క్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో జరుగు తుందని తెలిసింది. కమిషనరేట్లతోపాటు జిల్లా పోలీసు విభాగాల్లో ఈ కార్యక్రమాన్ని పోలీసులతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులు నిర్వహిస్తుండగా ఇందులో విద్యార్థులతో పాటు యువతను పాలుపంచుకునేలా చేస్తు న్నారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమైన మానవ తప్పిదాలు జరగకుండా చూడడం, డ్రంకన్ డ్రైవ్‌ను పూర్తిగా నివారించడం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నారు.

# తలసేమియా రహిత రాష్ట్రంగా తెలంగాణ



**2035 నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలి**

**చికిత్స అందించేందుకు మరో 3 సెంటర్ల ఏర్పాటు**

**తలసేమియా సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొట్ట మొదటి తలసేమియా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. తలసేమియా అండ్ సికిల్‌సెల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఒక హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న ఏసియన్ తలసేమియా కాన్‌క్లేవ్‌లో మంత్రి ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేషెంట్లు, దేశ, విదేశాల నుంచి వచ్చిన డాక్టర్లు, ఇతర నిపుణులను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, హీమోఫీలియా వంటి వ్యాధులు కేవలం వైద్యపరమైన నిర్ధారణలు మాత్రమే కావని, అవి బాధిత కుటుంబాలను, సమాజాన్ని జీవితకాలం వెంటాడే తీవ్రమైన సవాళ్లు అని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. రక్తసంబంధీకుల మధ్య వివాహాలు (మేనరికం) చేసుకోవడం వల్ల తల్లిదండ్రుల నుంచి పిల్లలకు ఈ జన్యుపరమైన వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఎక్కువగా ఉంటున్నాయి. దాని నివారించడానికి ముందస్తు స్క్రీనింగ్, కౌన్సిలింగ్, సామాజిక అవగాహన కల్పించడమే సరైన మార్గమని, నివారణే అత్యుత్తమ చికిత్స అన్నారు.
తెలంగాణ ప్రభుత్వం ఈ వ్యాధుల నియంత్రణకు, బాధితుల సంక్షేమానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స అందిస్తున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తలసేమియా, సికిల్‌సెల్ సొసైటీ సహకారంతో మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో వివాహవయంతల్లా ప్రతి గర్భిణీకి పరీక్షలు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.
తలసేమియా బాధితులకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు ఇప్పటికే ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో డే కేర్ సెంటర్లను నిర్వహిస్తున్నామని, త్వరలో ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లలో అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి వెల్లడించారు.
రాష్ట్రంలో సికిల్‌సెల్ వ్యాధిని గుర్తించేందుకు ఇప్పటివరకు 11 లక్షల మందికి పైగా స్క్రీనింగ్ పూర్తి చేశామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స అందిస్తున్నామని మంత్రి దామోదర తెలిపారు. నిమ్స్ హాస్పిటల్‌లో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యాధునిక చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. టెస్టులన్నీ ఫ్రీగా చేయిస్తామన్నారు. తెలంగాణ హెల్త్ విజన్ 2047లో భాగంగా అందరికీ అందుబాటులో మెరుగైన వైద్యాన్ని అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందిస్తూ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని గుర్తుచేశారు. టీ-డయాగ్నోస్టిక్స్ ద్వారా ఉచిత పరీక్షలు చేయిస్తున్నామన్నారు. తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా పేషెంట్లకు అవసరమైన అన్ని రకాల పరీక్షలను డయాగ్నస్టిక్ సెంటర్లలో ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వం, వైద్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేసి మిషన్ తలసేమియా ఫ్రీ తెలంగాణ లక్ష్యాన్ని సాకారం చేసుకుందామని మంత్రి పిలుపునిచ్చారు.
దేశంలోనే తలసేమియా పేషెంట్లు లేని తొలి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుదామన్నారు. తలసేమియా, సికిల్ సెల్ పేషెంట్లు అందరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు.

## మహిళా ఐఎఎస్ అధికారిపై అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**టిజిఒ కేంద్ర సంఘం**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బాధ్యతాయుతమైన విధుల్లో ఉన్న ఒక మహిళా ఐఎఎస్ అధికారిపై ఇటీవల కొన్ని మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలను తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం (టిజిఒ) తీవ్రంగా ఖండించింది. సదరు అధికారిణి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా, ఆమె గౌరవానికి, పరువుకు భంగం కలిగించేలా ఉన్న ఈ కథనాలు అత్యంత దురదృష్టకరమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి శ్యామ్ పేర్కొన్నారు. నిజా నిజాలు నిర్ధారించుకోకుండా, కేవలం సంచలనం కోసం ఒక మహిళా అధికారిపై ఇటువంటి అసత్య ప్రచారాలు చేయడం అప్రజాస్వామి కమని ఆవేదన వ్యక్తంచేశారు. కథనాలు సదరు అధికారి మనోధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుం డా, విధి నిర్వహణలో ఉన్న అధికారులందరిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతా యన్నారు. ఇటువంటి తప్పుడు కథనాలను ప్రసారం చేసిన మీడియా సంస్థలు తక్షణమే బేషరతుగా బహి రంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపి గొడం నగేష్

## ఆదివాసీల ఆత్మబంధువులు హైమన్ డార్ఫ్‌జెట్టి ఎలిజిబెత్ దంపతులు

**ఆదిలాబాద్ ఎంపి గొడం నగేష్**

**ఆసిఫాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** ఆదివాసీల ఆత్మబంధువులు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు గొడం నగేష్ అన్నారు. ఆదివారం ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతుల 39వ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పి నితికా పంత్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు, గిరిజన సంఘాల నాయకులతో కలిసి ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్, కొమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ మాట్లాడుతూ మార్లవాయి ఎంతో చారిత్రాత్మక ప్రాంతమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఈ ప్రాంతం వారు విద్య, ఉద్యోగ రంగాలలో రాణించాలని, గిరిజనుల అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని తెలిపారు. ఎలాంటి సౌకర్యాలు లేని రోజులలో ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులు ఈ ప్రాంతంలో తిరిగి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒకే నివేదిక తయారుచేసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులు స్వాతంత్రం రాకముందే ఈ ప్రాంతంలో పర్యటించి గిరిజనులతో మమేకమై ఆదివాసీల చైతన్యం కోసం కృషి చేశారని, హైమన్ మానవ పరిణామ పర్యావరణవేత్త, గొప్ప శాస్త్రవేత్త అని తెలిపారు. ఈ ప్రాంత సమస్యలను గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేశారని, వీరి స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు విశ్వనాథ్, ఇరుకుల్ల మంగ, డిసిసి అధ్యక్షురాలు సుగుణ, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్యాం నాయక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, మార్లవాయి సర్పంచ్ కనక ప్రభావతి, రాజ్ గోండ్ సేవా సమితి ప్రతినిధి సిడాం అర్జు, రాయి సెంటర్ జిల్లా మేడి కుర్సింగ మోతిరామ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో రూ.60 కోట్లతో 33 /11 కె.వి సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన

**పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 11:** నిజామాబాద్ నగర అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ మరో కీలక ముందడుగు వేసింది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల సమగ్ర అభి వృద్ధి లక్ష్యంగా రూ. 60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 33/11 కె.వి సబ స్టేషన్ పనులకు శంకు స్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఆది వారం జరిగిన ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..ప్రతి డివిజన్‌కు కోటి రూపాయల చొప్పున నిధులు కేటాయించి నిజామాబాద్ నగర రూపురేఖలను పూర్తిగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.33/11 కె.వి సబ్‌స్టేషన్ ఏర్పాటు ద్వారా నిజామాబాద్ పట్టణంలో లో వోల్టేజ్ సమస్యలు పూర్తిగా తొలగి, నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఇది వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కూడా దోహద పడుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిజామాబాద్ నగరానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసిందని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిజామాబాద్ పట్టణంలో సీఎం సహాయ నిధి (దిలీళిసీ) చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని అన్నారు సీఎం రేవంత్‌రెడ్డి నాయ కత్వంలో ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు.



నిజామాబాద్‌లో ఆదివారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేశ్

## సెప్టెంబరు 4 నుంచి 32వ జాతీయ ఐఎస్‌ఒఐ కాన్ఫరెన్స్

**కాన్ఫరెన్స్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సెప్టెంబర్ 4 నుంచి 6 వరకు 32వ జాతీయ స్థాయి ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓరల్ ఇంప్లాంటాలజిస్ట్స్ (ఐఎస్‌వోఐ-2026) కాన్ఫరెన్స్ జరగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఆవిష్కరిం చారు. త సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లా డుతూ.. హైదరాబాద్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైద్య, దంత వైద్య సదస్సులు నిర్వహించ బడటం రాష్ట్రానికి గర్వకారణ మన్నారు. డిజిటల్ యుగానికి అనుగుణంగా రెజినరేట్, రీస్టోర్, రీహాబిలిటేట్ థీమ్‌తో నిర్వహించనున్న ఈ కాన్ఫరెన్స్, ఓరల్ ఇంప్లాంటాలజీ రంగంలో నూతన సాం కేతిక పరిజ్ఞానం, పరిశోధనలు, ఆధునిక చికిత్సా విధానాలను దేశ వ్యాప్తంగా దంత వైద్యులకు చేరువ చేస్తుందని పేర్కొన్నారు. సీనియర్ డెంటల్ సర్జన్ డాక్టర్ సి.శరత్‌బాబు, కాన్ఫరెన్స్ అఫిషియల్ స్పోక్స్ పర్సన్ మాట్లాడుతూ ఐఎస్ వోఐ-2026 కాన్ఫరెన్స్ ద్వారా డిజిటల్ ఇంప్లాంటాలజీ, అడ్వాన్స్‌డ్ రీజనరేటివ్ టెక్నిక్స్, ప్రిసిషన్‌బేస్డ్ రిస్టోరేటివ్ సొల్యూషన్స్‌పై లోతైన అవగాహన కల్పించడమే కాన్ఫరెన్స్ ప్రధాన లక్ష్యమన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రముఖ నిపుణులతో జ్ఞాన మార్పిడి జరగడం వల్ల యువ దంత వైద్యులకు ఇది అరుదైన అవకాశంగా నిలవనుందన్నారు. ఐఎస్‌వోఐ-2026 ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ విజయ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పద్మరాయలు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓరల్ ఇంప్లాంటాలజీ రంగంలో ఉన్న తాజా పరిజ్ఞానం, క్లినికల్ నైపుణ్యాలు, పరిశోధన ఫలితాలను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ కాన్ఫరెన్స్ ముఖ్య ఉద్దేశమన్నారు. హైదరాబాద్‌లో ఈ స్థాయి జాతీయ సదస్సు నిర్వహించబడటం దంత వైద్య అకడమిక్ రంగానికి మరింత బలాన్ని స్తుందన్నారు. సెప్టెంబర్ 4 నుంచి 6 వరకు హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ వేదికగా జరగనున్న ఈ జాతీయ సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖ ఓరల్ ఇంప్లాంటాలజిస్టులు, అకడమిషియన్లు, పరిశోధకులు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నగరం మరోసారి దేశంలోని ప్రముఖ దంత వైద్య అకడమిక్ హబ్‌గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటుందని నిర్వాహకులు స్పష్టం చేశారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి: జాజుల



ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, పిట్ల శ్రీధర్, గుజ్జ కృష్ణ, ఏడుకోండలు, వేముల భరత్, వల్లపు శివకుమార్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 11, ప్రభాతవార్త:** ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, అణగారిన ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసిన వడ్డె ఓబన్న విగ్రహాన్ని రాష్ట్ర రాజధాని నగరంలో ప్రతిష్ఠించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ ప్రభుత్వాన్ని కోరారు.
ఈ మేరకు జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఓబన్న 219 జయంతి ఉత్సవంలో వారు ముఖ్యఅతిధులుగా పాల్గొని మాట్లాడారు. వడ్డెరులకు జనాభా ప్రాతిపదిక రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, నామినేటేడ్ పదవుల్లో, రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని, ఆర్థికంగా ఎదగటానికి ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే మైనింగ్, కాంట్రాక్ట్ పనుల్లో ఖచ్చితంగా 20 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని, వడ్డెర బంధు పథకాన్ని ప్రారంభిం చాలని, సంచార జాతుల్లో ఉన్న వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వారు కోరారు.ల ఈ జయంతి సభలో సంఘం గౌరవ అధ్యక్షుడు రూపని లోక్‌నాథం, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల భరత్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లపు శివకుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బోదాస్ రవి, మహిళా విభాగం అధ్యక్షురాలు మక్కల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వారి ఓబన్న చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## నైవేలి లిగ్నైట్‌కు స్కోచ్ గోల్డ్ అవార్డు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** అత్యుత్తమ ఆర్థిక పనితీరుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సి ఇండియా లిమిటెడ్) ప్రతిష్టాత్మక స్కోచ్ గోల్డ్ అవార్డుకు ఎంపికైంది. న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో వికసిత్ భారత్ అనే థీమ్‌తో జరిగిన 105వ స్కోచ్ సమ్మిట్‌లో ఈ స్కోచ్ గోల్డ్ అవార్డును ప్రదానం చేసింది. ఎన్ఎల్‌సిఐఎల్ బలమైన ఆర్థిక ప్రాథమికాలు, వివేకవంతమైన ఆర్థిక నిర్వహణ, కార్యాచరణ సామర్థ్యం, వాటాదారుల కోసం స్థిరమైన విలువ సృష్టిని గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. క్రమశిక్షణతో కూడిన మూలధన కేటాయింపు, వ్యయ ఆప్టిమైజేషన్, బలమైన పాలన విధానాలు, స్థిరమైన కార్యాచరణ శ్రేష్ఠత ద్వారా ఆర్థిక స్థితిస్థాపకతను ప్రదర్శించింది. ఈ అవార్డు ఎన్ఎల్‌సి సంస్థ పారదర్శకత, జవాబుదారీతనం మరియు దీర్ఘకాలిక స్థిరమైన వృద్ధికి నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఈ సందర్భం గా ఎన్ఎల్‌సిఐఎల్ సిఎండి మోటుపల్లి ప్రసన్న కుమార్ మాట్లా డుతూ ప్రతిష్టాత్మక గుర్తింపు మొత్తం ఎన్ఎల్‌సి ఇండియా లిమి టెడ్ కుటుంబం సమష్టి కృషికి నిదర్శనమన్నారు. ఈ అవార్డును నేను మా ఉద్యోగులకు అంకితం చేస్తున్నాని ప్రకటించారు. వారి అచం చలమైన నిబద్ధత, వృత్తి నైపుణ్యం, సమగ్రత సంస్థకు ఆర్థిక బలం తోపాటు, కార్యాచరణ పనితీరుకు వెన్నెముకగా నిలుస్తాయన్నారు. పున రుత్పాదక ఇంధనం, పర్యావరణపరంగా స్థిరమైన కార్యకలాపాల వైపు దాని వ్యూహాత్మక పరివర్తనను ముందుకు తీసుకువెళుతుందని పేర్కొన్నారు.

## రూ.2,273 కోట్లతో వ్యవసాయ ప్రతిపాదనలు

**కేంద్రానికి రాష్ట్ర సర్కార్ నివేదిక**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** కేంద్రం అమలు చేస్తున్న వ్యవసాయ, సంక్షేమ పథకాల ద్వారా తెలంగాణకు రూ.2,273 కోట్ల మేర నిధులు రాబట్టాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. తద్వారా కేంద్రం నుండి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టడంపై రాష్ట్ర సర్కార్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధపెట్టిన వ్యవసాయ శాఖ ఇందుకు 2,273 కోట్ల రూపాయలతో రూపొందించిన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది.
కాగా రాష్ట్రాలు తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించటానికి కేంద్ర ప్రభుత్వం సౌలభ్యం కల్పిస్తోంది. రాష్ట్రాలు తయారు చేసిన సంబంధిత ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసి 60:40 నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తోంది.
గత ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు అతంత మాత్రంగా ఉండటంతో తెలంగాణలో ఈ పథకం అమలు నిలిచిపోయింది.
2015-16 నుండి ఈ పథకం యొక్క నిధుల సరళిని కేంద్రం మరియు రాష్ట్రాల మధ్య 60:40 నిష్పత్తిలో మార్చారు. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిలో నిధులు కేటాయిస్తారు.

## పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల జెఎసి ప్రధాన సలహాదారు ప్రొ. కె.కోదండరాం**

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 11, ప్రభాతవార్త:** పెన్షనర్ల సమస్యలను ప్రతీసారి ప్రభుత్వానికి విన్నవించుకోవాల్సి వస్తుందని, ఉద్యోగులంతా ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించు కోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల జెఎసి ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ కె.కోదండరాం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన డి.ఎ/డి.ఆర్ 6 వాయిదాలను విడుదల చేయాల్సిన, పిఆర్‌సి కూడా ప్రకటించాల్సిన అవసరముందని ఆయన అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం 18వ సర్వసభ్య సమావేశం సి.మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరుగగా ప్రత్యేక అతిథులుగా ప్రొఫెసర్ కె.కోదండరాం, జెఏసి చైర్మన్ కె.లక్ష్మయ్య, కోచైర్మన్ ఎ.పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి టి.సత్యనారాయణలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ముఖ్యంగా పెన్షనర్లకు ఆరోగ్య పథకం ఈహెచ్‌ఎస్ అమలు చేయకపోవడం వల్ల ఆస్పత్రి బిల్లులు, ఇతరత్రా కారణాల వల్ల చనిపోతున్నారని, ఇప్ప టికైనా ప్రభుత్వం మార్చి 2024 తర్వాత రిటైరైన వారందరికీ వెంటనే రావాల్సిన పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. ఇంటర్ బోర్డు విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిం చేందుకు జెఏసి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. చైర్మన్ లక్ష్మయ్య పెన్షనర్లకు రావాల్సిన 6 బకాయిల డి.ఆర్.లు, ఈహెచ్‌ఎస్‌ను తప్పనిసరిగా త్వరలో ప్రకటిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తపరుస్తూ సమస్యల సాధనకై అనేక పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి టి.సత్య నారా యణ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పెన్షనర్ల సమస్యలను వివరించారు.
ఈ సమావేశంలో 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 18మంది పెన్షనర్లను, 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ముగ్గురు పెన్షనర్లను ఘనంగా సన్మానించారు.




సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం, లక్ష్మయ్య, పుల్లయ్య, సత్యనారాయణ తదితరులు

## రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం అమలు చేయాలి

**పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే ప్రకటించాలి**

**తపస్ నూతన రాష్ట్ర కార్యవర్గం తీర్మానం**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి)ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే ప్రకటించాలని నూతన కార్యవర్గం డిమాండ్ చేసింది. 2025-28 సంవత్సరాలకు సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు.
సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశం ఆదివారం అబిడ్స్‌లోని ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగింది. ఈ సమావేశంలో 2025-28 సంవత్సరాల కాల పరిధికి తపస్ నూతన రాష్ట్ర అధ్యక్షులుగా వోడ్నాల రాజశేఖర్ (జగిత్యాల), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తెల్కల పల్లి పెంటయ్య (యాదాద్రి)లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించినట్టు కొత్తగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం అమలుపరచాలని, పెండింగ్లో ఉన్న పిఆర్సి డిఏలను వెంటనే ప్రకటించాలని, పిఆర్సి కమిటీ నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు పరచాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. అలాగే. విద్యారంగంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని సమావేశం తీర్మానించిందని తెలిపారు. సమావేశంలో ఏబిఆర్ఎస్‌యం జాతీయ సంఘటన మంత్రి మహేంద్ర కపూర్, ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్, పూర్వ తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంత్ రావు, నవాత్ సురేషపాల్గొనగా..ఎన్నికల అధికారులుగా పాలేటి వెంకట్ రావు, అయిలినేనినరేందర్ రావు వ్యవహరించారని తెలిపారు.



ఆదివారం బాలంరాయి లీ ప్యాలెస్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

## సికిందరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసే వరకు ఉద్యమిస్తాం


**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జనవరి 11, ప్రభాతవార్త:** 220 సంవత్సరాల చరిత్ర కలిగిన సికిందరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆపేది లేదని, అవసరమైతే ఆమరణ నిరాహారదీక్ష కూడా చేపడ తామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. సికిందరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన సికిందరాబాద్ పేరును అస్తిత్వాన్ని దెబ్బతీయాలని సిఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 17న 10 వేల మందితో సికిందరాబాద్ స్టేషన్ నుంచి ప్యారడైజ్ ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జిలు ధరించి జెండాలతో శాంతి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే అమరణ నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవన్, బేరేజెస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్, తలసాని సాయికిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నాటకరంగమే ఊపిరిగా జీవించిన గొప్ప రంగస్థలనటుడు ముట్నూరి కామేశ్వరరావు

**ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 11, ప్రభాతవార్త :** వృత్తిరీత్యా కెనరా బ్యాంకులో ఎజిఎంగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసినా ఎంతో ఆసక్తితో ప్రవృత్తిగా 33 యేళ్లుగా నాటకరంగమే ఊపిరిగా, నాటకరంగ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా జీవించి మహోన్నత రంగస్థల నటుడు ముట్నూరి కామేశ్వరరావు అని ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి. రమణాచారి అన్నారు. బ్యాంకులో సేవలందిస్తూ కూడా తోటి ఉద్యోగులను ప్రోత్సహిస్తూ ఎన్నో నాటకాలు వేయడం, వేయించడంలో పాటుపడ్డారని వివరించారు. మూడు దశాబ్దాలుగా సుప్రసిద్ధ రంగస్థల సంస్థ రస రంజని మాజీ ప్రధానకార్యదర్శిగా, ప్రస్తుత ఉపాధ్యక్షుడుగా తెలుగు నాటకరంగం అభివృద్ధికి అవిశ్రాంతంగా అహర్నిశలు పాటుపడుతున్న కామేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం నగరంలోని పద్మారావునగర్‌లో సహోదరుడి గృహంలో కాలధర్మం చేయడం చాలా బాధాకరమని వాపోయారు. కామేశ్వరరావు మృతికి యావత్ రసరంజని కార్యదర్శి కె.నటరాజ్ తదితర కార్యవర్గం అశృతప్త నయనాలతో ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. 1948లో కృష్ణాజిల్లాలో జన్మించిన కామేశ్వరరావు వరంగల్‌లో ఎంఎ పట్టాపొందారు. ఆయన వయస్సు 77 సంవత్సరాలు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్నారు. ఆయనకు కుమార్తె, ఇద్దరు కుమార్తెలు ముగ్గురు మనువలు, మనవరాళ్లు అంతా ప్రస్తుతం అమె రికాలో ఉన్నారు. ముట్నూరి కామేశ్వరరావు మృతికి పలువురు ప్రముఖులు, రంగస్థల నటులు, సాంకేతిక వర్గం, సాంస్కృతిక సంస్థల అధిపతులు తీవ్రసంతాపం తెలియజేశారు.



ముట్నూరి కామేశ్వరరావు

# విద్యుత్ వినియోగదారులకు డిప్యూటీ సీఎం భట్టి లేఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:** తెలంగాణలోని సుమారు 83 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేఖలు రాశారు వాటిని విద్యుత్ అధికారులు స్వయంగా వెళ్లి వినియోగదారులకు అందజేస్తున్నారు. భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్ష సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు, డిప్యూటీ సీఎం సందేశంతో కూడిన లేఖలను గృహజ్యోతి లబ్ధిదారులు.. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు అందజేస్తున్నారు. వినియోగదారుడి పేరు, సర్వీస్ కనెక్షన్ నంబర్ వ్యక్తిగతంగా ప్రస్తావిస్తూ రాసిన ఈ లేఖలను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు స్వయంగా వినియోగదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 52,82,498 మంది గృహజ్యోతి లబ్ధిదారులు, 30,03,813 మంది వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఈ లేఖలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

# కివీస్ జట్టుపై భారత్ విజయం




## నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్ ఓటమి

## అంతర్జాతీయ క్రికెట్‌లో 28 వేల పరుగులు చేసిన కోహ్లీ

## ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన రన్‌మెషీన్

**వడోదర, జనవరి 11:** భారత్ న్యూజిలాండ్‌మధ్య జరిగిన వన్డే ఇంటర్నేషనల్‌లో న్యూజిలాండ్‌జట్టుపై భారత్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన కివీస్ జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి 300 పరుగులుచేయగా తదనంతరం బ్యాటింగ్‌చేసిన భారత్ జట్టు ఆరు వికెట్ల నష్టానికి 306 పరుగులుచేసి విజయం కైవసం చేసుకుంది. ఆరు బంతులు మిగిలి ఉండగానే భారత్ గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా విరాట్‌కోహ్లి నిలిచారు. 91 బంతుల్లో 93 పరుగులుచేసి తన బ్యాటింగ్ ను ఝుళిపించాడు. ఆఖరి వరకూ ఉత్కంఠ రేపిన వడోదర వన్డేలో భారత జట్టునే విజయం వరించింది. ఛేదనలో విరాట్ కోహ్లి(93), శుభ్‌మన్ గిల్(56) అర్ధ శతకాలతో అలవోకగా గెలుస్తుందనుకున్న టీమిండియా కైలీ జేమీసన్ (4-41) తన ఆఖరి స్పెల్‌తో మూడు వికెట్లు తీయడంతో కష్టాల్లో పడింది. శ్రేయస్ అయ్యర్(49) ఔటైన ఆయ్యాక. కేఎల్ రాహుల్(29 నాటౌట్) ఒత్తిడిలోనూ ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు. గాయంతో బాధపడుతున్న వాషింగ్టన్ సుందర్(7 నాటౌట్) సాయంతో జట్టును గెలిపించాడు రాహుల్. క్లార్క్ వేసిన 49వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు, సిక్సర్‌తో టీమిండియా థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. దాంతో, మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఫామ్‌లేమితో బాధపడు తున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్(56) ఆచితూచి ఆడగా విరాట్ కోహ్లి(93) ఫోర్ల మీద ఫోర్లు కొడుతూ స్కోర్‌బోర్డును ఉరికించాడు. ఈ క్రమంలోనే అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో 28వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. గిల్‌తో కలిసి విరాట్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును గెలుపు దిశగా నడిపాడు. అర్ధ శతకంత తర్వాత గిల్ ఔటైనా కోహ్లీ మాత్రం క్రీజును వదల్లేదు. శ్రేయాస్ అయ్యర్(49)తో కలిసి కివీస్ బౌలర్లను ఒత్తిడిలో పడేశాడు. సెంచరీకి చేరువైన విరాట్‌ను జేమీసన్ ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అదే ఓవర్లో జడేజాను వెనక్కి పంపిన అతడు తర్వాత ఓవర్లో అయ్యర్‌ను బౌల్డ్ చేయడంతో ఉత్కంఠ మొదలైంది. అప్పటికీ విజయానికి 53 బంతుల్లో 59 రన్స్ కావాలి. రాహుల్ కూల్‌గా చూస్తుండగానే మూడు బిగ్ వికెట్లు పడడంతో స్టేడియంలోని ప్రేక్షకులంతా స్టన్ అయ్యారు. హర్షిత్ రానా(29) జతగా కేఎల్ రాహుల్(29 నాటౌట్) సమయోచితంగా ఆడాడు. రన్‌రేటు పెరిగిపోతుండడంతో హర్షిత్ దూకుడుగా ఆడాడు. రానా ఔటయ్యాక వాషింగ్టన్ సుందర్(7 నాటౌట్) అండగా రాహుల్ జట్టును విజయతీరాలకు చేర్చాడు. క్లార్క్ వేసిన 49వ ఓవర్లో చివరి మూడు బంతుల్లో 4, 4, 6గా మలిచిన అతడు 4 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. మిచెల్, నికోల్స్ మెరవగా టాస్ ఓడిన జట్టుకు కివీస్ ఓపెనర్లు హెన్రీ నికోల్స్(62), డెవాన్ కాన్వే(56)లు అర్ధ శతకాలతో శుభారంభ మిచ్చారు. 21 ఓవర్ల వరకూ వికెట్ పడకపోవడంతో అలవోకగా మూడొందలకు పైగా కొడుతుందనిపించింది. కానీ, హర్షిత్ రానా(2-65) ఈ ఇద్దరిని వెనక్కి పంపి పరుగులకు అడ్డుకట్ట వేశాడు. ప్రసిద్ధ్ కృష్ణ(2-60) పొదుపుగా బౌలింగ్ చేయగా మిడిలార్డర్ తోకముడిచింది. ఒకవైపు వికెట్లు పడుతున్న డారిల్ మిచెల్ (84) ఒంటరి సైనికుడిలా పోరాడాడు. హాఫ్ సెంచరీ తర్వాత గేర్ మార్చిన అతడిని ప్రసిధ్ వెనక్కి పంపడంతో న్యూజిలాండ్ 300లకే పరిమితమైంది.

# సంక్రాంతి పండగ ఎఫెక్ట్..

## విజయవాడ రహదారిపై రెండోరోజూ ట్రాఫిక్‌జాం

## టోల్‌గేట్ల వద్ద బారులుతీరిన వాహనాలు..

## ప్రయాణికుల అవస్థలు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి శోభ రావడంతో పట్నాలలో వుంటున్న ప్రజలు పల్లెబాట పట్టడంతో హైద రాబాద్ విజయవాడ రహదారిపై వరుసగా రెండవ రోజు ఆదివారం కూడా వాహనాల రద్దీ భారీగా కొనసాగింది. తెలంగాణలో వుంటున్న ఎపి వాసు లు తమ పల్లెలకు పయనమవడంతో విజయవాడ రహదారితో పాటు ఎపికి దారితీసే అన్ని మార్గాలు వాహనాలతో క్రిక్కిరిసి పోయాయి. వాహనాల రద్దీ కారణంగా టోల్ గేట్ల వద్ద వాహనాలు బారులు తీరగా అందులోని ప్రయాణీకులు అవస్థలు పడ్డారు. సంక్రాంతి పండగవేళ తెలంగాణలో వుంటున్న ఎపి వాసులు ఈసారి ముందుగానే సొంత ఊళ్లకు పయనమవడంతో హైదరాబాద్ నుంచి విజయ వాడ మార్గంతో పాటు ఇతర మార్గాలు ట్రాఫిక్ రద్దీని సంతరించుకున్నాయి. శనివారం ఉదయం మొదలైన రద్దీ ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయే వరకు కొనసాగింది. ఈ రద్దీ మరో మూడు రోజుల పాటు కొనసాగే వీలుందని పోలీసులు చెబుతున్నారు. ఈసారి ముందుగానే సెలవులు రావడం తో నగరంలో వున్న వారంతా సొంత ఊళ్లకు బస్సులు, రైళ్లు, సొంత వాహనాలలు ప్రయాణమయ్యారు. ఇదే సమయంలో సర్కారీ ఉద్యోగుల్లో అ నేక మంది సెలవులు తీసుకుని మరీ ఊళ్లకు ప్రయాణాలు సాగించడంతో విజయవాడ రహదారిపై ట్రాఫిక్ రద్దీ పెరిగింది. మామూలుగానే విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో క్రిక్కిరిసి పోతుంటుండగా ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులకు తోడుగా కొన్నిచోట్ల మరమ్మత్తు పనులు జరుగు తుండడంతో అదనపు ట్రాఫిక్‌తో మరింత రద్దీగా మారింది. ఈ రద్దీ బుధవారం వరకు కొనసాగే వీలుందని అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి కారణంగా విజయవాడ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు వేల సంఖ్యలో వెళుతూ కనిపించాయి. పండగ సందర్భంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు రెండు రోజుల్లో లక్షా 80 వేల వరకు వాహనాలు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఇందు లో ఒక్క ఆదివారం నాడే లక్ష వాహనాలు వెళ్లినట్లు వారు తెలిపారు. ఇక హైదరాబాద్ నుంచి వరంగల్, బీబీనగర్ టోల్ గేట్ మీదుగా 50 వేల వా హనాల వరకు పయనమైనట్లు వారు తెలిపారు. పండగల సమయంలో ఊళ్లకు వెళ్లిన వారిలో 80 శాతం వ్యక్తిగత వాహనాలలోనే వెళ్లినట్లు పోలీ సులు తెలిపారు. కాగా ఆర్టీసీ బస్సుల్లో టికెట్లు దొరకని వారు ప్రైవేటు బస్సుల్లో, అందులో కూడా దొరకని వారు సొంత వాహనాలు, ప్రైవేటు వా హనాల్లో ప్రయాణాలు చేబట్టారు. విజయవాడ జాతీయ రహదారిపై ఇటీవల కాలంలో ఇంతటి స్థాయిలో ట్రాఫిక్ రద్దీ ఇటీవల కాలంలో ఇదే తొలి సారిగా పోలీసు అధికారులు చెబుతున్నారు. వాహనాల రద్దీ కారణంగా అన్ని టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాహనాల రద్దీని తట్టుకునేం దుకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసినా ట్రాఫిక్ జాంలను ఇవి నిలువరించలేక పోయాయి. కాగా విజయవాడ రహదారిపై ట్రాఫిక్ రద్దీని దృష్టిలో వుంచుకుని ప్రతీ 30 కిలోమీటర్లకు ఒక భారీ క్రేన్‌ను ఒక అంబులెన్స్‌ను పోలీసులు ఏర్పాటు చేశారు. రహదారిపై ఎక్కడైనా వాహనాలు ఆగిపోయి నా, చెడిపోయినా వెంటనే 100 లేదా సమీపపోలీసు స్టేషన్లకు సమాచారం అందించాలని పోలీసులు వాహనదారులను కోరుతున్నారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు ఇప్పటికే డ్రోన్లను వాడుతుండగా ఆయా మార్గాలలో గస్తీ పోలీసుల సంఖ్యను పెంచారు.

# రిపబ్లిక్‌డే రోజున పక్షుల కోసం 1,275 కిలోల చికెన్ ఆర్డర్!

**న్యూఢిల్లీ, జనవరి 11:** రిపబ్లిక్ డే పరేడ్‌ను సురక్షితంగా జరపడం కోసం ఢిల్లీ ప్రభుత్వం 1275 కిలోల బోన్‌లెస్ చికెన్‌ను ఉపయోగించనుంది. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా సైన్యం యుద్ధ విమానాలతో విన్యాసాల్లో ఫైటర్ జెట్లకు పక్షులు అడ్డుగా వచ్చి, వాటిని ఢీకొట్టే ప్రమాదం ఉంది. అసలే ఎర్రకోట పరిసర ప్రాంతాల్లో పక్షులు ఎక్కువగా తిరుగుతాయి. దీంతో పక్షుల వల్ల ప్రమాదాలు జరగకుండా చూడటం కోసం దాదాపు 1,275 కిలోల బోన్‌లెస్ చికెన్‌ను ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరేడ్‌లో విన్యాసాల సందర్భంగా విమానాలకు పక్షులు అడ్డు తగలకుండా చూడటం కోసం వాయుసేన అధికారులు పలు జాగ్రత్తలు తీసుకుంటారు. ముఖ్యంగా గద్దలు వంటి పక్షుల కోసం ఆయా ప్రాంతాల్లో మాంసం ముక్కలను వెదజల్లే కార్యక్రమం చేపడతారు. సాధారణంగా ఇందుకోసం జంతువుల మాంసాన్ని వినియోగిస్తారు. కానీ, ఈసారి మాత్రం బోన్‌లెస్ చికెన్‌ను పక్షులకు ఆహారంగా వేయాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. వన్యప్రాణి సంరక్షణతో పాటు గణతంత్ర వేడుకలు సజావుగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఢిల్లీ నగరంలో పక్షులు ఎక్కువగా తిరిగే ఎర్రకోట, మండీ హౌస్, ఢిల్లీ గేట్, జామా మసీద్ సహా 20 కీలక ప్రాంతాల్లో జనవరి 15 నుంచి 26 తేదీల మధ్య వాటికి చికెన్ వేసే కార్యక్రమం చేపడతారు. వాయుసేన సహకారంతో ఈ చికెన్ ముక్కలను రెండు రోజులకు ఒకసారి గాల్లో కొంత ఎత్తు నుంచి జారవిడవనున్నారు. దీంతో పక్షులు ఆకాశంలో ఎక్కువ ఎత్తుకు ఎగరకుండా ఆ స్థాయిలోనే తిరుగుతుంటాయి. గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు రెండు వారాల ముందు నుంచి ఇలా చేస్తుంటారు.

# మేడారం జంపన్న వాగు వద్ద పాప మిస్సింగ్

## సురక్షితంగా చేరవేసిన మంత్రి సీతక్క

## వనదేవతల వద్ద కిక్కిరిసిన భక్తజనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి**



**11:**ములుగు జిల్లా మేడారంలోని జంపన్న వాగు వద్ద ఆదివారం ఓ చిన్నారితప్పిపోయిన ఘటన కలకలం రేపింది. అయితే వెంటనే స్పందించిన రాష్ట్ర మంత్రి సీతక్క పాపను సురక్షితంగా గుర్తించి పోలీస్ కమాండ్ కంట్రోల్కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, పాప పూర్తిగా సురక్షితంగా ఉందని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పోలీస్ కమాండ్ కంట్రోల్కు వచ్చి తమ పాపను తీసుకెళ్లాలని ఆమె సూచించారు. అయితే, మేడారం జాతర ఏర్పాట్ల సందర్భంగా మంత్రి సీతక్క అక్కడ పర్యటించారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సమయంలో చిన్నారి మిస్సింగ్ ఘటన చోటు చేసుకుంది. మంత్రి సీతక్క స్వయంగా ఆ తప్పిపోయిన చిన్నారిని ఎత్తుకొని పోలీసులకు అప్పగించారు

**మేడారానికి పెద్ద ఎత్తున భక్తులు..**

ఇదిలా ఉండగా సంక్రాంతి సెలవులు కావడంతో మేడారానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో సమ్మక్కసారలమ్మ గద్దెల ప్రాంగణం భక్తుల సందడితో కిటకిటలాడుతోంది. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించేందుకు భక్తులు భారీ సంఖ్యలో చేరుకుంటున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. పిల్లలు తప్పిపోకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. శనివారం నుంచి వరుస సెలవులు రావడంతో భారీగా



తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. రద్దీ కారణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల మీదకు భక్తులను పోలీసులు అనుమతించడం లేదు. ఆదివారం మేడారంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పర్యటించారు. ఆయనతో పాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌లు ఈ పర్యటనలో పాల్గొన్నారు. మేడారం జాతర ఈ నెల జనవరి 28 నుంచి 31 వరకు అంగరంగ వైభవంగా జరగనుంది. దీనికి తెలంగాణతో పాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక రోజు రాత్రి మేడారంలోనే బస చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లండించాయి. మంత్రుల సీతక్క, కొండా సురేఖలు ఇటీవల మాజీ సీఎం కేసీఆర్‌ను జాతరకు రావాలని ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లి ఆహ్వానించిన విషయం విదితమే.

# సినిమా టికెట్ల దందాపై గవర్నర్ విచారణకు ఆదేశించాలి

## మంత్రికి తెలియకుండానే టికెట్ రేట్లపై జిఒలు వస్తున్నాయి

## కోమటిరెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోంది: హరీశ్‌రావు వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:**తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తుంటే జాలేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా, ఉంటే ఎవరి నియంత్రణలో ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన అన్నారు. ఒక శాఖకు మంత్రిగా ఉన్న వ్యక్తికి తెలియకుండానే ఆ శాఖలో కీలక నిర్ణయాలు జరిగిపోవడం, జీవోలు విడుదల కావడం దారుణమని విమర్శించారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు జీవో బయటకు వస్తే, ఆ శాఖ మంత్రి అయిన కోమటిరెడ్డి 'నాకు తెలియదు, నా దగ్గరికి ఫైల్ రాలేదు' అని నిస్సహాయత వ్యక్తం చేయడం ప్రభుత్వంలో పాలన ఏ స్థాయిలో ఉందో చెబుతోందన్నారు. 'శాఖ ఒకరిది, పెత్తనం మరొకరిది అన్నట్లుగా ఉంది. పలు శాఖలకు తానే మంత్రినని చెప్పుకొనే కోమటిరెడ్డి, ఇప్పుడు తన శాఖలో ఏం జరుగుతుందో తనకు సంబంధం లేదనడం విడ్డూరం. టికెట్ల రేట్ల పెంపు సీఎం నిర్ణయమేనని ఆయన చెప్పకనే చెబుతున్నారు. అంటే, సినిమా శాఖకు మంత్రి ఉన్నట్టా లేనట్టా?' అని హరీశ్ రావు ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా తాను సీఎంగా ఉన్నంతకాలం టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారని, మరో సినిమాకు కూడా సిద్ధమవుతున్నారని ఆరోపించారు. సభను, ప్రజలను ఇంత నిస్సిగ్గుగా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సినీ పరిశ్రమపై రాజకీయ కక్ష సాధిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. 'పాలకుడు పాలసీతో ఉండాలి కానీ, పగతో ఉండకూడదు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్షగడతారు. మీ పేరు మరిచినందుకు మరో హీరోను జైలుకు పంపుతారు. ఇప్పుడు మీకు నచ్చిన వారికి రూ.600 టికెట్ రేటుకు అనుమతి ఇస్తారా?' అని ప్రశ్నించారు. 'గత పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఎక్కడా వివక్ష చూపలేదు. అందుకే ఇవాళ తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగింది. ప్రపంచం గర్వించేలా మన సినిమాలు తయారవుతున్నాయి. 50,60 ఏళ్లుగా ఎంతోమంది కష్టపడి నిర్మించుకున్న ఈ పరిశ్రమ వాతావరణాన్ని మీ అహంకారంతో, మీ పిచ్చి చేష్టలతో, మీ పగ ప్రతీకారాలతో, మీ చిల్లర రాజకీయాలతో నాశనం చేస్తున్నారు. ప్రభుత్వమంటే అందరినీ సమానంగా చూడాలి. ఒకరికి చుట్టం, మరొకరికి శత్రుత్వం ఉండకూడదు. సినిమా వాళ్లను కూడా మీ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు. మొన్న ఎన్నికల్లో ఓడిపోయి.. నేడు రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి సినిమా టికెట్ల రేట్లను శాసిస్తున్న ఆ కనిపించని శక్తి ఎవరో? ఒక్కో సినిమాకు కమీషన్ల రూపంలో ఎన్ని కోట్లు వసూలు చేస్తున్నారో?.. ఆ వివ రాలన్నీ త్వరలోనే బయటపెడతాం' అని అన్నారు. సినిమా టికెట్ల రేట్ల కమీషన్ల దందాపై గవర్నర్ తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# జీ రామ్ జీ పథకానికి రాష్ట్రాలు నిధులిస్తే తప్పేంటి?

## కిసాన్ మోర్చా వర్క్‌షాప్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 11:** వికసిత భారత్ తమ లక్ష్యమని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వీబీజీ రామేజ్ చట్టంపై ఆదివారం నిర్వహించిన వర్క్ షాప్‌లో పాల్గొని మాట్లాడారు. వీబీజీ రామ్ అనేది తమ స్వప్నమని చెప్పారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిం చేందుకు ప్రధాని మోదీ అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు.. వాటిలో భాగంగానే వీబీజీ రామ్ పథకాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. అవినీతిని అరికట్టేందుకు పారదర్శకత తీసుకొచ్చేందుకే ఈ కొత్త చట్టం. కానీ, అవినీతి చేసేందుకే కాంగ్రెస్ ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. బిజెపి తీసుకొచ్చే ప్రతి పథకాన్ని వ్యతిరేకించడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పుడే బాధ్యత పెరుగుతుందన్నారు. వీబీజీ రామ్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తే తప్పేంటి? అని ప్రశ్నించారు. మోదీకి మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే ఈ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందన్నారు. గ్రామ గ్రామాన తిరిగి కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు రామచంద్రరావు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ పేరుపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న మక్కువపై ఆయన ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ లేదా ఇందిరా గాంధీ పేర్లకు బదులుగా హైదరాబాద్ విమానాశ్రయానికి మహాత్మా గాంధీ పేరు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. భారతదేశంలో ఉపాధి పథకాలు ఎంజినరేగా కంటే ముందే అమలులో ఉన్నాయని గుర్తు చేశారు. 1989లో జవహర్ రోజ్ గార్ యోజన నుంచి ప్రారంభమైన ఉపాధి పథకాలు అనేక మార్పులు చెంది, 2005లో ఎన్ఆర్ఈజీపీగా మారాయని, ఆ సమయంలో మహాత్మా గాంధీ పేరు పెట్టాలనే ఆలోచన కాంగ్రెస్‌కు ఎప్పుడూ రాలేదని విమర్శించారు. 2021 మార్చి 16న బ్రౌన్ యూనివర్సిటీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, కాంగ్రెస్ మోడల్ రన్ అవుట్ ఆఫ్ స్టీమ్ అయిపోయిందని, 1990ల విజన్‌ను 2004లో ప్యాకేజింగ్ చేయడం ఇక పనిచేయడం లేదని స్వయంగా అంగీకరించారని గుర్తుచేశారు. ఎంజిఎన్ఆర్ఈజిప కింద కేంద్ర ప్రభుత్వం దాదాపు 100 శాతం అన్‌స్కిల్డ్ వేతనాలను భరించడం వల్ల, రాష్ట్రాలు ఆర్థిక బాధ్యత లేకుండా వ్యవహరించాయని, వేతనాల కృత్రిమ పెంపు, భారీ లీకేజీలు చోటుచేసుకున్నాయని అన్నారు. దానికి భిన్నంగా విబి-జీ రామ్ జీ చట్టం 60:40 నిధుల భాగస్వామ్య మోడల్‌ను ప్రవేశపెడుతుందని, దీని ద్వారా రాష్ట్రాల బాధ్యత, ఆర్థిక క్రమశిక్షణ, జవాబుదారీతనం పెరుగుతాయని తెలి పారు. యుపిఏ పాలన కాలంలో ఎంజి నరేగా కింద జరిగిన కుంభకోణాలపై డాక్యుమెంటెడ్ ఉదాహరణలను కూడా ఆయన ప్రస్తావించారు. ఉత్తరప్రదేశ్‌లో (2011) నకిలీ జాబ్ కార్డులు, కల్పిత పనులు, లేనిపోని వ్యక్తులకు చెల్లింపుల ద్వారా రూ.10,000 కోట్లకు పైగా దుర్వినియోగం జరిగిందని చెప్పారు. అలాగే ఒడిశా సంబల్పూర్ జిల్లాలో (2012) మరణించినవారికి, పని చేయలేని వారికి, పెన్షనర్లకు వేతనాలు చూపించడం, నకిలీ పని దినాలు, డూప్లికేట్ బిల్లులు వంటి అవకతవకలు జరిగాయని వివరించారు. విబి-జీ రామ్ జీ చట్టం ముఖ్య ఉద్దేశాలు ఏమిటంటే.. ఉపాధి హామీ రోజులను 100 నుంచి 125 రోజులకు పెంపు, కనీసం 50 శాతం పనులు గ్రామ పంచాయతీల ద్వారా అమలు, గ్రామసభలు, గ్రామ పంచాయతీలు గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం, నీటి సంరక్షణ, మౌలిక సదుపాయాల నిర్మాణం, జీవనోపాధి ఆధారిత పనులు, విపత్తు నిర్వహణపై ప్రధానంగా దృష్టి పెట్టడం అని తెలిపారు. అలాగే తప్పనిసరి బయోమెట్రిక్ ధృవీకరణ, జిపిఎస్ శాటిలైట్ మానిటరింగ్, ఎఐ ఆధారిత మోసాల గుర్తింపు, వారానికొకసారి ప్రజా ప్రకటనలు వంటి చర్యలతో లీకేజీలకు పూర్తిగా చెక్ పెడతామని స్పష్టం చేశారు.

# భారత్ సైన్యం దెబ్బకు రాజ్యాంగాన్నే మార్చుకున్న పాక్!

## సిడిఎస్ జనరల్ అనిల్‌చౌహాన్

**పుణె, జనవరి 11:** భారత సైన్యం పరాక్రమం ధాటికి పాకిస్థాన్ తన రక్షణ వ్యవస్థనే మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పుణెలో జరిగిన పబ్లిక్ పాలసీ ఫెస్టివల్లో ఆయన మాట్లాడుతూ భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సృష్టించిన ప్రభావంతో పాకిస్థాన్ హడావిడిగా తన రాజ్యాంగానికి సవరణలు చేసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇది భారత్ సాధించిన వ్యూహాత్మక విజయానికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.



ఆపరేషన్ సిందూర్ సమయంలో తమ రక్షణ వ్యవస్థలోని లోపాలను గుర్తించిన పాకిస్థాన్ తమ రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ని సవరించిందని సీడీఎస్ అనిల్ చౌహాన్ తెలిపారు. తమ దేశంలోని హయ్యర్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ లో భారీ మార్పులు చేసిందన్నారు. ఈ ఆపరేషన్‌లో తాము దెబ్బతిన్నామనే నిజాన్ని పాకిస్థాన్ పరోక్షంగా ఈ రాజ్యాంగ సవరణల ద్వారా అంగీకరించిందని జనరల్ అనిల్ చౌహాన్ ఎద్దేవా చేశారు. గతంలో ఉన్న చైర్మన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ పదవిని పాకిస్థాన్ రద్దు చేసి ఆ స్థానంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ అనే కొత్త పోస్టును సృష్టించినట్లు సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. అయితే ఈ సీడీఎఫ్ పదవిని ఆర్మీ చీఫ్ మాత్రమే సృష్టించగలరని నిబంధన పెట్టడం ద్వారా ఉమ్మడి రక్షణ వ్యవస్థ అనే ప్రాథమిక సూత్రానికే పాక్ తూట్లు పొడిచిందని ఆయన విమర్శించారు. ఇది మాత్రమే కాకుండా కొత్తగా నేషనల్ స్ట్రాటజీ కమాండ్, ఆర్మీ రాకెట్ ఫోర్సెస్ కమాండ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ఆ దేశం కేవలం సైన్యం చేతిలోనే అధికారాన్ని కేంద్రీకరిస్తోందని ఇది వారి లాండ్ సెంట్రిక్ ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

మరోవైపు భారత సైన్యంలో తీసుకు రావాలని భావిస్తున్న జాయింట్ థియేటర్ కమాండ్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని జనరల్ చౌహాన్ తెలిపారు. 2026 మే 30వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించినప్పటికీ అంతకు ముందే పూర్తిస్థాయి నిర్మాణం సిద్ధం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఉరి సర్జికల్ స్ట్రైక్స్, డోక్లాం, గల్వాన్ ఉదంతాలు, బాలకోట్ వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ నుంచి నేర్చుకున్న పాఠాలతో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేలా ఒక స్థిరమైన రక్షణ వ్యవస్థను భారత్ నిర్మిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# కొత్త బడ్జెట్‌పై సర్కార్ ఫోకస్

## సంక్రాంతి తర్వాత శాఖల వారీ చర్చ

## నిధుల అవసరాలపై హెచ్‌ఒడిల కసరత్తు

## కేంద్ర నిధులపై సర్కార్ భారీ అంచనాలు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** రాష్ట్ర సర్కార్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి వార్షిక అంచనా బడ్జెట్ సెషన్‌పై ఫోకస్ పెట్టింది. సంక్రాంతి పండుగ పూర్తి కాగానే అన్ని శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మిగిలిన శాఖల మంత్రులు, అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా శాఖల తరఫున బడ్జెట్‌లో ఏ మేరకు కేటాయింపులు ఉండాలనే అభిప్రాయాలను, ప్రతిపాదనలను తీసుకోనున్నారు. ఏయే స్కీమ్ కింద ఎంత నిధుల కేటాయింపు చేయాలనేది ఖరారు చేయడానికి ముందు అన్ని శాఖల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోవడం ఒక ఆనవాయితీగా కొనసాగుతున్నది. ఈసారి పరిశ్రమల శాఖ తరఫున సుమారు రూ.90 వేల కోట్ల మేర ప్రతిపాదనలు ప్రాథమికంగా తయారయ్యాయి. ఇలాంటి కసరత్తే అన్ని శాఖల్లోనూ జరుగుతున్నది. ఈ సన్నాహక సమావేశానికి ప్రస్తుత స్కీమ్‌లకు ఏ మేరకు అవసరమో, కొత్తగా ఏయే అవసరాలకు ఎంత కావాల్సి ఉంటుందో ఆయా శాఖల హెచ్‌ఒడీలు లెక్కలు రెడీ చేసుకుంటున్నారు. సంక్రాంతి తర్వాత ప్రారంభం కానున్న సన్నాహక సమావేశాల నాటికి ఈ లెక్కలు, ప్రతిపాదనలు ఫైనల్ అవుతాయి. కొత్త బడ్జెట్ సందర్భంగా డిప్యూటీ సీఎం విక్రమార్క షెడ్యూలు ప్రకటించి ఆయా శాఖల మంత్రులు, అధికారులతో రోజుకు రెండు చొప్పున పది రోజుల మీటింగులు నిర్వహించనున్నారు. మొత్తం 23 శాఖల నుంచి ప్రతిపాదనలు వస్తుండడంతో రోజువారీ షెడ్యూలుతో పాటు, సన్నాహక సమావేశాలకూ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ అన్ని శాఖలకు ఇప్పటికే సర్క్యులర్ జారీ అయ్యాయి. మరోపక్క కేంద్రం నుంచి వచ్చే కేటాయింపులపై రాష్ట్ర సర్కార్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వివిధ ప్రాజెక్టుల నిమిత్తం అవసరమైన 40 వేల కోట్ల రూపాయల మేర నిధుల కేటాయించాలని సర్కార్ కేంద్రానికి ప్రతిపాదించింది. ఈ సారి భారీగా రాష్ట్రానికి నిధులు కేటాయింపులు జరుగుతాయని తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున అంచనాలు వేసుకుంది. అయితే పతి ఏటా కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు వస్తాయని ఆశ పడడం, ఆ తర్వాత నిరుత్సాహపడడం ఒక ఆనవాయితీగానే కొనసాగుతున్నది. తెలంగాణ ప్రభుత్వం రూపొందించుకున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేంద్రం సహకార సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా నిధులు కేటాయించాలని రాతపూర్వకంగా అంశాలవారీగా కేంద్రానికి విజ్ఞప్తులు చేస్తుంది. ఇందులో భాగంగానే ఈ నెల 10న ఢిల్లీలో జరిగిన అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం విక్రమార్క హాజరై రాష్ట్ర అవసరాలు, అందుకు కావాల్సిన నిధులకు సంబంధించి ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు సమర్పించారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత తెలంగాణకు ఏ మేరకు నిధులు వచ్చిందీ స్పష్టత వస్తుంది. దానికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్రం నుంచి వచ్చే అంశాన్ని ప్రస్తావించి ఫైనాన్స్ డిపార్టుమెంటు నిర్దిష్ట కేటాయింపులను ఫైనల్ చేస్తుంది.




జపనీస్ మార్షల్ ఆర్ట్స్ దుస్తుల్లో పవన్ కళ్యాణ్

# మార్షల్ ఆర్ట్స్‌లో మేటి పవన్ కల్యాణ్

## పురాతన జపనీస్ కత్తిసాము 'కెంజుట్సు'లో అధికారిక ప్రవేశం పొందిన డిప్యూటీ సిఎం

**విజయవాడ,జనవరి 11,ప్రభాతవార్త:** మార్షల్ ఆర్ట్స్ లోనూ ప్రావీణ్యులైన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఓ అరుదైన ఘనతను ఖాతాలో వేసుకున్నారు. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ అయిన కెంజుట్సులో అధికారికంగా ప్రవేశం పొందడం ద్వారా ఒక గొప్ప అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన క్రమశిక్షణతో సాగించిన సాధన, పరిశోధన, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. సినిమాలు, రాజకీయాల్లోకి ప్రవేశించకముందే పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్ ప్రయాణం ప్రారంభమైంది. కరాటే మరియు సంబంధిత యుద్ధకళల పట్ల అమితమైన ఆసక్తి కలిగిన పవన్ కళ్యాణ్, చెన్నైలో ఉన్న సమయంలో కఠినమైన శిక్షణతో పాటు నిరంతర సాధన చేసి, సాంకేతికంగా మరియు తాత్వికంగా బలమైన పునాది ఏర్పరుచుకున్నారు. కాలక్రమేణా, శారీరక సాధనకే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి, అత్యంత నిబద్ధతతో వాటిని అనుసరించారు. మార్షల్ ఆర్ట్స్ పై ఆయన అవగాహన సినిమాల రూపంలోనూ ప్రతిబింబించింది. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, తమ్ముడు, ఖుషి, అన్నవరం, ఓజీ వంటి చిత్రాల ద్వారా ఈ మార్షల్ కళలను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తృత గుర్తింపు మరియు ప్రజాదరణ తీసుకొచ్చారు. మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆయన చూపిన నిరంతర, దీర్ఘకాలిక అంకితభావాన్ని గుర్తించిన అంతర్జాతీయ సంస్థలు, పవన్ కళ్యాణ్‌కు పలు ప్రతిష్ఠాత్మక గౌరవాలు అందించాయి. జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటైన ఖిసోగో బుడో కన్‌రి కైఖి నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదవ డాన్) పురస్కారం లభించింది. అలాగే, జపాన్ వెలుపల ఖిసోకే మురమత్సు సెన్సై ఖిలోని ఖిటకెడా షింగెన్ క్లాన్‌ఖిలో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. ఇది జపాన్ వెలుపల చాలా అరుదుగా లభించే గౌరవం. అంతేకాకుండా, గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ద్వారా ఆయనకు"టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్" అనే విశిష్ట బిరుదుతో సత్కారం కూడా జరిగింది. అధునాతన శిక్షణలో భాగంగా, భారతదేశంలో జపాన్ యుద్ధకళలలో అగ్రగణ్యులలో ఒకరైన ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మూదీ వద్ద పవన్ కళ్యాణ్ శిక్షణ పొందారు. ఆయన మార్గదర్శకత్వంలో పవన్ కళ్యాణ్ ఖికెండోఖిలో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం మరియు లోతైన తాత్విక అవగాహనను సంపాదించారు. ఈ మైలురాయి ద్వారా సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రం.. ఈ మూడింటినీ అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్దిమంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

## డిప్యూటీ సిఎం పవన్‌కు మంత్రి లోకేశ్ అభినందనలు

**విజయవాడ.జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేష్ అభినందించారు. లోకేశ్ పవన్ కల్యాణ్ నేటి తరానికి ఆదర్శమని కొనియాడిన మంత్రి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అరుదైన ఘనత సాధించడంపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. పురాతన జపనీస్ కత్తిసాము కళ ఖికెంజుట్సు ఖిలో పవన్ అధికారికంగా ప్రవేశం పొందారని, ఈ సందర్భంగా ఆయనకు మనఃపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు లోకేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. "పురాతన జపనీస్ కత్తిసాము కళ కెంజుట్సులో అధికారికంగా ప్రవేశం పొందిన పవనన్న జిజ్ఞాస అద్భుతం. తెలుగు వారి అభిమాన కథానాయకుడై సినీ రంగంలో బహుముఖ ప్రతిభతో పవర్ స్టార్ గా ఎదిగారు. రాజకీయాల్లో ప్రజాభిమానం సంపాదించారు. సినిమాల్లో ప్రవేశించక ముందే మార్షల్ ఆర్ట్స్ లో నిష్ణాతులయ్యారు.

ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం, ఎంత విజ్ఞానం సంపాదించినా ఇంకా కొత్త అంశాలు నేర్చుకోవాలనే పవనన్న తపన నేటి తరానికి స్ఫూర్తి" అని కొనియాడారు.

## యుద్ధ కళల్లో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు అరుదైన అంతర్జాతీయ గుర్తింపు దక్కడంపై మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు

**విజయవాడ,జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ కు మార్షల్ ఆర్ట్స్ (యుద్ధ కళలు) రంగంలో అత్యంత అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన చూపిన క్రమశిక్షణ, సాధన, పరిశోధన, అంకితభావానికి నిదర్శనంగా జపాన్ కు చెందిన గోల్డెన్ డ్రాగెన్ సంస్థ ద్వారా టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ బిరుదు దక్కడం పట్ల ప్రత్యేక అభినందనలు తెలిపారు. సినిమాలు, రాజకీయాల్లోకి ప్రవేశించకముందే పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక మక్కువ పెంచుకున్నారని, చెన్నైలో కరాటే, వివిధ యుద్ధ కళలపై ఆయన చేసిన కఠోర సాధన నేడు ఈ అరుదైన ఘనతకు పునాది వేసిందని వివరించారు. పురాతన జపనీస్ కత్తిసాము కళ అయిన ఖికెంజుట్సు ఖిలో జనసేనాని పవన్ కళ్యాణ్ అధికారికంగా ప్రవేశం పొందడం విశేషమని, తమ్ముడు, ఖుషి, అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, అన్నవరం, ఇటీవల విడుదలైన ఓజీ చిత్రాల్లో ఈ తరహా కళలను ప్రదర్శించారని గుర్తుచేశారు. ప్రపంచస్థాయిలో అత్యంత క్లిష్టమైనదిగా భావించే ఈ విద్యలో ఆయన సాధించిన ప్రగతి గర్వకారణమన్నారు. మూడు దశాబ్దాల పాటు ఒక విద్య పట్ల నిలకడగా, అంకితభావంతో సాధన చేయడం ఆయనలోని పట్టుదలకు, క్రమశిక్షణకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ కొనియాడారు. రాజకీయాల్లోనూ, సినిమాల్లోనూ బిజీగా ఉంటూనే తనకిష్టమైన యుద్ధ కళల్లో నిరంతరం సాధన చేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పవన్ కళ్యాణ్ గారి వ్యక్తిత్వానికి నిదర్శనమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పవన్ కల్యాణ్ సనాతన ధర్మం,ఆయన రాజకీయంలో భాగం :సిపిఐ నారాయణ



**విజయవాడ,జనవరి 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల కాలంలో సనాతన ధర్మాన్ని ప్రచారం చేయడంపై సీపీఐ అగ్రనేత కె. నారాయణ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పవన్ కళ్యాణ్‌కు వ్యక్తిగతంగా సనాతన ధర్మంపై ఎలాంటి నమ్మకం లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయన ఈ నినాదాన్ని భుజానికెత్తుకున్నారని సంచలన ఆరోపణలు చేశారు. కేంద్రంలోని బీజేపీ పెద్దలైన ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాల ప్రశంసలు పొందడానికే పవన్ తన వేషభాషలను మార్చుకుని సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని నారాయణ విశ్లేషించారు. పవన్ వ్యక్తిగత జీవితాన్ని ప్రస్తావిస్తూ నారాయణ మరింత ఘాటుగా వ్యాఖ్యానించారు. సనాతన ధర్మంలో విడాకులకు స్థానం లేదని చెబుతూ, మూడుసార్లు వివాహం చేసుకున్న పవన్ కళ్యాణ్ ఆ ధర్మం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పవన్ జీవన విధానం సనాతన ధర్మ సూత్రాలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని, అలాంటి వ్యక్తి దాని గురించి ప్రచారం చేసే నైతిక అర్హతను కోల్పోయారని అన్నారు. ఆయన విధానాలు, వ్యక్తిగత జీవితం ఆ ధర్మానికి వ్యతిరేకంగా ఉన్నాయని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ ఒకప్పుడు తనది కమ్యూనిస్టు భావజాలమని చెప్పేవారని, తనతో తరచూ సమావేశమై రాజకీయ అంశాలు చర్చించేవారని నారాయణ తెలిపారు. కమ్యూనిస్టులతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. రాజకీయాల్లో అవకాశాలను బట్టి సిద్ధాంతాలు మార్చే వ్యక్తిగా పవన్‌ను అభివర్ణించారు. ఒకప్పుడు ప్రగతిశీల భావాలు పలికిన వ్యక్తి, ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండి తిరోగమన భావజాలమైన సనాతన ధర్మాన్ని ప్రోత్సహించడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ తన వైఖరిని మార్చుకోకపోతే, అభ్యుదయవాదులైన ప్రజలు ఆయనకు తగిన సమయంలో కచ్చితంగా బుద్ధి చెబుతారని నారాయణ హెచ్చరించారు. తన రాజకీయ వ్యూహంలో భాగంగానే పవన్ కమ్యూనిస్టులకు దూరమై, ఇప్పుడు బీజేపీ అజెండాను అమలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తీసుకొచ్చిన మార్పులు, జాతీయ స్థాయిలో గుర్తింపు : మంత్రి అనగాని

**విజయవాడ,జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ పాలనా సంస్కరణలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తీసుకొచ్చిన మార్పులు, జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకొచ్చాయని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అవలంబిస్తున్న విధానంపై ఉత్తరాఖండ్ ఎన్నికల ప్రధానాధికారి బివిఆర్‌సి పురుషోత్తం ప్రశంసలు అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ జిల్లా ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తన కుటుంబ ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఆయన ఇక్కడి పనితీరును చూసి ఆశ్చర్యపోయారు. కేవలం 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యిందని, ఎక్కడా జాప్యం లేకుండా పనులు జరగడం గర్వకారణమని ఆయన తెలిపారన్నారు. స్లాట్ బుకింగ్ విధానంతో ప్రజల సమయం ఆదా కావడమే కాకుండా , వ్యవస్థలో పారదర్శకత పెరిగిందని, ఇది ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని సిఇఓ తెలిపారు.

## నేడు గద్దెకు రానున్న పోలమాంబ



**మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా), జనవరి 11 ప్రభాతవార్త:** శంబర గ్రామంలో ఉన్న ప్రముఖ ఇలవేల్పు, ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత రాష్ట్ర ప్రభుత్వ జాతరగా గుర్తింపు పొందిన పోలమాంబ అమ్మవారి 2026 సంవత్సరం జాతర మహోత్సవంలో భాగంగా పోలమాంబ అమ్మవారిని నేడు సాయంత్రం 7 గంటలకు గ్రామంలోనికి కొని తెచ్చుట కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగును. ముందుగా చదురుగుడి పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఘటాలకు పూజ జరిపించుకొని గోముఖి నది ఒడ్డున ఉన్న చిన్నమ్మ వారి గద్దె వద్దకు ఆలయ చైర్మన్, కార్య నిర్వహణ అధికారి, గ్రామ ప్రజలు, సేవకులు,భక్తులు,అందరూ గద్దె వద్దకు చేరుకొని, పోలమాంబ అమ్మవారికి పసుపు కుంకుమలు నైవేద్యములు సమర్పించి ప్రత్యేక పూజలు,మొక్కులు చేసిన తరువాత అమ్మవారిని గ్రామములోనికి కొనితెచ్చుట కార్యక్రమం వేదమంత్రాలతో అత్యంత వైభవోపేతంగా అమ్మవారిని గ్రామంలోనికి కొనితెచ్చుట కార్యక్రమం జరుగుతుందన్నారు.

## తొలితరం స్వాతంత్య్ర సమరయోధుడు 'వడ్డే ఓబన్న' జయంతి వేడుకలు

### ఘన నివాళులర్పించిన వడ్డెర సంఘం నాయకులు



**విజయవాడ జనవరి 11 ప్రభాత వార్తప్రతినిధి:ఎన్టీఆర్ జిల్లా** కంచికచర్ల మండల కేంద్రంలోని కంచికచర్ల ఇందిరా కాలనీ లోని స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి ఘనంగా నిర్వహించారు. వద్ద వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలోఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘ నాయకులు మాట్లాడుతూ... భారత తొలి స్వాతంత్య్ర సంగ్రామానికి పదేళ్ల ముందే బ్రిటిష్ పాలకుల అరాచకాలపై తిరుగుబాటు చేసి, పోరాడిన యోధుడు, వీరుడు, రేనాటి సూర్యుడు వడ్డే ఓబన్న. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి అధ్యక్షుడి గా ఉన్న వడ్డే ఓబన్న చేసే యుద్ధ వీరత్వానికి బ్రిటిష్ పాలకులు భయ భ్రాంతులకు గురయ్యారు. 1807జనవరి 11 న జన్మించిన ఓబన్న చిన్న వయసు నుండే యుద్ధ విద్యలు నేర్చుకుని గొప్ప యోధుడిగా ఎదిగారు. ఓబన్న నేతృత్వంలోని సైన్యంతో 1846 జూలై 10 న కోవెలకుంట్ల సబ్ ట్రెజరీపై దాడి చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ఓబన్న లు ఆ తర్వాత మూడు నెలల పాటు, బ్రిటిష్ పాలకులతో వీరోచిత పోరాటం చేశారు. అందులో ఓబన్న పాత్ర గణనీయం. ఆ పోరాటంలో నల్లమల అడవిని స్థావరంగా చేసుకున్న నరసింహారెడ్డి, ఓబన్న నాయకత్వంలో దాడులకు వ్యూహారచన చేసేవారు. చివరకు సంజామల మండలం, గిద్దలూరు గ్రామ సమీపం లోని జగన్నాథ కొండ వద్ద బ్రిటిష్ పాలకులతో జరిగిన చివరి యుద్ధంలో వీరోచితంగా పోరాడిన వడ్డే ఓబన్న 1846 అక్టోబర్ 6 న వీర మరణం పొందారు. వడ్డే ఓబన్న మొదటి తరం స్వాతంత్య్ర సమర యోధుడిగా ఆయన చేసిన సేవలను గుర్తించి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు జనవరి 11 వడ్డే ఓబన్న జయంతి అధికారికంగా నిర్వహిస్తున్నందుకు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు వడ్డెర సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒంటిపులి ప్రసాద్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఓర్సు నరసింహారావు, మాజీ వార్డు సభ్యులు వల్లెపు శ్రీనివాసరావు, వడ్డెరకుల సంఘ నాయకులు వేముల గురవయ్య, చింతల చంద్రకళ, ఉప్పతల అప్పారావు, ఓర్సు రాజేష్, నాగ రాములు, ఒంటిపులి బాబు, ఓర్స్ వెంకటనారాయణ, వెంకటేశ్వరావు, పల్లపు వేణుగోపాల్, దండగల నాగరాజు, జెరిపిటి గోపి, రాము, దీనకుమారి, శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

**తిరుపతి,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 8712652679 చిత్తూరు: 7993147979నెల్లూరు: 08612320 427అన్నమయ్య: 9440817449కడప: 08562 242457కర్నూలు: 7382614308 నంద్యాల: 7382618976 అనంతపురం: 9154790350 శ్రీసత్యసాయి: 9963707847 సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బందీగా ఉన్న మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సాయం



**భోగాపురం (విజయనగరం జిల్లా), జనవరి 11 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా భోగాపురం మండలం కొండ్రాజుపాలెం గ్రామంలో చేపలవేట కోసం సముద్రంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు సరిహద్దులు దాటడంతో బంగ్లాదేశ్ ప్రభుత్వానికి చిక్కుకున్న భోగాపురం మండలం మరియు పూసపాటిరేగ మండలానికి చెందిన 9 మంది మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున చెక్కులను మరియు నిత్యావసర సరుకులను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మరియు ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేట నిమిత్తం సముద్రంలోకి వెళ్లి అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దులు దాటి బంగ్లాదేశ్ ప్రభుత్వానికి చిక్కుకున్న మత్స్యకారుల పరిస్థితి తమను ఎంతో కలచి వేసిందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మత్స్యకారుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయంగా ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులను అందజేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా వారి కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. మత్స్యకారులు సురక్షితంగా స్వదేశానికి చేరుకునే వరకు ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతుందని, ఈ విషయంలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టంగా పేర్కొన్నారు.

## బంగాళాఖాతంలో బలహీనపడిన వాయుగుండం

### ఎపిలో రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు

**విజయవాడ,జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో శ్రీలంక సమీపంలోని వాయుగుండం బలహీనపడింది. సాయంత్రం శ్రీలంకకు ఈశాన్యంగా ముల్లయిట్టివుకు సమీపంలో తీరం దాటినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. ముల్లయిట్టివుకు 30 కిలోమీటర్లు, జాఫ్నా (శ్రీలంక)కు 70 కి.మీ, మన్నార్ (శ్రీలంక)కు 90 కి.మీ, కరైకల్ (పుదుచ్చేరి)కి 190 కి.మీ, చెన్నైకు 400 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ దిశగా కదులుతూ ఆదివారం ఉదయంలోగా తీవ్ర అల్పపీడనంగా బలహీనపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఆదివారం తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. దక్షి ణ కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం(నేడు) తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదిలా ఉండగా మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. తొలుత ఇది తుపానుగా బలపడుతుందని ఐఎండీ తొలుత అంచనా వేసినా పరిస్థితులు అనుకూలించకపోవడంతో బలపడలేదని వాతావరణ నిపుణులు చెప్పారు. తీవ్ర వాయుగుండం ప్రస్తుతం వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంకలో ట్రింకోమలి, జాఫ్నా మధ్యలో శనివారం మధ్యాహ్నానికి తీరం దాటుతుందని ఐఎండీ అంచనా వేసింది. శని, ఆదివారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు.

# తిరుమల సమాచారం

## 25న గోవిందరాజస్వామి ఆలయంలో సాలకట్ల రథసప్తమి



**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిథి వేళ 25వతేదీ ఆదివారం తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో సూర్యజయంతి(రథసప్తమి) పర్వదినాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారు ఉభయదేవేరులతో కలసి ఏడువాహనాలపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. తెల్లవారుజామున 3గంటల నుండి 5గంటల వరకు చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా కపిలేశ్వరస్వామి ఆలయంలోని ఆళ్వారు తీర్థానికి వేంచేపు చేసి చక్రస్నానం నిర్వహిస్తారు. ఆ తరువాత అదేరోజు ఉదయం 5.30గంటల నుండి సూర్యప్రభవాహనంతో మొదలై ఉదయం 9.30గంటలకు హనుమంతవాహనం, ఉదయం 11,30గంటలకు పెద్దశేషవాహనం, మధ్యాహ్నం 1.30గంటలకు ముత్యపుపందిరి వాహనం, సాయంత్రం 3.30గంటలకు సర్వభూపాల వాహనంపై అమ్మవార్లతో కలసి గోవిందరాజస్వామి ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. రాత్రి 8గంటలకు గరుడవాహనసేవ నిర్వహిస్తారు. ఒకేరోజు ఏడువాహనాలపై గోవిందరాజస్వామి తిరుపతి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. తిరుపతిలో రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, జెఇఒ వీరబ్రహ్మాం, విజిలెన్స్,పోలీసు విభాగాల అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## దేవుని ఆశీస్సులతో అంతా శుభాలు జరగాలి

### - శ్రీవారిసేవకు తరలివచ్చిన ప్రముఖులు



**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మనసు అనుభూతి కలుగుతుందని, ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. ఆదివారం తిరుమలకు పలువురు ప్రముఖులు తరలివచ్చారు. ఉదయం వేళ విఐపిల తాకిడితో శ్రీవారి ఆలయం రద్దీగా మారింది. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సిబిఐ డిజి వీరేశ్‌ప్రభు, సిఆర్‌పిఎఫ్ డిజి జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, నటుడు బాబీసింహా,కొరియోగ్రాఫర్ బాబామాస్టర్, ఛత్తీస్‌ఘడ్‌రాష్ట్ర మంత్రి కేదార్‌నాథ్‌కశ్యప్, సినీనటి అరుణ కుటుంబం, మాజీమంత్రి కొడాలి నాని ఉదయం వేర్వేరుగా ఆలయం మహద్వారం వద్దకు చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నడకమార్గాల్లో భద్రతే ధ్యేయం!

### - అలిపిరి నడకదారిలో భక్తులపై ఆంక్షలు - చిరుతల సంచారంతో టిటిడి అప్రమత్తత

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలవాడ గోవిందా...గోవింద అంటూ నిత్యం కాలినడకన రెండు మార్గాల్లో తిరుమలకొండకు వస్తున్న భక్తుల భద్రతే ధ్యేయంగా టిటిడి అధికారులు చర్యలు తీసుకున్నారు. అవసరమైన ప్రణాళికలు సిద్ధంచేసి, భక్తులను గుంపుగా పంపుతున్నారు. అలిపిరి నడకమార్గంతోబాటు శ్రీవారిమెట్టు మార్గంలో తరచూ చిరుతపులి సంచరించడం, సిసిటివికెమెరాల్లో గుర్తించడంతో భక్తులను అప్రమత్తం చేస్తూ పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తున్నారు. వేసవికి ముందే చిరుతపులులు నడకమార్గంలో, ఘాట్‌రోడ్లలో సంచరిస్తుండటంతో టిటిడి అధికారులు అటవీ,విజిలెన్స్ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇక ఉదయం 6గంటల నుండి రాత్రి 9గంటల వరకు మాత్రమే ద్విచక్రవాహనదారులను అనుమతిస్తున్నారు. మెట్ల మార్గాల్లో 70మంది వరకు భక్తులను విజిలెన్స్ సిబ్బంది గుంపుగా పంపుతున్నారు. ఇలా చేయడం వల్ల చిరుతలు దారితప్పి వచ్చినా భయంతో జనానికి దగ్గరరావని చెబుతున్నారు. రాత్రి 9.30గంటలకు అలిపిరి కాలినడక మార్గాన్ని మూసివేస్తున్నారు. గత మూడేళ్ళుగా వరుసగా జరిగిన చిరుతల దాడులు, చిన్నారులను హతమార్చడం వంటి ఘటనలు దృష్టిలో ఉంచుకుని టిటిడి ఇప్పుడు మరింత జాగరూకతతో వ్యవహరిస్తోంది. పూర్తిగా అటవీప్రాంతానికి ఆనుకునే ఉన్న అలిపిరి కాలినడక మార్గంలో గాలిగోపురం నుండి 7వ మైలువరకు, మొదటిఘాట్‌రోడ్డు కలిసే లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఇప్పటికే విజిలెన్స్, అటవీశాఖ సిబ్బంది అలర్ట్‌గా ఉంటున్నారు. కాలినడక మార్గంలో,ఆనుకుని ఉన్న అటవీప్రాంతంలో సిసికెమెరాలు నిఘా ఉన్నాయి. శ్రీవారిమెట్టుదారిని కూడా సాయంత్రం 5గంటలకే భక్తులను అనుమతిస్తున్నారు. అలిపిరి నుండి తిరుమలకు కాలినడకన 25వేలమంది వరకు భక్తులు రోజూ వస్తున్నారు. నడకదారిలో ఇప్పటికే 50మంది టిటిడి భద్రత సిబ్బంది, 30మంది అటవీశాఖ సిబ్బంది గస్తీ తిరుగుతున్నారు. ప్రస్తుతం చిరుతల సంచారంతో భద్రత సిబ్బంది మరింత అప్రమత్తమయ్యారు.

## ఇదే స్ఫూర్తితో అర్ధబ్రహ్మోత్సవం నిర్వహిస్తాం

### - వైకుంఠ దర్శనాల విజయవంతంపై అధికారుల్లో ఆనందోత్సాహాలు



**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** ఇటీవల ముగిసిన పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలను అన్ని విభాగాలు, అందరు అధికారులు తారతమ్యబేధం లేకుండా సమష్టిగా, సమన్వయంతో సేవలందించడంతో విజయవంతంగా ముగించామని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. అందరి సహకారంతోనే అంతా సవ్యంగా ప్రశాంతంగా ముగిసిందని సంతృప్తి వెలిబుచ్చారు. పదిరోజులపాటు సుమారు 7.83 లక్షలమంది భక్తులకు ఎక్కడి చిన్నపాటి అసౌకర్యం కలగకుండా చక్కగా నిర్వహించడంలో అనుసరించిన వ్యూహం సామాన్యభక్తుల నుండి అభినందనలు అందుకునే రీతిలో ఉండటం శుభపరిణామమన్నారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు విజయవంతంగా,ప్రశాంతంగా ముగించడం వెనుక అందరి సహాయ సహకారాలు,ఎప్పటికప్పుడు భక్తులకు సూచనలు,సలహాలు, సమాచారం అందించడంలో అధికారులకు మీడియాప్రతినిధుల పాత్ర అభినందనీయమన్నారు. ఆదివారం తిరుమలలో జిల్లాయంత్రాంగం ఉన్నతాధికారులు, టిటిడి ఉన్నతాధికారులు కలసి మీడియాప్రతినిదులతో సమావేశమయ్యారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో అత్యంత ప్రధానమైన డిసెంబర్ 30 వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠద్వాదశి, జనవరి 1 నూతన ఆంగ్ల సంవత్సరంతోబాటు వైకుంఠ ద్వార దర్శనాలు ఉండటంతో అత్యంత చాకచక్యంగా, ప్రణాళికలతో వ్యూహాత్మకంగా వ్యవహరించామన్నారు. తొలిమూడురోజులు ఆన్‌లైన్‌లో ఇ డిప్ టోకెన్లు ఉన్న భక్తులకే స్వామివారి దర్శనం చేయించేలా చూడటం మాత్రం కొంతవరకు టోకెన్ లేని భక్తులను నియంత్రించడం క్లిష్టంగా మారినా పోలీసు అధికారులు సంయమనంతో వ్యవహరించి భక్తులకు తెలియజేయడంలో విజయవంతమయ్యారన్నారు. ఆ రెండురోజులు భారీగా ప్రముఖులు వచ్చినా ఎక్కడా లోటుపాట్లు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడటంతోనే ఆశించిన ఫలితాలు వచ్చాయని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన వారం రోజులు జనవరి 2నుండి 8వరకు ఎటువంటి దర్శన టోకెన్‌లు, టిక్కెట్‌లేని భక్తులను సర్వదర్శనంలో క్యూలైన్లలో క్రమబద్ధీకరణ చేస్తూ అనుమతించడంలో ప్రశాంతంగా నిర్వహణలో అందరూ శ్రమించారన్నారు. గతంలో కంటే అదనంగా భక్తులకు సౌకర్యాలు కల్పించి,భక్తుల పరవశం వెనుక కృషిచేసిన పోలీసు,టిటిడి,విజిలెన్స్,శ్రీవారిసేవకులు, ఆలయం ఉద్యోగుల పనితీరును జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. ఎవరూ ఊహించని రీతిలో ఈ ఏడాది పూర్తి ప్రశాంతంగా పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలు చేయించడంలో అందరూ సమష్టి కృషితో ,బాధ్యతగా సేవలందించడమే తమవంతు సేవగా అభిప్రాయపడ్డారు. చిన్నపాటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ,పూరి స్థాయిలో భద్రత, అన్నప్రసాదాల పంపిణీ తదితర సేవలందించి భక్తుల మన్ననలు అందుకున్నామన్నారు. ఇదేరీతిలో ,ఇదేస్ఫూర్తితో 25న జరగనున్న ఒకరోజు బ్రహ్మోత్సవం ఏడువాహనసేవల వీక్షణకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలందిద్దామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మాం, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, తిరుపతి ఎస్‌బి డిఎస్పీ జె,వెంకటనారాయణ, టిటిడి విజిలెన్స్ అధికారులు, పోలీసు అధికారులు,శ్రీవారి ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# సంకల్ప బలంతో లక్ష్య సాధన..



సంకల్ప బలం ఉంటే లక్ష్య సాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని అధిగమించవచ్చు. ఇందుకు ఎల్. కీర్తన ప్రయాణమే నిదర్శనం. ఇటీవల మాల్దీవుల్లో జరిగిన క్యారమ్స్ ప్రపంచ కప్ పోటీల్లో గెలిచి, మరోసారి మనదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పింది. ఈమె గురించి తెలియాలంటే.. కీర్తనది చెన్నైలోని పుదువన్నర పెట్టైలోని సెరియన్ నగర్, నాన్న లోకనాథన్. అమ్మ ఇంద్రాణి. నిరుపేద కుటుంబం. తండ్రి చనిపోయాక కీర్తన చదువు ఆగిపోయింది. పొట్టకూటి కోసం ఓ వర్క్ షాప్‌లో పనిచేస్తుంది. నాన్నకు క్యారమ్స్ అంటే చాలా ఇష్టం. పని అయ్యాక కాస్త ఖాళీ దొరికినా ఆడేవారు. నాకూ నేర్పించేవారు. అలా ఆరేళ్ల వయసు నుంచే క్యారమ్స్ ఆడుతున్నా.. ఎప్పటికైనా ఈ ఆటలో నేను చాంపియన్ కావాలన్నది ఆయన ఆశ కానీ నాకు పన్నెండేళ్లు ఉన్నప్పుడు అనారోగ్య కారణాల వల్ల నాన్న చని పోయారు. ఎన్నో సవాళ్లు. కానీ దాతల సహాయంతో ఎన్ని కష్టాలు వచ్చినా ఆయన కల నెరవేర్చాలి అనుకున్నా. షాప్‌లో పనిచేస్తూనే వీలున్నప్పుడల్లా టోర్నమెంట్స్‌కు వెళుతుండగా అలా వచ్చిన మనీ అమ్మకు ఇచ్చేదాన్ని అనే కీర్తన ఆడుతూనే మెలకువలను నేర్చుకుంది.

**ఆ మలుపుతో....** ఇలానే ఒక టోర్నమెంట్ ఆడుతున్నప్పుడు స్థానిక క్యారమ్స్ క్లబ్ వాళ్లు కీర్తనను చూశారు. క్లబ్ కోసం ఆడే అవకాశం కల్పించారట. ఖాళీ దొరికినప్పుడల్లా క్లబ్‌కు వెళ్లేదాన్ని. నేను నేర్చుకుంటూనే జూనియర్స్‌కూ ఆట నేర్పేదాన్ని. అలా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో ఆడే వసతి సంపాదించుకున్నా. ఈ మధ్య మాల్దీవుల్లో జరిగిన క్యారమ్ వరల్డ్ కప్ భారతదేశానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చింది. అక్కడకు వెళ్లడానికి ఆర్థికంగా అవన్నీ అధిగమించా. ఈ చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు గెలుచు కున్నా. ప్రపంచ కప్పు కైవసం చేసుకున్నా. నాన్న కల నెరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉంది. చెన్నైలో నాలాంటి క్రీడాకా రులు చాలామంది ఉన్నారు. కానీ ఆర్థిక కష్టాల వల్ల వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం మాకు ఆర్థికంగా సహాయం చేస్తే ఆటలో మరింత రాణిస్తాం. అని చెప్పే కీర్తన... తనకు అవకాశం కల్పించిన క్లబ్‌లోనే 35 మందికి పైగా ఔత్సాహికులకు శిక్షణనిస్తోంది.

# నడకతో డిప్రెషన్ దూరం

డిప్రెషన్... చాపకింద నీరులా విస్తరిస్తోన్న మానసిక సమస్య డబ్ల్యూహెచ్‌వో నివేదికల ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా 28కోట్ల మందితో బాధపడుతున్నారట. వీరిలో సగానికి పైగా మహిళల పరిష్కారానికి చాలామార్గాలను అనుసరిస్తున్నాం. కానీ ఈ నడక మంచి ఉపశమనం అంటోంది. ఇటీవల విడుదలైన ఓ పరిశోధన... ఈ సమస్యతో బాధపడుతున్న కొందరిని ఎంపిక చేసుకున్నారు. వీరంతా 18 ఏళ్ల పైబడిన వాళ్లే వీళ్లని ఉదయాన్నే నడవమన్నారు. క్రమంగా రోజుకు ఎన్ని అడుగులు వేయాలో సూచించారు. స్మార్ట్‌వట్లు, ట్రాకర్ల ద్వారా మానిటర్ చేశారు. నడవలేని వారితో ప్రస్తుతం వేల అడుగులు వేసిన వాళ్లలో నిరాశ, ఒత్తిడి, ఆందోళన తగ్గుతూ వచ్చాయట. నడిచేవారిలో ఎండార్ఫిన్లు ఎక్కువగా విడుదల అయ్యాయట. దాంతో ఒత్తిడి, ఆందోళన దూరమయ్యాయి. అంతేకాదు, రక్తప్రసరణ మెరుగుపడి, నాడీవ్యవస్థ బలోపేత మైంది. పైగా ఉదయాన్నే నడవడం వల్ల శరీరం సూర్యరశ్మిని గ్రహిస్తుంది. కాలాను గుణంగా వచ్చే మానసిక సమస్యలకు ఇది చక్కటి పరిష్కారం కూడా. వీళ్లలో చాలా మంది నిద్ర సమస్యలనూ అధిగమించారట.



# తిరుప్పావై

## 28వ పాశురము

కఱవైగళ్ పిన్ షెన్రు కానమ్
శేరుండోమ్,
అఱ్ఱివొంజుమిల్లాత ఆయ్కులత్తు,
ఉన్దన్నై,
ప్పిఱ పెఱున్దనై పుణ్ణియమ్
యాముడై యోమ్,
కుఱైవొన్లు మిల్లాద గోవిందా!
ఉన్దన్నోడు
ఉఱవేల్ నమక్కు ఇంగు ఒళిక్క
ఒళియాదు,
అఱియాద పిళ్ళైగళోం
అన్బినాల్, ఉన్దన్నై
శిఱు పేరళైత్తనవుమ్ శీఱి
యరుళాదే,
ఇఱైవా నీ తారాయ్ పఱై యేలో
రెమ్బావాయ్



పశువులను అడవిలోనికి తీసుకెళ్ళి వాటిని మేపి మా పోషణ చేసుకొను గోపకులములో పుట్టినవారము. కృష్ణుడు మాతో పెరగటమే మేము చేసుకొన్న పుణ్యము నీతో సంబంధము పోగొట్టుకో జాలము. ఓ గోవిందా అని స్వామియని ప్రేమతో నిన్ను చిన్నచిన్న పేర్లతో పిలుస్తున్నందుకు మాపై కోపగించుకోకు, లోక మర్యాద తెలియని పిల్లలము. 'పర' యను వాయిద్యమును మాకు ఇమ్ము అనుచు గోపికలు కృష్ణుణ్ణి అడుగుతున్నారు. ఫలం: అరిషడ్ వర్గాలను నాశనం చేయడం"

# సమస్యను పెద్దది చేసుకోరాదు..

వివాహబంధాన్ని పదికాలాలపాటు కాపాడు కునే బాధ్యత దంపతులిద్దరిదీ, కానీ కొందరు చిన్నచిన్న విభేదాలనూ పెద్ద సమస్యలుగా చేసుకుంటారు. వాటిని పరిష్కరించుకోవాలిగానీ పెద్దది చేసుకోకూడదు అంటున్నారు నిపుణులు. దంపతుల మధ్య ఏర్పడే చిలిపి తగాదాలు కొన్నిసార్లు పెద్దవవుతాయి. అటువంటి సంభాషణలో వచ్చే మార్పును ఇరువురిలో ఏ ఒక్కరు గుర్తించినా దాన్ని అక్కడితో ఆపేయాలి. ఎదుటివారు కొనసాగిస్తున్నా కూడా నిశ్శబ్దంగా ఉంటే చాలు. లేదంటే ఆ చిలిపి తగాదా చివరకు చిలికి చిలికి గాలివానలా మారే ప్రమాదం ఉంది. ఇది భార్యాభర్తల మధ్య తాత్కాలికంగా దూరాన్ని పెంచుతుంది. ఏ మాట మాట్లాడితే భాగస్వామి ట్రిగ్గర్ అవుతున్నారో గుర్తించాలి. మరో సారి వాటిని మాట్లాడకుండా ఉండటానికి ఎదుటివారు ప్రయత్నిస్తే చాలు. దంపతుల మధ్య సంభాషణ నిత్యం సంతోషంగా సాగుతుంది.

**ఫిర్యా దులకు స్పందించొద్దు...** వైవాహికబంధంలో భార్యాభర్తల మధ్య వచ్చే కొన్ని సమస్యలకు చుట్టుపక్కల వాళ్లు కారణమవుతుంటారు. ఎదుటివారు చెప్పే ఫిర్యాదు లను పరిగణలోకి తీసుకొని భాగస్వామితో కొందరు విభేదాలు పెంచు కుంటారు. ఇరువురిమధ్య మూడో వ్యక్తికి స్థానమివ్వ కుండా ప్రతి విషయాన్ని దంపతులు మాత్రమే చర్చించుకుంటే సమస్య ఉండదు. అలాగే ఒకరిపై మరొకరికి భరోసా ఉండాలి.



# అప్పాలు



**కావలసినవి :** బియ్యం పిండి 250. నువ్వులు, టేబుల్ స్పూన్.1 కరివేపాకు (సన్నగా తరిగినవి) 1 టేబుల్ స్పూన్., ఎర్ర మిరప పొడి 1 టీ స్పూన్. ఉప్పు రుచికి. తగినంత, వెన్న 1 టీ స్పూన్, పసుపు పొడి 1 చిటికెడు. నూనె వేయించడానికి.

**తయారీ:** బాణలిలో కొన్ని నీళ్ల మరిగించి అందులో నానబెట్టిన శెనగపప్పు, దంచిన శెనగపప్పు, నువ్వులు, కరివేపాకు, ఎర్ర కారం, ఉప్పు, వెన్న, పసుపు వేసి బాగా కలపాలి. దానికి బియ్యప్పిండి వేసి మెత్తగా కలపండి, మరొక గిన్నెలోకి మార్చండి మరియు గోరు వెచ్చని నీటిని జోడించడం ద్వారా గట్టి పిండిని తయారు చేయండి. పిండిని చిన్న భాగాలుగా చేసి, నూనె రాసుకున్న పాలిథిన్ షీట్‌పై చేతితో నొక్కండి. మధ్యలో ఒక చిన్న రంధ్రం చేసి, వేడి నూనెలో డీప్ ఫ్రై చేసి, తరువాత పేపర్ టవల్ లోకి

# డబ్బా కడిగారా?

తినుబండారాలు ఆర్డర్ చేసుకోవడం ఇప్పుడెంత సహజమో కదా! వండటానికి సమయం లేకో... పిల్లలు అడిగారనో... బయట తినాలనిపించో చాలాసార్లు తెప్పించుకుంటూనే ఉంటాం. ఆడపాదడపా అలా చేయడం పర్లేదు కానీ, ఇంతకీ ఆహారం వచ్చిన ఆ డబ్బా లను ఏం చేస్తున్నారు? ఏం చేస్తాం... ఒక్కసారి ఉపయోగించి పడేసేవి కదా! పడేస్తున్నా' మంటారా? అది మంచిదే కానీ ఇంతకీ వాటిని కడిగారా? పడేసేవాటిని ప్రత్యేకంగా కడగడ మెందుకు అన్న సందేహమా! దాదాపుగా ఇప్పుడు ఈ యూజ్ అండ్ త్రో రకాలను రీసైకిల్ చేసేలానే తెస్తున్నారు. అయితే మనం ఆ డబ్బాల్లో మిగిల్చిన చట్నీ, కూరలు, వాటికి అంటిన నూనెలు కుళ్లి వాసన రావడమే కాదు... రీసైక్లింగ్‌కి పనికిరావట. అంటే తిరిగి ఉపయో గించగలిగిన వాటినీ వృథా చేస్తున్నట్టేగా! ఇదంతా భూమ్మీద పేరుకుపోయి పర్యావరణానికి హాని, ఇదంతా జరగొద్దంటే... ఈసారి నుంచి ఆ డబ్బాని కాస్త ఓపిక చేసుకుని కడగండి. తరువాతే చెత్తబుట్టలో పడేయండి. పర్యావర ణానికి కారణం... మనకి మనం మేలు చేసుకున్న వాళ్లమవుతాం... సరేనా.





# రంగవల్లి



- ఎన్. స్వాతి
మణికొండ, హైద్రాబాద్

23 చుక్కలు, 3 వరుసలు, ఇటు అటు వదిలి 2 వరకు





- సంతోషి
తెల్లాపూర్, హైద్రాబాద్

15 చుక్కలు, 5 వరుసలు, ఇటు అటు వదిలి 5 వరకు



# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ప్రేక్షకులను అలరిస్తుంది: రవితేజ

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రం, ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలతో హ్యూజ్ బజ్‌ను సృష్టించింది. ఈ సినిమా జనవరి 13న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్లో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. మా ఆర్ట్ డైరెక్టర్ ప్రకాష్, నేను కలిసి 13 సినిమాలు చేశాం. మా సినిమాలన్నీ దాదాపు హిట్ అయ్యాయి. ఈ సినిమాలో మా హీరోయిన్స్ చాలా అందంగా కనిపిస్తారు. హీరోయిన్ ఆశిక రంగనాథ్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇది అద్భుతమైన జర్నీ. మా నిర్మాత సుధాకర్‌కి థాంక్యూ సినిమాని చాలా అద్భుతంగా నిర్మించారు. ప్రొడ్యూసర్ సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ, జనవరి 13న మా బీఎండబ్ల్యు (భర్త మహాశయులకు విజ్ఞప్తి) రైట్‌కి వెళ్ళండి. కచ్చితంగా అదిరిపోతుంది. డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ, అందరికి నమస్కారం. అందరికి ధన్యవాదాలని అన్నారు.



# సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ

## తాతయ్య గర్వపడేలా చేయడమే నా జీవితాశయం: హీరో జయకృష్ణ



భారతీయ సినీ పరిశ్రమకి అపూర్వమైన సేవలు అందించిన పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో అత్యంత ఘనంగా జరిగింది. కృష్ణ మనవడు ఘట్టమనేని జయకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, అగ్ర నిర్మాత అశ్వినిదత్, సినీ రాజకీయ ప్రముఖులు, సూపర్ స్టార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణ కి ఘన నివాళులు అర్పించారు. విగ్రహాఆవిష్కరణ కార్యక్రమంలో హీరో జయకృష్ణ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఫస్ట్ టైం మీ అందరినీ కలవడం చాలా సంతోషంగా ఉంది. కృష్ణ ని సెలబ్రేట్ చేసుకుంటూ కలవడం ఇంకా సంతోషంగా ఉంది. నేను ఏం చేసినా ఆయన నా పక్కనే ఉంటూ నడిపిస్తుంటారని పిస్తోంది, ఈరోజు కూడా ఆయన నా పక్కనే ఉన్నారు అనిపిస్తుంది. ఘట్టమనేని ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులకు, కృష్ణ అభిమానులకు అందరికీ ధన్యవాదాలు. సుధాస్వామి బుజ్జి జితేంద్ర ముగ్గురు రెండు సంవత్సరాలుగా చాలాకష్టపడి అనుమతులు తీసుకుని ఈ విగ్రహాన్ని కట్టించడం అహర్నిశలూ కష్టపడి ఈ ఆవిష్కరణ కార్యక్రమం చేయడం అభినందనీయం. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, కృష్ణకి విజయవాడతో ఎంతో అనుబంధం ఉంది. విజయవాడ ప్రజలకు కూడా కృష్ణ అంటే అపారమైన అభిమానం. ఆ కుటుంబంతో నాకు కూడా మంచి అనుబంధం ఉంది. జయకృష్ణ మహేష్ బాబులాగా చక్కని అందమైన హీరోలాగా మీ ముందుకు వస్తున్నాడు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ, అందరికీ హృదయపూర్వక నమస్కారాలు. మంచికి మారుపేరు కృష్ణ. సూపర్ స్టార్ అంటే కృష్ణ. కృష్ణ మనవడు జయకృష్ణ హీరోగా పరిచయం అవుతున్నారు. కృష్ణని మహేష్ బాబుని ఆశీర్వదించిన అందరూ జయకృష్ణని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.

## తెర



ఈ సంక్రాంతికి వినోదాల విందుని అందించడానికి 'అనగనగా ఒక రాజు' చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి

కథానాయిక మీనాక్షి చౌదరి

# వినోదాన్ని అందించే చిత్రం 'అనగనగా ఒక రాజు'

కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. మొదటి నుంచి ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం.. అసలుసిసలైన పండగ సినిమాగా 2026, జనవరి 14న థియేటర్లలో అడుగు పెట్టనుంది. మూడు వరుస ఘన విజయాల తర్వాత నవీన్ పొలిశెట్టి నుంచి వస్తున్న సినిమా కావడంతో 'అనగనగా ఒక రాజు'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన ట్రైలర్, ఆ ఆసక్తిని రెట్టింపు చేసింది. భారీ అంచనాల నడుమ విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో తాజాగా కథానాయిక మీనాక్షి చౌదరి, మీడియాతో ముచ్చటించి సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గుంటూరు కారం, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒక రాజు ఇలా వరుసగా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావడం ఎలా ఉంది? చాలా చాలా సంతోషంగా ఉంది. గతేడాది సంక్రాంతికి వస్తున్నాం'తో మరిచిపోలేని సంక్రాంతి విజయాన్ని అందుకున్నాను. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు'తో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకుంటాననే నమ్మకం ఉంది. మీ పాత్ర ఎలా ఉండబోతుంది? అమాయకంగా, సున్నితమైన మనసు కలిగి ఉంటుంది. క్యూట్ గా బిహేవ్ చేస్తుంది.

# 'శ్రీనివాస మంగాపురం' పవర్ ఫుల్ ఫస్ట్‌లుక్

ఘట్టమనేని కుటుంబం నుంచి సరికొత్త స్టార్ తనదైన ముద్ర వేయడానికి సిద్ధంగా ఉన్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. అతని మొదటి చిత్రం 'శ్రీనివాస మంగాపురం'కు.. 100, మంగళవారం లాంటి మరపురాని సినిమాని అందించిన అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్ పై పి. కిరణ్ నిర్మించారు. ఈ చిత్రం టైటిల్, ప్రీలుక్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈరోజు సూపర్ స్టార్ మహేష్ బాబు తన అన్న కొడుకైన జయ కృష్ణ తొలి చిత్రం పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. ఫస్ట్‌లుక్‌లో జయ కృష్ణ దుమ్ము దూళి ఎగసే రగ్గడ్ బ్యాక్ డ్రాప్‌లో హై స్పీడ్‌లో బైక్ నడుపుతూ కనిపించారు. ఒక చేత్తో బైక్‌ను గట్టిగా పట్టుకుని, మరో చేత్తో గన్ టార్గెట్ గా పెట్టిన విధానం హైస్టేక్స్ చేజ్‌ను సూచిస్తోంది. చుట్టూ మోషన్ బ్లర్, అతని కళ్లలో కనిపించే ఫోకస్..మొత్తం లుక్‌కు పవర్, ఇంటెన్సిటీని యాడ్ చేస్తోంది. ఈ సినిమాను టీమ్ "డెబ్యూ ఆఫ్ ది ఇయర్ 2026"గా బ్రాండ్ చేస్తోంది. మొత్తంమీద ఫస్ట్ లుక్ ఒక గ్రిప్పింగ్, హైఆక్టేన్ యాక్షన్ డ్రామాని ప్రామిస్ చేస్తోంది. షూటింగ్ ప్రారంభానికి ముందు జయ కృష్ణ తన పాత్ర కోసం ఇంటెన్స్ ప్రిపరేషన్ చేశారు. ఈచిత్రంలో బాలీవుడ్ నటి రాషా తడాని టాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. టాలీవుడ్‌లో అద్భుతమైన స్టార్ లాంచ్‌లకు చిరునామాగా నిలిచిన అశ్వినీ దత్, ఈసారి జయకృష్ణ ఘట్టమనేని రూపంలో మరో కొత్త స్టార్‌ను పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, జయకృష్ణ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. మాధవ్‌కుమార్ గుల్లపాటి ఎడిటర్. సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. రియల్ సతీష్ ఫైట్ మాస్టర్.



# అరుదైన ఘనత సాధించిన పవన్ కల్యాణ్

**జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో ప్రవేశం జపనీస్‌మార్షల్ ఆర్ట్స్‌లో చారిత్రాత్మక ప్రపంచ గుర్తింపు పొందిన పవన్ కల్యాణ్**



పవన్ కల్యాణ్ బహుముఖ ప్రజ్ఞాశాలి. సినీ రంగంలో నటుడిగా చెరగని ముద్ర వేశారు. నటుడిగా మాత్రమే కాకుండా రచయితగా, దర్శకుడిగా, స్టంట్ కోఆర్డినేటర్‌గా, కొరియోగ్రాఫర్‌గా, గాయకుడిగా ఇలా పలు విభాగాల్లో తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రజా నాయకుడిగా మన్ననలు పొందుతున్నారు. మార్షల్ ఆర్ట్స్‌లోనూ ప్రావీణ్యులైన పవన్ కళ్యాణ్, ఓ అరుదైన ఘనతను ఖాతాలో వేసుకున్నారు. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ అయిన 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొందడం ద్వారా ఒక గొప్పఅంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన క్రమశిక్షణతో సాగించిన సాధన, పరిశోధన, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపులభించింది. కాలక్రమేణా, శారీరక సాధనకే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి, అత్యంత నిబద్ధతతో వాటిని అనుసరించారు. అంతేకాకుండా, గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ద్వారా ఆయనకు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్" అనే విశిష్ట బిరుదుతో సత్కారం కూడా జరిగింది. ఆయన మార్గదర్శకత్వంలో పవన్ కల్యాణ్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం, లోతైన తాత్విక అవగాహనను సంపాదించారు. యుద్ధకళ సాధకులు, అభిమానుల దృష్టిలో కెంజుట్సులో పవన్ కళ్యాణ్ ప్రవేశం అనేది కేవలం ఒక గౌరవం మాత్రమే కాదు.. క్రమశిక్షణ, వినయం, నిరంతర అభ్యాసం వంటి విలువలతో నిండిన జీవితకాల ప్రయాణానికి ప్రతిబింబం. ఈ విలువలు మార్షల్ ఆర్ట్స్‌కు మాత్రమే కాకుండా పవన్ కళ్యాణ్ వ్యక్తిగత సిద్ధాంతాలకు కూడా లోతుగా అనుసంధానమై ఉన్నాయి.

# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

హీరోయిన్ సంయుక్త



చార్మింగ్ స్టార్ శర్వా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నటిస్తున్న హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. జనవరి 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా సంయుక్త విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.


**సంక్రాంతికి రావడం ఎలా అనిపిస్తుంది?**
సంక్రాంతికి రావడం చాలా ఆనందంగా ఉంది. సంక్రాంతి చాలా పెద్ద పండుగ. సంక్రాంతికి వచ్చే ప్రతి సినిమాకి మంచి ఆదరణ ఉంటుంది. చాలా క్లీన్ కామెడీ ఎంటర్టైనర్. పండుగకి పర్ఫెక్ట్ మూవీ.

**డైరెక్టర్ రామ్ అబ్బరాజు గురించి?**
ఎప్పుడు చాలా కాన్ఫిడెంట్‌గా ఉంటారు. చాలా క్లారిటీ వున్న డైరెక్టర్.

**అనిల్ నిర్మాణంలో పని చేయడం ఎలా అనిపించింది?**
అనిల్‌కి సినిమా అంటే చాలా పాషన్. సినిమాకి ఆయనే మెయిన్ పిల్లర్. అందర్నీ సపోర్ట్ చేస్తారు.

**సాక్షి వైద్య గురించి?** మా మధ్య మంచి కాంబినేషన్ సీన్లు ఉన్నాయి. తను ప్రతి సీన్‌కి ప్రిపేర్ అయ్యే విధానం చాలా బాగుంటుంది. చాలా హార్డ్ వర్క్ చేస్తుంది. **బ్లాక్ గోల్డ్ ఎప్పుడు వస్తుంది?**
ఫిబ్రవరిలో షూటింగ్ పూర్తి కావచ్చు. సినిమా చాలా బాగా వస్తోంది,

## మహిళల హాకీ ఇండియా లీగ్‌లో
# ఛాంపియన్‌గా ఎస్‌జి పైపర్స్
### ఫైనల్లో బెంగాల్ టైగర్స్ ఓటమి




**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్, 2025-26 ఫైనల్లో ఎస్‌జి పైపర్స్ ఛాంపియన్‌గా నిలిచింది. మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసిన తర్వాత షూటౌట్‌లో 3-2 తేడాతో శ్రాచి బెంగాల్ టైగర్స్‌ను ఓడించి పైపర్స్ మహిళల హీరో హాకీ ఇండియా లీగ్ టైటిల్‌ను దక్కించుకుంది. హోరాహోరీగా జరిగిన ఫైనల్లో రెండు జట్లు 1-1 గోల్స్ తో సరిపెట్టుకున్నాయి ఆ తర్వాత నిర్ణయాత్మక షూటౌట్‌లో పైపర్స్ పైచేయి సాధించింది. 16వ నిమిషంలో శ్రాచి బెంగాల్ టైగర్స్ మొదటి గోల్ చేసింది. టైగర్స్ హాఫ్ టైమ్ వరకు స్వల్ప ఆధిక్యాన్ని కొనసాగించింది, పెనాల్టీ కార్నర్‌ల ద్వారా స్కోరును పెంచకుండా మరిన్ని అవకాశాలను సృష్టించింది. 53వ నిమిషంలో ప్రీతి దూబే బ్యాక్‌హ్యాండ్ ప్రయత్నం గోల్ కీపర్ స్టిక్ నుండి తప్పించుకుని నెట్‌లోకి దూసుకెళ్లి సమానత్వాన్ని పునరుద్ధరించడంతో వారి పట్టుదల ఫలించి స్కోరు సమం చేసింది. నిర్ణీత సమయంలో ఏ జట్టు విజేతను కనుగొనలేక పోవడంతో, ఛాంపియన్‌షిప్‌ను షూటౌట్‌లో నిర్ణయించారు. పైపర్స్ టైటిల్‌ను దక్కించుకోవడంలో సోలంకి మెరిశాడు. షూటౌట్‌లో పైపర్స్ కెప్టెన్ నవనీత్ కౌర్, జువానా కాస్టెల్లారో, లోలా రియరా తమ ప్రయత్నాలను గోల్‌గా మార్చగా, గోల్ కీపర్ బన్సారీ సోలంకి పెనాల్టీ స్ట్రోక్‌తో సహా మూడు కీలకమైన సేవ్‌లతో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఫలితంగా 3-2 షూటౌట్ విజయంతో పైపర్స్ ప్రతిష్టాత్మక లీగ్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

## జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# జాదుమణికి కిరీటం



**న్యూఢిల్లీ:** బాక్సింగ్ ప్రపంచ కప్ ఫైనల్స్ రజత పతక విజేత జాదుమణి సింగ్ దూకుడుతో అంతర్జాతీయ, ఎస్ఎస్‌సిబి సహచరుడు పవన్ బర్త్వాల్‌ను ఓడించి పురుషుల 50-55 కిలోల విభాగంలో తన తొలి సీనియర్ జాతీయ కిరీటాన్ని గెలుచుకున్నాడు. పోటీల చివరి రోజున జదుమణి, పవన్ మధ్య పోరు ఉత్కంఠంగా సాగింది. చివరకు జదుమణి చేతిలో పవన్ ఓటమి చెందడంతో 5:0 తేడాతో బంగారు పతకాన్ని సాధించాడు. ఇక కొన్ని నిమిషాల తర్వాత ఎస్ఎస్‌సిబికి చెందిన ఆదిత్య ప్రతాప్ (పురుషుల 60-65 కిలోలు) హిమాచల్‌కు చెందిన అభినాష్ జామ్వాల్‌పై 3:2 తేడాతో విజయం సాధించగా, అంకుష్ (పురుషుల 75-80 కిలోలు) మల్సామ్‌త్లుంగాను ఓడించి తమ తొలి సీనియర్ జాతీయ టైటిళ్లను కైవసం చేసుకున్నాడు. మహిళల విభాగంలో, ఎస్ఎస్‌సిబి కి చెందిన ప్రీతి (51-54), ప్రాంజల్ యాదవ్ (60-65), రైల్వేస్‌కు చెందిన ప్రియా (57-60), అల్ఫియాన్ ఖాన్ (80+) తమ తొలి సీనియర్ జాతీయ బంగారు పతకాలను సాధించారు. అలాగే ప్రపంచ ఛాంపియన్ మీనాక్షి మహిళల 4548 కిలోల బరువు విభాగంలో ఆర్ఎస్‌పిబికి చెందిన మంజు రాణిపై 5:0 తేడాతో విజయం సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

# న్యూజిలాండ్ వన్డేల్లో రన్నింగ్ బ్యాటర్స్
### 150 పైన రన్స్ చేసిన భారత్ ప్లేయర్స్




**న్యూఢిల్లీ:** భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే వన్డే సిరీస్‌లో చాలా రికార్డులు బద్దలవుతాయి. కానీ ఏ భారతీయ బ్యాట్స్‌మన్ అయినా అత్యధిక స్కోరు రికార్డు చేస్తాడా లేదా అనే దానిపై అందరి దృష్టి ఉంటుంది. భారత్, న్యూజిలాండ్ మధ్య వన్డేల్లో తలపడినప్పుడల్లా ఇప్పటి వరకూ అత్యధిక స్కోర్లు నమోదయ్యాయి. ముఖ్యంగా భారత గడ్డపై జరిగిన మ్యాచ్‌లలో పరుగులు పుష్కలంగా ఉన్నాయి. న్యూజిలాండ్‌తో జరిగిన స్వదేశీ వన్డేల్లో కూడా భారత బ్యాట్స్‌మెన్ ఐదుగురు 150, అంతకంటే ఎక్కువ పరుగుల స్కోర్లు సాధించారు. ఇందులో ఒక డబుల్ సెంచరీ కూడా నమోదైంది.

భారత వన్డే కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ న్యూజిలాండ్‌తో జరిగిన స్వదేశీ వన్డే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేసిన జాబితాలో చేరాడు. జనవరి 2023లో న్యూజిలాండ్‌తో హైదరాబాద్ జరిగిన వన్డేలో గిల్ 149 బంతుల్లో 19 ఫోర్లు, 9 సిక్సర్లతో 208 పరుగులు చేశాడు. ఇది ఇప్పటివరకు కివీస్ జట్టుపై భారత బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక వన్డే స్కోరు. టీమ్ ఇండియా 9 వికెట్లకు 349 పరుగులు చేయగా, న్యూజిలాండ్ కూడా 337 పరుగులు చేసింది. అలాగే న్యూజిలాండ్‌పై భారత్ బ్యాట్స్‌మెన్ సచిన్ టెండూల్కర్ అత్యధిక వన్డే స్కోరు రికార్డును కలిగి ఉన్నాడు. 1999లో హైదరాబాద్ వన్డేలో న్యూజిలాండ్‌పై సచిన్ టెండూల్కర్ 186 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కేవలం 150 బంతుల్లోనే మాస్టర్ బ్లాస్టర్ 20 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. ఇక వన్డే రికార్డుల గురించి విరాట్ కోహ్లీ గురించి ప్రస్తావించకుండా మాట్లాడటం అసాధ్యం. 2016 అక్టోబర్‌లో జరిగిన సిరీస్‌లోని మూడవ వన్డేలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ అజేయంగా 154 పరుగులు చేశాడు. మొహాలీలో జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 285 పరుగులు చేసింది. లక్ష్యాన్ని ఛేజ్ చేసిన కోహ్లీ 134 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 154 పరుగులు చేశాడు. భారత్ మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ 1999 నంబరులో హైదరాబాద్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 153 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 376/2 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. హైదరాబాద్‌లో 3వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ద్రవిడ్ 196 నిముషాల ఆటలో 15 ఫోర్లు, 2 సిక్సులు ఉన్నాయి. అగే 1999 నవంబరులో గ్వాలియర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లోని మూడవ వన్డేలో భారత్ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అజేయంగా 153 పరుగులు చేశాడు. క్రీజులో 225 నిముషాల్లో 18 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు.

## బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ రాణిగా సబలెంకా




**న్యూఢిల్లీ:** వరల్డ్ నంబర్ 1 అరినా సబలెంకా బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ రాణిగా నిలిచింది. తన కెరీర్‌లో 22వ డబ్ల్యూటిఎ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం పాట్ రాఫ్టర్ అరీనాలో జరిగిన పోటీలో 1 గంటా 18 నిమిషాల్లో మార్తా కోస్ట్యుక్‌ను 6-4, 6-3 తేడాతో ఓడించిన సబలెంకా తన బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ కిరీటాన్ని విజయవంతంగా తిరిగి పొందింది. సబలెంకా తొలి సెట్‌లో 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లడంతో ఆమె ప్రారంభంలోనే ఒత్తిడిని పెంచింది. కానీ కోస్ట్యుక్ వరుసగా మూడు గేమ్‌లను గెలిచి సెట్‌ను 3-ఆల్‌తో సమం చేసింది. కానీ 23 ఏళ్ల సబలెంకా స్వల్ప సమయంలో కోలుకుని తీవ్రతను పెంచి ఐదు బ్రేక్ పాయింట్లలో రెండవదాన్ని 40 నిమిషాల మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. సబలెంకా వరుసగా ఆరు గేమ్‌లతో రెండో సెట్‌ను తన ఆధిక్యంలోకి తెచ్చుకుని 3-0తో దూసుకువెళ్లింది. కాంబినేషన్ డ్రాప్ షాట్ ప్లస్ క్రాస్‌కోర్ట్ ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో ఆమె 4-1తో తన హోల్డ్‌ను కొనసాగించింది, తదుపరి కొన్ని గేమ్‌ల తర్వాత మ్యాచ్‌ను సునాయాసంగా ముగించింది. కాగా ఈ వారం అంతా ఒక్క సెట్ కూడా కోల్పోకుండానే బెలారసియన్ క్రీడాకారిణి ట్రోఫీని గెలుచుకుంది. ఆస్ట్రేలియాలో సబలెంకాకు ఇది ఐదవ టైటిల్ మరియు ఆమె కెరీర్‌లో మొత్తం 22వ టైటిల్. వీనస్ విలియమ్స్ మరియుఇగా స్వియాటెక్ తర్వాత,క్రియాశీల క్రీడాకారిణులలో మూడవ అత్యధిక డబ్ల్యూటిఎ టూర్‌టైటిళ్లకోసం విక్టోరియా అజరెంకాను అధిగమించింది.సీజన్‌ఓపెనింగ్ డబ్ల్యూటిఎ 500 టైటిల్‌ను నిలబెట్టుకున్న ముగ్గురు మహిళలలో సబలెంకా ఒకరిగా నిలిచింది.

# యుపి కబడ్డీ లీగ్‌లో ఛాంపియన్‌గా కాశీ కింగ్స్
### లక్నో లయన్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్ కబడ్డీ లీగ్ హైప్రెజర్ ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన తర్వాత లక్నో లయన్స్‌ను 38-32 తేడాతో ఓడించిన కాశీ కింగ్స్ సీజన్ 2 ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఈ ఫైనల్ భారీ అంచనాలతో రెండు జట్లు సీజన్‌లో ప్రవేశించాయి. కాశీ కింగ్స్ తన ప్రత్యర్థి లక్నో లయన్స్ రక్షణాత్మక లోపాలను తమకు అనుకూలంగా మార్చుకుంది. ముఖ్యంగా లక్నో లయన్స్ రక్షణాత్మకంగా స్థిరపడటంలో ఎదుర్కొన్న అనిశ్చితిని కాశీ కింగ్స్ ఉపయోగించుకుంది. లక్నో డిఫెన్స్ నుంచి పదే పదే తప్పులు చేస్తూ మొదటి అర్ధభాగం అంతా ఒక్క టాకిల్ పాయింట్ కూడా నమోదు చేయకపోవడంతో ఈ ప్రభావం స్కోరు బోర్డుపై స్పష్టంగా కనిపించింది. కింగ్స్ నియంత్రిత దాడులు, తెలివైన ఆట నిర్వహణ ద్వారా నిరంతర ఒత్తిడిని ప్రయోగించడంతో లక్నో మొదటి అర్ధభాగంలో ఆలౌట్ అయింది. దీని వలన కాశీ విరామ సమయానికి 6 పాయింట్ల ఆధిక్యంలోకి వెళ్ళింది. రెండవ అర్ధభాగంలో కూడా కింగ్స్ తమ జోరును కొనసాగించింది. పునఃప్రారంభమైన మూడు నిమిషాల్లోనే, వారు లక్నో లయన్స్‌పై మరో ఆలౌట్ చేసి, వారి ఆధిక్యాన్ని 11 పాయింట్లకు పెంచి పట్టును మరింత పెంచుకున్నారు. లక్నో లయన్స్ దూకుడుగా రైడింగ్ చేయడం, వేగవంతమైన పరివర్తనల ద్వారా తిరిగి రావడానికి ప్రయత్నించింది, మార్జిన్‌ను క్లుప్తంగా తగ్గించి పోటీని సజీవంగా ఉంచింది. అయితే చివరి క్షణాల్లో నిర్ణయాత్మక సూపర్ టాకిల్ లక్నో యొక్క చివరి పుష్‌ను నిలిపివేసి, ఛాంపియన్‌షిప్‌ను సమర్థవంతంగా ముగించింది. కాశీ కింగ్స్ 38-32 విజయంతో ఫైనల్‌ను ముగించింది.



# త్రైమాసిక రాబడులు, ద్రవ్యోల్బణ గణాంకాలే కీలకం

**ముంబయి, జనవరి 11:** స్టాక్ మార్కెట్లకు ఈవారం మూడో త్రైమాసిక కార్పొరేట్ లాభాలు, అనేక బ్లూచిప్ కంపెనీల ఆదాయ వ్యయాల వివరాలు కీలకం కానున్నాయి. అలాగే ప్రపంచ మార్కెట్లధోరణులు, ద్రవ్యోల్బణ గణాంకాలు వంటివికూడా ఇన్వెస్టర్లకు దిక్సూచిగా ఉంటాయని తెలుస్తోంది. విదేశీ ఇన్వెస్టర్ల ట్రేడింగ్ కార్యకలాపాలుకూడా సెన్సెక్స్ నిఫ్టీకు కీలకం అవుతాయి. ఇన్వెస్టర్లు ఈవారంలో రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలపై ఫోకస్‌పెంచుతారు. అలాగే టోకుదరలసూచీ ద్రవ్యోల్బణం, ఐటి, బ్యాంకింగ్, ఆర్థికసేవలు, ఇంధన రంగాల కంపెనీల త్రైమాసిక ఫలితాలు కూడా కీలకం అవుతాయని రెలిగేర్ బ్రోకింగ్ ఎస్వీపీ అజిత్‌మిశ్రా పేర్కొన్నారు. ఇక అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులు, ట్రంప్ సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు ఇవ్వబోయే తీర్పులు కూడా కీలకం అవుతాయని అంచనా. వీటికితోడు ప్రపంచ దేశాల్లో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు ఒకింత ప్రభావం పడే అవకాశం ఉంది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు, అమెరికా ముడి చమురుధరలు, ఎంసిఎక్స్‌లో పసిడిధరలు వంటివి ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తాయని అంచనా.

# ఏడు కంపెనీల్లో రూ.3.64లక్షల కోట్లు క్షీణించిన మార్కెట్ క్యాప్





**న్యూఢిల్లీ, జనవరి 11:** దేశంలోని టాప్ పది భారీ కంపెనీల్లో ఏడు కంపెనీల మార్కెట్ విలువలు 3.64 లక్షలకోట్లు క్షీణించాయి. వీటిలో రిలయన్స్‌ఎ క్కువ నష్టపోయింది. గత వారంలో బిఎస్ఇ బెంచ్‌మార్క్ సూచీ 2185.77పాయింట్లు క్షీణించింది. భారతీయ ఈక్విటీ మార్కెట్లు గత వారం మొత్తంప్రతికూలంగానేనడిచాయి. అమెరికా సుంకాల హెచ్చరికలు, భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్లకు ప్రతికూలం అయినట్లు ఎన్‌రిచ్ మనీ సిఇఒ పొన్ముడి ఆర్ వెల్లడించారు. రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, టిసిఎస్, భారతి ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి కంపెనీలు మార్కెట్ విలువలు భారీగా క్షీణించాయి. ఐసిఐసిఐబ్యాంకు, భారతీయ స్టేట్‌బ్యాంకు, హిందుస్థాన్‌యూనిలీవర్లు మాత్రమే లాభపడ్డాయి. రిలయన్స్ మారెనకట్ విలువలు 1,58,532.91 కోట్లు క్షీణించి రూ.19,96, 445.69 కోట్లకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు విలువలు కూడా 96,153.61 కోట్లు క్షీణించి రూ.14,44,150.26 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ 45,274.72 కోట్లు క్షీణించి రూ.11,55,987.81 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్‌కూడా 18,729.68 కోట్లు క్షీణించి 5,97,700.75 కోట్లకు చేరినట్లు డేటా చెపుతోంది. ఇక ఎల్‌అండ్‌టి మార్కెట్ విలువలు 18,728.53 కోట్లు క్షీణించి రూ.5,53,912.03 కోట్లకు చేరింది. టిసిఎస్ రూ.15,232.14 కోట్లు క్షీణించి రూ.11,60,682.48 కోట్లుగా ఉందని తేలింది. ఇక ఇన్ఫోసిస్ మారెనకట్ విలువలుకూడా 10,760.59 కోట్లు క్షీణించి రూ.6,70,875 కోట్లకు చేరింది. ఇక ఐసిఐసిఐబానయంకు మార్కెట్‌క్యాప్ మాత్రంరూ.34,901.81 కోట్లు పెరిగి రూ.10,03,674.95 కోట్లుగా ఉంది. ఇక హిందుస్థాన్ యూనిలీవర్ ఎంకాప్ 6097.19 కోట్లు క్షీణించి రూ.5,57,734.23కోట్లకు చేరింది ఎస్‌బిఐ కూడా రూ.599.99 కోట్లు పెరిగి 9,23,061.76 కోట్లకు చేరింది. నష్టాలు ఎదురయినా టాప్ పదిలో రిలయన్స్ ఇప్పటికీ టాప్‌స్థాయిలోనే ఉంది. హెచ్‌డిఫ్‌సి, టిసిఎస్, భారతి ఎయిర్‌టెల్,ఐసిసిఐబ్యాంకు, ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, హిందూస్తాన్ యూనిలీవర్, ఎల్‌అండ్‌టిలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

# ప్రాధాన్యేతర పిఎస్‌ఇలను ప్రైవేటీకరించడమే మేలు



### కేంద్రానికి సిఐఐ ప్రతిపాదనలు

**ముంబయి, జనవరి 19:** లాభదాయకత లేని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడంద్వారా పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయాలని, దీనివల్లస్థిరమైన మూలధన వ్యయం కూడా అందుతుందని పారిశ్రామిక సంఘాల సమాఖ్య సిఐఐ కేంద్రానికి విజ్ఞప్తిచేసింది. ప్రభుత్వరంగ సంస్థలప్రైవేటీకకరణ అనేది ఫాస్ట్‌ట్రాక్‌లో జరగాలని సూచించింది. కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి ముందస్తుప్రతిపాదనలను సిఐఐ అందించింది. ప్రైవేటీకరణ వ్యూహం వల్ల ప్రభుత్వం నిధులు సమీకరిస్తుందని, అభివృద్ధి ప్రాధాన్యతలు పెరుగుతాయని సూచించింది. సామర్థ్యం పెరిగి, టెక్నాలజీ వర్తింపు కూడా సాధ్యం అవుతుందని, ప్రపంచస్థాయి పోటీతత్వం అలవడుతుందని సూచించింది. అంతేకాకుండా విదేశీ ఇన్వెస్టర్ల రాకతో ప్రైవేటు భాగస్వామ్యం కూడా పెరుగుతుందని సిఐఐ సూచించింది. సిఐఐ డైరెక్టర్‌జనరల్ చంద్రజీత్ బె.ర్జీ మాట్లాడుతూ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం, కొత్తకొత్త సృజనాత్మక ఒరవడులతోనే భారత్ వృద్ధి ఆధారపడి ఉందని, ప్రైవేటీకరణ పాలసీ ఇపుడు కీలకంగామారుతోందని, వికసిత్‌భారత్ లక్ష్యసాధనలో పారిశ్రామి కరంగ వృద్ధికూడా అవసరమని సూచించింది. ప్రభుత్వ వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను వేగవంతంచేయాలని, ప్రస్తుతం ఉన్న అన్ని పిఎస్‌ఇల్లో లాభదాయకత లేని ప్రధానం కాని రంగాలనుప్రైవేటీకరించాలని లేదా పెట్టుబడులను ఉపసంహరించడంశ్రేయస్కరమని సూచించింది. ఇందుకు నాలుగంచెల వ్యూహం అవసరమని డిమాండ్ ఆధారిత వైఖరి అవసరమిన,ఎంపికచేసిన ప్రభుత్వరంగసంస్థలనే ముందు పెట్టుబడులు విత్‌డ్రా చేయాలని, ఇన్వెస్టర్ల ఆసక్తిని కూడా గమనించాలని, డిమాండ్ తగ్గితే వేచిచూసే ధోరణి అవసరమని బెనర్జీ సూచించారు. ప్రైవేటీకరణ పైప్‌లైన్‌కు మూడేళ్ల కాలవ్యవధి ఉండాలని,ద ఈనివల్ల వాటి లావాదేవీలు కూడాప ఎరుగుతాయన్నారు. ఈ ప్రైవేటీకరణ పర్యవేక్షించేందుకు ఒక స్పష్టమైన సంస్థాగత వ్యవస్థను ఏర్పాటుచేయాలనిసూచించింది.ఈ బోర్డులో పారిశ్రామికరంగం, లీగల్ నిపుణులు కూడా ఉండాలన్నారు. ఇకకీలకంగా లేని ప్రభుత్వరంగసంస్థలను పూర్తిస్థాయిలో ప్రైవేటీకరించడమే మేలని లేనిపక్షంలో ముందు ప్రభుత్వం తన వాటాను 51శాతానికి తగ్గించుకోవాలనిసూచించింది. ఆ తర్వాత క్రమేపీ 33శాతం, 26శాతానికికూడా తగ్గించాలని సిఐఐ సూచించింది. మొత్తం 78 పిఎస్‌ఇల్లో ప్రభుత్వ వాటాను 51శాతానికి తగ్గించుకుంటే రూ.10 లక్షలకోట్లు రాబడులు వస్తాయని అంచనావేసింది. మొదటి రెండేళ్లలో 55 పిఎస్‌ఇల్లో ప్రభుత్వ వాటా 75శాతం లేదా అంతకుమించి తగ్గిస్తే 4.6 లక్షల కోట్లు వస్తాయని, దశలవారీగా తగ్గించుకుంటే మరో 5.4లక్షలకోట్లు రాగలవని సిఐఐ వెల్లడించింది.



## మైక్రో ఫర్టిలైజర్స్‌పై 5% జిఎస్టీని అమలు చేయాలి

**న్యూఢిల్లీ, జనవరి 11:** భారతీయ సూక్ష్మ ఎరువుల ఉత్పత్తి సంఘం జిఎస్టీని అన్ని ఎరువులపైనా ఐదుశాతానికి తగ్గించాలని సూచించింది. ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల కింద ఈ మినహాయింపు ఇవ్వాలని, అలాగే అదనంగా వసూలుచేసిన జిఎస్టీని రీఫండ్ చేయాలని సూచించింది. అంతేకాకుండా మైక్రో ఫర్టిలైజర్ కంపెనీలకోసం ఏకీకృత లైసెన్సింగ్ వ్యవస్థ అను నసరించాలని కోరింది. జిఎస్టీ 2.0ఒక చరిత్రాత్మక సంస్కరణ అని జిఎస్టీని 12నుంచి ఐదుశాతానికి తగ్గించడంవల్ల ఒకటో షెడ్యూలులోని ఉత్పత్తులు అన్నీ కూడా ఈ ప్రయోజనం పొందుతాయని వెల్లడించింది. అయితే ఈ మైక్రో ఫర్టిలైజర్ ఉత్పత్తిదారులు ఇన్వర్టడ్ సుంకాల వ్యవస్థను ఎదుర్కోనాల్సి వస్తోందని, ముడిసురుకులు, సేవలపై అత్యధిక జిఎస్టీ పడుతోందని ఆందోళన వ్యక్తంచేసారు. దీనివల్ల ఉత్పత్తిదారులకు వర్కింగ్ క్యాపిటల్ లాక్‌అవుతోందని సంఘ అధ్యక్షుడు రాహుల్ మిర్చందాని చెప్పారు. ఇందుకోసంముందు ఒకేవిధమైన ఐదుశాతం జిఎస్టీని అన్ని ఎరువులపైనా అమలు చేయాలని కోరారు.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.